PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 35 | విజయవాడ, బుధవారం 4 సెప్టెంబర్ 2024 | 8 + 8 పేజీలు : 5.50

Vol No | Vijayawada, Wednesday 4 September 2024 | Rs

హృదయ విదారకం

సింగ్‌నగర్‌లో ఇంట్లోకి వరద నీరు రావడంతో పద్మావతి (48) అనే మహిళ గుండె ఆగి మరణించారు. సోమవారం ఈ ఘటన జరిగింది. అప్పటి నుండి ఇంట్లోనే మృతదేహంతో ఉన్న కుటుంబ సభ్యులు చివరికి తోపుడు బండిపై మృతదేహాన్ని వరద నీటిలోనే నాలుగు కిలోమీటర్ల ప్రయాణం సాగించి శ్మశాన వాటికకు తరలించారు. (వార్త 2లో)



సింగ్‌నగర్ నుంచి శ్మశానవాటికకు తోపుడు బండిపై భార్య పద్మావతి మృతదేహాన్ని తరలిస్తున్న భర్త శ్రీనివాసరావు (మధ్యలో వ్యక్తి)

ఇంకా జలదిగ్బంధంలోనే...

ఆహారం, మంచినీటి కోసం పాట్లు
సహాయక చర్యలు ముమ్మరం



వరద నీరు స్వల్పంగా తగ్గడంతో ముంపులో చిక్కుకున్నవారిని రక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న సహాయక బలగాలు, బాధితుల బంధుమిత్రులు

ప్రజాశక్తి- యంత్రాంగం

ఇంకా వరద నీటిలోనే ప్రజలు అల్లాడుతున్నారు. బుడమేరు, కృష్ణా నది వరదల కారణంగా ముంపున కు గురైన ప్రాంతాల్లో బాధితుల ఆర్తనాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వరదలు తగ్గుముఖం పట్టినా ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల జిల్లాలోని అనేక ప్రాంతాలు ఇంకా జలదిగ్బంధనం లోనే ఉన్నాయి. రాష్ట్రంలో 6.64 లక్షల మంది వరద ముంపునకు గురయ్యారు. 4.45 లక్షల ఎకరాల్లో పైర్లు దెబ్బతిన్నాయి. దాదాపు 25 మంది చనిపోయారు. అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. 163 సహాయక శిబిరాలను ఏర్పాటు చేసి 43,417 మందిని తరలించారు. 197 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఇంకా ముంప నీటిలోనే ఉన్నవారికి డ్రోన్లు, హెలికాప్టర్లు, బోట్ల సాయంతో ఆహారం, మంచినీరు, పాలు పంపిణీ చేస్తున్నారు. ఇంకా చాలా ప్రాంతాల్లో ఆహారం అందలేదు. ఆహారం, సహాయక సామగ్రిని లారీలు, ట్రాక్టర్లతో ముంపు ప్రభావిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. అక్కడి నుంచి వాటిని ముంపు బారిన పడ్డ బాధితుల వద్దకు బోట్లలో చేరవేయాలి. కానీ, లోతట్టు ప్రాంతాలకు అవి చేరడం లేదు. పంపిణీ బృందాలు ప్రధాన రహదారులను దాటి ముంపుల్లో ఉన్న వీధుల్లోపలికి రావట్లేదని, తాము ఆకలితో అల్లాడిపోతున్నామని బాధితులు వాపోతున్నారు. ముఖ్యంగా సింగ్‌నగర్, జక్కంపూడి కాలనీ, భవానీపురంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. ఇళ్లల్లో యువకులు ఉంటే వారు ఎలాగోలా బయటకొచ్చి మిగతా కుటుంబ సభ్యుల కోసం ఆహారాన్ని తీసుకెళ్లగలుగుతున్నారు. వృద్ధులు, మహిళలు, నడివయస్కులు ఉన్నవారు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమను రక్షించమని పలువురు బాధితులు వేడుకుంటున్నారు. వరద వచ్చి మూడు రోజులైనా అధికారులు తమవైపు చూడడంలేదని వాపోతున్నారు. తమ వారి ఫోన్లు పని చేయడం లేదని బాధితుల బంధువులు ఆందోళన చెందుతున్నారు. అనేకమంది బాధితులు భవనాలపైనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఇంకా విద్యుత్తు పునరుద్ధరణ జరగలేదు. వరదలో చిక్కుకున్న బాధితుల అవస్థలను ఆసరాగా తీసుకుని ప్రయివేటు బోటు, ట్రాక్టర్ల యజమానులు ఇంకా డబ్బులు వసూలు చేస్తూనే ఉన్నారు.

(వార్తలు లోపలి పేజీల్లో)

వరద బాధితులను విరాళాలు ఇచ్చి ఆదుకోండి

- సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులను విరివిగా విరాళాలిచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రజానీకానికి సిపిఎం రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాల వల్ల 17 మంది చనిపోయారని తెలిపారు. కృష్ణానది, బుడమేరుకు గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూలేనంత వరద రావడం వల్ల లక్షలాదిమంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. వందల ఇళ్లు కూలిపోయాయని, ఇంట్లో సామాన్లు, నిత్యావసరాలు పనికిరాకుండా పోయాయని పేర్కొన్నారు. వరద సహాయ కార్యక్రమాల్లో సిపిఎం భాగస్వామిగా ఉందని, బాధితులకు వసతి, ఆహారం, నీరు అందించడానికి కార్యకర్తలు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సహాయం సరిపోదని, మరింత కావాలంటే రాష్ట్ర ప్రజానీకమంతా తోడ్పాటు అందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

విరాళాలు ఈ బ్యాంకు అకౌంట్‌కు పంపండి

అకౌంట్ పేరు : సిపిఐ(ఎం) పీపుల్స్ రిలీఫ్ ఫండ్,
అకౌంటు నెంబరు : 62109192143
బ్యాంకు పేరు : స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా,
ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ : SBIN 0020343
బ్రాంచ్ పేరు : బీసెంట్ రోడ్ బ్రాంచ్, విజయవాడ

విరాళం పంపిన తరువాత ఆ సమాచారాన్ని 9490099018కు వాట్సాప్ లేదా ap@cpim.org మెయిల్‌కు పంపించాలని ఆయన కోరారు.



సింగ్‌నగర్ ముంపు ప్రాంతం నుండి సహాయక శిబిరానికి తరలిస్తున్న బాధిత మహిళతో మాట్లాడుతున్న చంద్రబాబు

సహాయక చర్యల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు 2

బుడమేరుకు గండి

ప్రజాశక్తి- విజయవాడ

విజయవాడలోని మధురానగర్-దేవీనగర్ మధ్య రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం బుడమేరుకు గండిపడింది. దీంతో, బుడమేరు నీరు పక్కనే ఉన్న ఏలూరు కాల్వలో కలిసి ప్రవహిస్తోంది. మధురా నగర్ రోడ్డుపైకి నీరు చేరేలా ఉంది. నీరు ఉధృతంగా ప్రవహిస్తుండ డంతో ఏలూరు కాల్వకు గండ్లు పడే అవకాశం ఉంది. ఈ ఘటనతో ఆ ప్రాంతాల ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. గండిపడిన ప్రాంతాన్ని ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. దానిని పూడ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా మధురా నగర్, రామవరప్పాడు, ప్రసాదంపాడు ప్రజలను అప్రమత్తం చేశారు.



విజయవాడ మధురానగర్ వద్ద బుడమేరుకు గండిపడి ఏలూరు కాల్వలోకి వెళుతున్న నీరు

మరో ఆరు మృతదేహాలు లభ్యం

బుడమేరు వరద ముంపులో మృతుల సంఖ్య పెరుగుతోంది. మంగళవారం మరో ఆరు మృతదేహాలు వెలుగు చూశాయి. విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్ పైపుల రోడ్డు సమీపంలోగల ఏ వన్ టీ స్టాల్ వద్ద ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడి వయసు 50 ఏళ్లు ఉండొచ్చని అంచనా. ఆహారం, నీరు దొరక్క మరణించాడని ప్రచారం జరుగుతోంది. అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు వరద ముంపులో మరో నాలుగు మృతదేహాలు బయటపడ్డాయి. మృతుల్లో విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరిపేటకు చెందిన కొడాలి యశ్వంత్(20)ఉన్నారు. ఆయన మృతదేహాన్ని పూర్ణానందంపేటలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తరలించారు. అజిత్‌సింగ్ నగర్‌లో రెండు మృతదేహాలను కుటుంబ సభ్యులు తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపించాయి. వారి వివరాలు తెలియరాలేదు. కండ్రికలో ఓ గుర్తు తెలియని మృతదేహం బయటపడింది.

బయటపడ్డ లైన్‌మేన్ మృతదేహం

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడిలో కృష్ణా వరదలో గల్లంతైన కీలేశపురానికి చెందిన లైన్‌మెన్ కోటేశ్ మృతదేహం మంగళవారం లభ్యమైంది. గల్లంతైన ప్రదేశానికి కొద్దిదూరంలోనే ఆయన మృతదేహాన్ని గుర్తించారు. కాగా, వరదలు, వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇప్పటికే 19 మంది మృతి చెందారు. దీంతో, మృతుల సంఖ్య 25కు చేరుకుంది.

గోగూండాల ఘాతుకానికి ఇంటర్ విద్యార్థి బలి

న్యూఢిల్లీ : గో గూండాల ఘాతుకానికి అన్నెం పున్నెం ఎరుగని ఇంటర్ విద్యార్థి బలయ్యారు. గత నెల 23న చోటుచేసుకున్న ఈ దారుణం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ హత్యపై తీవ్ర నిరసనాగ్రహాలు వ్యక్తం కావడంతో హర్యానా పోలీసులు అయిదుగుర్ని అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఆర్యన్ మిశ్రా, అతడి స్నేహితులు షాంకీ, హర్షిత్ కారులో వెళ్తున్నారు. వారిని నిందితులు కారులో వెంబడించారు. మిశ్రా కారును ఆపేందుకు గో గూండాలు యత్నించారు. వీరిని లెక్కచేయకుండా ఆ విద్యార్థి కారును ముందుకు పోనివ్వడంతో కాల్పులకు తెగబడ్డారు. నిందితులను సౌరభ్, అనీల్ కౌశిక్, వరుణ్, కృష్ణ, ఆదేశ్‌లుగా గుర్తించినట్లు పోలీసులు వివరించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో గోగూండాల దారుణాలకు అంతులేకుండా పోతోంది. పశువులను వధించేందుకు తరలిస్తున్నారని, గోవుల మాంసం తీసుకెళ్తున్నారని, వంట కోసం ఇంటిలో దాచి వుంచారని ఆరోపిస్తూ ముస్లిములను, దళితులను కొట్టి చంపుతున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటూనే ఉన్నాయి.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- తొమ్మిదిమంది మావోయిస్టుల కాల్చివేత
- మృతుల్లో ఆరుగురు మహిళలు



దంతేవాడ అడవుల్లో జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. దంతెవాడ, బీజాపూర్ జిల్లాల సరిహద్దుల్లోని లోహగావ్, పురంగెల్, అండ్రి దండకారణ్య గుట్టల్లో పోలీసు కాల్పుల్లో మంగళవారం తొమ్మిదిమంది మావోయిస్టులు చనిపోయారు.. పోలీసుల కథనం ప్రకారం గుట్టల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. పోలీసులను చూసిన మావోయిస్టులు కాల్పులు జరపగా పోలీసులు ఎదురు కాల్పులు జరిపారని స్థానిక మీడియా తెలిపింది.. ఘటనా స్థలం నుంచి తొమ్మిదిమంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్టు దంతెవాడ ఎస్‌పి గౌరవ్ రాయ్ తెలిపారు. మృతులను పశ్చిమ బస్తర్ దర్భా డివిజన్ కమిటీ సభ్యులుగా,ఘటనా స్థలి నుంచి ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్, 303 రైఫిల్, బిజిఎల్ లాంచర్లు, 12 బోర్ రైఫిల్, 315 బోర్ గన్‌తో సహా భారీ మొత్తంలో ఆయుధాలు, దైనందిక సామగ్రి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌పి తెలిపారు. ఘటనా స్థలానికి అదనపు బలగాలను పంపినట్టు చెప్పారు. ఇది ఎన్‌కౌంటర్ కాదని, పోలీసులే హతమార్చి ఎన్‌కౌంటర్‌గా చిత్రించారని హక్కుల కార్యకర్తలు విమర్శించారు.

మావోయిస్టులను తుడిచిపెట్టే వరకూ యుద్ధం కొనసాగుతుందని ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్‌సాయి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జోన్‌లో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకూ 153 మంది మావోయిస్టులను భద్రతా దళాలు కాల్చివేశాయని బస్తర్ పోలీసులు తెలిపారు. 669 మందిని అరెస్టు చేశామని, 656 మంది లొంగిపోయారని పేర్కొన్నారు. బీజాపూర్ జిల్లాలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 13 మంది మావోయిస్టు గ్రూపులకు చెందిన 13 మంది క్రియాశీల సభ్యులను అరెస్టు చేసి, మంగళవారం జైలుకు పంపినట్లు తెలిపారు.

భోరుమంటున్న ఖరీఫ్ రైతు

- బీమా ప్రశ్నార్థకం
- జులై వర్షాలకు ఇంకా అందని ఇన్‌పుట్ సబ్సిడీ
- ప్రస్తుత విపత్తు పరిహారం ఎప్పటికో?



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్ రైతు భోరుమంటున్నాడు. ప్రస్తుతం కురిసిన భారీ వర్షాలు, వరదలతో పంటలు నష్టపోయిన బాధిత రైతాంగానికి బీమా ప్రశ్నార్థకంగా మారింది. ఇన్‌పుట్ సబ్సిడీ (పెట్టుబడి రాయితీ) అందడానికి చాలా సమయం పట్టేట్లుంది. ఎన్యుమరేషన్ పూర్తయి, పరిహారానికి అర్హులైన వారి తుది జాబితాలు ఖరారయ్యి, నిధులు విడుదలై, పంపిణీ చేపట్టేసరికి నెలలు గడవచ్చవన్నది ప్రభుత్వంలోని వారి అంచనా. జులైలో కురిసిన భారీ వర్షాలతో పంటలు నష్టపోయిన వారికి ఇంకా ఇన్‌పుట్ సబ్సిడీ పెండింగ్‌లో ఉంది. ఒక సీజన్‌లో ఒక రైతుకు ఒక పంటకు ఒకసారి మాత్రమే పరిహారం ఇవ్వాలన్న నిబంధన వరద బాధిత అన్నదాతలకు ప్రభుత్వం చేసే కొద్దిపాటి ఆర్థిక సహాయానికీ గండి కొడుతోంది. ఇక పరిహారం చెల్లించేందుకు నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఆసిస్టెన్స్ రూల్స్ ఎప్పుడో 2014లో హుదూద్ తుపాన్ సమయంలోనివి. దశాబ్దంనాడు ఖరారు చేసిన సాయాన్నే నేటికీ అమలు చేస్తున్నారు. ఉదాహరణకు వరి, పత్తి వంటి ప్రధాన పంటలకు ఎకరాకు ఇచ్చేది రూ.6 వేలు. ఆ సాయాన్ని పెంచాలని కొన్నేళ్లుగా రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన వరదలను ప్రత్యేకంగా పరిగణించి ఉదారంగా సాయం చేయాలన్నది రైతుల ఆకాంక్ష.

మొదలే కాని ఇన్సూరెన్స్ ప్రక్రియ

ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రశ్నార్థకమైంది. సమగ్ర పంటల బీమా పాలసీపై అధ్యయనానికి ప్రభుత్వం మంత్రుల కమిటీని నియమించింది. నివేదిక రావడానికి ఆలస్యమవుతుందని భావించి ఈ సీజన్‌కు పాత విధానంలోనే బీమా అమలవుతుందని ప్రభుత్వం ప్రకటించింది. దిగుబడి ఆధారిత (ఫసల్), వాతావరణ ఆధారిత స్కీంల అమలుకు ఇంకా ఇన్సూరెన్స్ కంపెనీలను ఖరారు చేయలేదు. జిల్లాల వారీగా పంటలను నోటిఫై చేయలేదు. కంపెనీలకు ప్రీమియం చెల్లించలేదు. ఇప్పటికే కేంద్ర పథకాల్లోకి వెళ్లాక 2022-23 రబీ నుంచి రైతులకు క్లెయిములు లేవు. ఆ రెండు సీజన్లకు కలిపి రూ.1,251 కోట్లు ప్రీమియాన్ని కంపెనీలకు త్వరలో చెల్లిస్తామని, రైతులకు రూ.1,393 కోట్ల పరిహారం ఇప్పిస్తామని అసెంబ్లీలో సర్కారు హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రీమియం చెల్లించలేదని సమాచారం. రెండేళ్ల బీమానే ఇలా ఉంటే, ప్రస్తుత సీజన్‌కు కనీసం కంపెనీలను కూడా నిర్ణయించలేదని, వరద నష్టానికి బీమా ఆశలు వదులుకున్నట్లేనని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

పెట్టుబడి రాయితీ జాగు

విపత్తులతో రైతులు పంటలు నష్టపోయిన సందర్భంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రూల్స్ ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పని చేయాలి. ప్రస్తుత వర్షాలు, వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సిఎం కేంద్రాన్ని కోరినట్లు వార్తలొచ్చాయి. అయితే అటువంటి మిగతా 7లో

ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు దుర్మరణం

ప్రజాశక్తి- ఆనందపురం (విశాఖపట్నం)

విశాఖ జిల్లాలో ఆనందపురం-పెందుర్తి రోడ్డులో ఆనందపురం బ్రిడ్జిపై మంగళవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా నుంచి చేపల లోడుతో వస్తున్న లారీ ఆనందపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపాన అదుపు తప్పి రాయగడ పేపర్ మిల్లు నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. దీంతో, రెండు లారీల డ్రైవర్లు అక్కడికక్కడే మృతి చెందారు. వారిని ఒడిశా రాష్ట్రం బోనాపూర్‌కు చెందిన భాస్కర్ (44), రాయగడ సమీపంలోని జిముడుపేటకు చెందిన వన్నెల గౌరీ శంకర్ (36)గా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన చేపలలోడు లారీ క్లీనర్ ప్రధాన్ (42) విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో క్లీనర్ ఢిల్లీశ్వరరావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం విశాఖ కెజిహెచ్‌కు పోలీసులు తరలించారు. చేపల లోడ్ లారీ డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు.

ఇడబ్ల్యుఎస్ కోటా జిఓ వాపస్ తీసుకోండి

- ప్రైవేటు మెడికల్ కన్వీనరు కోటా సీట్ల కేసులో హైకోర్టు సూచన

ప్రజాశక్తి-అమరావతి

మైనార్టీయేతర ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా కింద జనరల్ కేటగిరిలో భర్తీ చేసే పది శాతం సీట్లను ఆర్థిక బలహీన తరగతులకు (ఇడబ్ల్యుఎస్) కేటాయింపునకు వీలుగా జిఓ 94 అమలును ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచన చేసింది. ప్రభుత్వ అభిప్రాయం కోసం విచారణను 3 వారాలకు వాయిదా వేస్తున్నట్లు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం ఆదేశించింది. ఇడబ్ల్యుఎస్ కోటా అమలు జిఓ రాజ్యాంగ విరుద్ధమంటూ విజయనగరం జిల్లాకు చెందిన పోగిరి ఛరిష్మా, గుంటూరు జిల్లాకు చెందిన అప్పారి సాయి వెంకట ఆదిత్య, యమవరపు మృదులత హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారు. జిఓ అమలును నిలిపేస్తూ గతంలోనే హైకోర్టు స్టే విధించింది. జిఓ 94తో పాటు ప్రస్తుతం జనరల్ కేటగిరిలో ఉన్న 50 శాతం సీట్లలోనే ఇడబ్ల్యుఎస్ 10 శాతం కోటాను కూడా సర్దుబాటు చేయాలని పేర్కొంటూ ఎన్‌ఎంసి జారీ చేసిన పబ్లిక్ నోటీసును రద్దు చేయాలంటూ గుంటూరుకు చెందిన టి శ్రీజ మరో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యాలన్నింటినీ మంగళవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపిన సందర్భంగా పైవిధంగా ప్రభుత్వానికి కీలక సూచన చేసింది.



ఆర్‌ఎస్‌ఎస్‌లోకి ఉద్యోగులను అనుమతించొద్దు
కేంద్ర ప్రభుత్వానికి మాజీ సివిల్ సర్వెంట్ల గ్రూప్ 7

ఆహారం అందుతుందా? లేదా?

- బాధితులను అడిగి తెలుసుకున్న సిఎం
- సితార సెంటర్, నున్న బైపాస్‌లో విస్తృత పర్యటన

ప్రజాశక్తి - విజయవాడ

నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం కూడా పర్యటించారు. జెసిబి ఎక్కి ముంపు ప్రాంతాల్లో విస్తతంగా పర్యటించారు. వరద సహాయక చర్యలను పర్యవేక్షించారు. బాధితుల వద్దకు ఆయన నేరుగా వెళ్లి సమీక్షించారు. సితార సెంటర్ నుంచి ఇతర ప్రాంతాల గుండా నున్న బైపాస్‌కు వెళ్లారు. బాధితులకు సదుపాయాలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. బాధితులందర్నీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆహారం అందుతుందా? లేదా? అని బాధితులను అడిగి తెలుసుకున్నారు. కాలనీల్లో చివర ఉన్న ఇళ్లకు ఆహారం అందడంలేదని వస్తున్న వార్తలపై చంద్రబాబు ఆరా తీశారు. ప్రజల నుంచి వచ్చే స్పందన ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాధితులకు సురక్షిత ప్రాంతాలకు తరలించాం : మంత్రి నారాయణ

వరద ముంపు ప్రాంతాల్లో అనేక మంది బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. బాధితులందరికీ ఆహారం అందేలా ఏర్పాట్లు చేశామన్నారు. వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం ఒక్క రోజే 8.5 లక్షల టిఫిన్ ప్యాకెట్లు, 8.5 లక్షల అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశామని, ఐదు లక్షల వాటర్ బాటిళ్లు బాధితులకు అందించామని తెలిపారు. వరద నీరు తగ్గిన తర్వాత రోడ్లపై మురుగు లేకుండా పారిశుధ్య నిర్వాహణపై దృష్టి పెడుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 123 మంది మున్సిపల్ కమిషనర్లకు వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖతో కలిసి వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన

వరద ప్రభావిత ప్రాంతమైన సింగ్‌నగర్‌లో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటించారు. సింగ్‌నగర్, వైఎస్ఆర్ కాలనీల్లో ముంపు తీవ్రతకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్లో మంత్రి ఎస్.సవిత మీడియాతో మాట్లాడుతూ.. అవసరమైన మంచినీరు, ఆహార ప్యాకెట్లను యుద్ధ ప్రాతిపదికన అందిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు దైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

వరద బాధిత ఉద్యోగులకు క్యాజువల్ సెలవులు ఇవ్వండి

- ఎన్ఎంయు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో చాలా జిల్లాల్లో ఆర్‌టిసి ఉద్యోగులు విధులకు హాజరుకాలేని పరిస్థితి వుందని, వరద బాధిత ఉద్యోగులందరికీ క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని ఎన్ఎంయు కోరింది. ఈ మేరకు ఎన్ఎంయు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి వెంకటరమణారెడ్డి, వై శ్రీనివాసరావు మంగళవారం ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు వినతిపత్రం అందజేశారు. కృష్ణా గుంటూరు, పశ్చిమ గోదావరి ఉమ్మడి జిల్లాల్లో ఆర్‌టిసి ఉద్యోగులు విధులకు హాజరుకాలేని విధంగా వరదల్లో చిక్కుకుపోయారని, వారందరికీ సెలవులు మంజూరు చేయాలని కోరారు. వరద బాధిత ఆర్‌టిసి ఉద్యోగులకు సెలవులు ప్రకటించాలని, ఆర్థిక సాయం అందజేయాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య కోరారు.

సహాయక చర్యల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరిక
- ఒకరిపై సస్పెన్షన్ వేటు
- నాలుగు గంటలపాటు జెసిబిపై ప్రయాణం


సితార సెంటర్‌లో జెసిబిలో నుంచి బాధితులతో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బాధితులను ఆదుకునే సహాయక చర్యల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ముంపు ప్రాంతాల్లో ఒక్కో సచివాలయానికి ఒక్కో సీనియర్ అధికారిని నియమించామని చెప్పారు. బాధితుల కోసం పది జిల్లాల నుండి ఆహారం తీసుకువస్తున్నట్లు తెలిపారు. చివరి వ్యక్తి వరకూ సాయం అందడమే లక్ష్యమని అన్నారు. బాధితులు ఇప్పటికే రెండురోజులు ఇబ్బంది పడ్డారని, ఇక పడటానికి అవకాశం ఉండకూడదని తెలిపారు. దీనిపై ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, వాటిని పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సహాయ చర్యల్లో నిర్లక్ష్యం వహించిన ఒక అధికారిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు. సరిగా పనిచేయకపోతే ఎవరినీ ఉపేక్షించబోమని, మంత్రులు కూడా సరిగా పనిచేయకపోయినా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మన కుటుంబ సభ్యులు ఒకరు చనిపోతే మనం ఎలా బాధపడతామో అధికారులు కూడా ప్రజల బాధల పట్ల అలాగే ఉండాలని తెలిపారు. గత రెండురోజుల్లో కొద్దిమంది అధికారులు సరిగాపనిచేయలేదని, ప్రజలు కట్టే పన్నుల నుండి జీతాలు తీసుకుంటూ తప్పుడు సంకేతాలు ఇచ్చి పరువు పోగొట్టుకోవద్దని హెచ్చరించారు. స్వయంగా తాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సాయం అందించాలని ఆదేశించినా కొంతమంది అధికారులు పనిచేయడం లేదని అన్నారు. ఆహార సరఫరా సమయంలో బాధితులు ఎక్కువగా గుమికూడకుండా, అందరికీ ఆహారం అందిస్తామని చెప్పారు. దీనికోసం ఆరు హెలికాప్టర్లు, 30 డ్రోన్లు తెప్పించామని వివరించారు. పోలీసులు సరిగా పనిచేయాలని, రెండు రోజులుగా బాధితులు పడుతున్న ఇబ్బందులను తాను కళ్లారా చూశానని అన్నారు. బిడ్డను బతికించుకోవడానికి భార్యను వదిలి భర్త రావాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవాలని అన్నారు. ప్రతి ఇంట్లోకి పాములు వచ్చి చేరుతున్నాయని, ప్రతి కుటుంబం బాధలో ఉందని ప్రతి ఒక్కరు మానవతా దృక్పథంతో స్పందించాలని అన్నారు. బాధితులు ఐవిఆర్ఎస్ కాల్స్‌కు సరైన సమాధానం ఇస్తే వెంటనే సేవలు అందుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రజానీకం కూడా బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని కోరారు. ఆపద సమయంలో కొందరు చెత్త రాజకీయాలు చేస్తున్నారని, వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే గుడ్లవల్లేరు కళాశాల ఘటన గురించి కొందరు మాట్లాడుతున్నారని, అటువంటి వారికి సిగ్గుండాలని అన్నారు. ప్రకాశం బ్యారేజీకి బోట్లు కొట్టుకువచ్చిన ఘటనపై విచారణ చేస్తామని అన్నారు. బాబాయ్‌ని చంపి నారాసుర రక్తచరిత్ర అని రాసిన వారిపై ఇలాంటి అనుమానాలు ఎందుకు రావని ప్రశ్నించారు. తప్పులు జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రతిపక్షనేత ఐదు నిముషాలు వచ్చి షోచేసి వెళ్లారని అన్నారు. అంతర్జాతీయ స్మగ్లర్ ఎస్కోబార్ కూడా జగన్ మాదిరే వ్యవహరిస్తారని తెలిపారు.

నాలుగు గంటలు బుల్డోజర్‌పై ప్రయాణం

సిఎం చంద్రబాబు మంగళవారం సుమారు నాలుగు గంటలపాటు వరద పాంతాల్లో బుల్డోజర్‌పై ప్రయాణించారు. నీళ్లలోకి దిగి బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సితారా సెంటర్ నుండి బయలుదేరి, జక్కంపూడి, పాయకాపురం, మీదుగా సింగ్‌నగర్ చేరుకున్నారు. మధ్యలో కనిపించిన వారందరినీ అడిగి బాగోగులు తెలుసుకున్నారు. అక్కడ నుండి నేరుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

ప్రకాశం బ్యారేజీకి ప్రమాదం లేదు

- గేటు బాగుంది.. కౌంటర్ వెయిట్ దెబ్బతింది
- వరద తీవ్రత తగ్గగానే మరమ్మతులు
- జలవనరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రకాశం బ్యారేజీలో బోట్లు అడ్డుపడి దెబ్బతిన్న 69వ గేటును ప్రముఖ ఇంజినీరింగ్ నిపుణులు, జలవనరులశాఖ సలహాదారు కన్నయ్య నాయుడు పరిశీలించారు. మంగళవారం ఆయన ప్రకాశం బ్యారేజీకి చెందిన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బ్యారేజీ పైకి చేరుకున్నారు. బ్యారేజీకి వున్న రెండు గేట్లు స్వల్పంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. బ్యారేజీ పటిష్టంగా ఉన్నట్లు నిర్ధారించారు. గేట్లు ఎత్తడం, మూయడం కోసం ఏర్పాటు చేసిన మెకానిజం, మోటారు యంత్రాల పనితీరును స్వయంగా పరిశీలించారు. తొలుత గేట్లకు అడ్డంగా ఉన్న బోట్లను తొలగించాలని అధికారులకు కన్నయ్య సూచించారు. వాటిని తొలగించాకే మరమ్మతులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. బ్యారేజీలో వరద ప్రవాహం 5 లక్షల క్యూసెక్కులకు తగ్గాకే పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. గేట్లకు అడ్డంగా వున్న బోట్లను తొలగించేందుకు కాకినాడ నుంచి నిపుణులను రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రకాశం బ్యారేజీ గేట్లు దెబ్బతినలేదని అన్నారు. గేటుకు సంబంధించి కౌంటర్ వెయిట్ మాత్రమే దెబ్బతిందని తెలిపారు. దెబ్బతిన్న కౌంటర్ వెయిట్ కోసం కొత్త బాక్సులను డిజైన్ చేశామన్నారు. కౌంటర్ వెయిట్ లేకున్నా సమస్య లేకుండా గేట్లు దింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. మళ్లీ గేట్లు ఎత్తేలోపే కౌంటర్ వెయిట్ ఏర్పాటు చేసుకోవాల్సి వుంటుందని, ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ఒక్క గేటుకే సమస్య ఉన్నందున మిగిలిన గేట్లు ఎత్తుకోవచ్చని స్పష్టం చేశారు. గేట్లు అందరూ అనుకున్నంత పూర్తిగా దెబ్బతినలేదని చెప్పారు. వాటిని దించకముందే ఢీకొన్న బోట్లను తీయాలని చూస్తున్నట్లు తెలిపారు. కన్నయ్య వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు విజయసారథి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మరో అల్పపీడనం

- 5 నుంచి భారీ వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బంగాళా ఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడి ఈ నెల 5వ తేదీ నుండి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ తెలిపింది. కోస్తాంధ్ర తీరాన్ని ఆనుకుని ఏర్పడనున్న ఈ అల్పపీడనంతో తెలుగురాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వున్నట్లు పేర్కొంది. కళింగపట్నం మీదుగా తూర్పు మధ్య బంగాళాఖాతం దాకా ఉపరితల ద్రోణి కొనసాగుతుందని పేర్కొంది. కోస్తాంధ్ర, యానాం వద్ద సముద్రమట్టం 3 నుండి 5.8 కిలోమీటర్ల ఎత్తుదాకా ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని తెలిపింది. ఈ అల్పపీడనంతో రెండు తెలుగురాష్ట్రాల్లో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం వుందని,ప్రధానంగా కృష్ణా, గుంటూరు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, ఏలూరు, బాపట్ల ఎన్‌టిఆర్ జిల్లాల్లో ఈ వర్షాల ప్రభావం ఎక్కువగా వుండే అవకాశం వుందని ప్రజలు అప్రమత్తంగా వుండాలని పేర్కొంది.

పొలాల్లో తగ్గని నీరు

- గుంటూరు జిల్లాలో వరి రైతులకు కోలుకోలేని దెబ్బ
- పల్నాడు జిల్లాలో మిర్చి, పత్తికి భారీ నష్టం


దుగ్గిరాల మండలంలో నీటమునిగిన ఉద్యాన పంటలు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ వర్షాలు, వరద ప్రభావం తగ్గినా పొలాల్లో నీరు ఇంకా బయటకు పోవడం లేదు. పలు కాల్వలకు గండ్లు పడి వరద నీరు పొలాల్లోకి చేరింది. భారీ వర్షాలకు రహదారులు, కాల్వలలో నీటి ప్రవాహం కొనసాగుతుండడంతో పొలాల నుంచి నీటిని బయటకు పంపేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భారీ వర్షం, వరదలకు 2.10 లక్షల ఎకరాల్లో పైర్లు నీట మునిగాయి. వరి, పత్తి, మిర్చి, పసుపు, కంది, మినుము, పెసర, అరటి, కంద, ఇతర కూరగాయలు తదితర పంటలు నీటిలో తేలియాడుతున్నాయి. త్వరగా నీరు బయటకుపోతే పైర్లు నిలదొక్కుకుంటాయని, ఎక్కువ రోజులు నీరు నిలబడితే భారీగా నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెద పద్ధతిలో సాగు చేసిన వరి కొన్ని ప్రాంతాల్లో ఎందుకు పనికిరాకుండా పోయిందంటున్నారు. భారీ వర్షాలు, వరద వల్ల నష్టం తీవ్రత ఎక్కువగా ఉంది. ప్రధానంగా దాచేపల్లి, మాచవరం, అమరావతి, అచ్చంపేట, క్రోసూరు, తుళ్లూరు, తాడేపల్లి, పెదకాకాని, గుంటూరు రూరల్, తాడికొండ, కొల్లిపర, తెనాలి, పెదనందిపాడు, కాకుమాను తదితర మండలాల్లో పంట నష్టం ఎక్కువగా ఉంది. గుంటూరు జిల్లాలోని కృష్ణా పశ్చిమ డెల్టాలో 1.65 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉండగా, ఈ ఏడాది ఇప్పటి వరకు 1.35 లక్షల ఎకరాల్లో వేశారు. దాదాపు 70 వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. జిల్లాలో 70 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయాల్సి ఉండగా, 52 వేల ఎకరాల్లో వేశారు. 30 వేల ఎకరాల్లో పత్తి ముంపునకు గురైంది. 50 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేయాల్సి ఉండగా, 25 వేల ఎకరాల్లో వేశారు. దాదాపు 20 వేల ఎకరాల్లో మిర్చి పైరు ముంపునకు గురైంది. పసుపు, కంద, అరటి, మినుము, పెసర తదితర పంటలు మరో 40 వేల ఎకరాల్లో సాగు చేశారు. వీటిలో 20 వేల ఎకరాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పల్నాడు జిల్లాలో పత్తి, మిర్చి పంటలకు భారీ నష్టం జరిగింది. జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా దాదాపు 40 వేల ఎకరాల్లో నష్టం వాటిల్లింది. 60 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా 20 వేల ఎకరాల్లో మిర్చి పైరు నీట మునిగి ఉరకెత్తింది. ఉద్యాన పంటలు మరో పది వేల ఎకరాల్లో నీట మునిగాయి. మొత్తంగా గుంటూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 70 వేల ఎకరాల్లో పైర్లకు నష్టం జరిగిందని ప్రాథమిక అంచనాలను బట్టి తెలుస్తోంది. వరద ప్రభావంతో లంక గ్రామాలకు చేరువగా ఉన్న పొలాల్లో ఉద్యాన పంటలకు అధిక నష్టం జరిగింది. వరి, పత్తికి ఇప్పటికే ఎకరాకు రూ.15 వేల నుంచి 25 వేల వరకు పెట్టుబడి పెట్టామని, ప్రస్తుత పరిస్థితిలో పంట చేతికి వస్తుందన్న నమ్మకం కోల్పోయామని రైతులు వాపోతున్నారు.

నల్లమడుగు వాగుకు గండి

కాకుమాను మండలంలోని కొండపాటూరు గ్రామంలో అప్పాపురం డొంక దగ్గర నల్లమడుగు వాగుకు గండిపడడంతో పంట పొలాలు పూర్తిగా నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. లంక గ్రామాల్లో వరద నీరు తగ్గుముఖం పట్టినప్పటికీ చేలలో నీరు,బురద ఇప్పుడే తగ్గవని, వారం రోజులు పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసుపు, అరటి, కంద, చేమలాంటివి కుళ్లిపోతాయని వాపోతున్నారు. పసుపు విత్తనం ఎకరాకు రూ.30 పెట్టి కొన్నామని, నాటడానికి, దున్నడానికి మొత్తం కలిపి ఇప్పటివరకు ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టామని తెలిపారు. అరటి కూడా దాదాపు ఎకరాకు 40 వేల రూపాయలు, కంద, చేమ జాతికి చెందిన పంటలకు దాదాపు 30 వేల వరకు ఇప్పటికే పెట్టుబడి అయిందని చెప్పారు. కూరగాయలతో సహా అన్ని రకాల పంటలూ పూర్తిగా నష్టపోతాయని వాపోయారు. మురుగు, పంట కాలువల మరమ్మతులు, కొన్ని సంవత్సరాలుగా కట్టల పటిష్టం, పూడికతీత పనులు చేపట్టకపోవడం వల్ల వరద నీరు ఎగదన్ని పొలాల్లోకి ప్రవేశించిందని పలు మండలాల రైతులు తెలిపారు.

163 పునరావాస కేంద్రాల్లో 43,417 మంది బాధితులు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో వరద ముంపునకు 6.64 లక్షల మంది గురైనట్లు ప్రభుత్వం ప్రకటించింది. మొత్తం 163 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 43,417 మంది వరద బాధితులను తరలించారు. దీంతో పాటు 197 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఒక్క విజయవాడలోనే 70 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు ప్రకటించారు. సింగ్‌నగర్ వరద ముంపులో చిక్కుకున్న సుమారు 150 గొర్రెలు, 25 ఆవులను సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు పశు వైద్యాధికారులు తెలిపారు. వరద బాధితులకు స్వచ్ఛందంగా ఆహారం ఇవ్వాలనుకునే దాతల కోసం ప్రభుత్వం విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్దేశిత పాయింట్ ఏర్పాటు చేసింది. ఇందుకు కోసం ఐఎఎస్ అధికారి మన్‌జీర్‌ను 79067 96105 నంబర్‌లో సంప్రదించాలని కోరింది.


విజయవాడ రామలింగేశ్వర్ నగర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో వరద బాధితులు

తోపుడుబండిపై భార్య మృతదేహం తరలింపు

సింగ్‌నగర్‌లో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఇంట్లోకి వరద నీరు రావడంతో పద్మావతి (48) అనే మహిళ గుండె ఆగి మరణించారు. సోమవారం ఈ ఘటన జరిగింది. అప్పటి నుండి ఇంట్లోనే మృతదేహంతో ఉన్న కుటుంబ సభ్యులు చివరికి తోపుడు బండిపై మృతదేహాన్ని వరద నీటిలోనే నాలుగు కిలోమీటర్ల తీసుకెళ్లారు. ఆమె భర్త శ్రీనివాసరావు తన భార్య మృతదేహాన్ని తోపుడుబండిపై ఉంచి తోసుకుంటూ వరద నీటిలోనే ప్రయాణం సాగించారు. సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వరకు వచ్చి అధికారులను ప్రాధేయపడినా ఊరట దక్కలేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఎలాగూ నాలుగు కిలోమీటర్లు వచ్చారుగా ఇంకో కిలోమీటరు వెళితే ప్రధాన రహదారి వస్తుందంటూ ఉచిత సలహా ఇచ్చారని వాపోయారు. గుండెపోటు అని చెప్పినా పడవలు, అంబులెన్స్‌లు రాలేదని, దీంతో, బయటకు రాలేక, మందులు అందక తమ కళ్లెదుటే కన్నుమూసిందని ఆమె భర్త, కుమారులు తెలిపారు. చేసేదిలేక తోపుడు బండిపై మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించారు.

మహిళ ప్రసవం- తల్లీబిడ్డ క్షేమంగా తరలింపు

సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్ వద్ద వరద ముంపులోనే ఓ ఇంట్లో మహిళ ప్రసవించారు. సమాచారం తెలుసుకున్న ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు స్వయంగా బోట్లో వెళ్లి తల్లీబిడ్డలను క్షేమంగా బయటకు తీసుకొచ్చి సురక్షిత ప్రాంతానికి తరలించారు.

నీటి ముంపులో బస్సులు

ఇబ్రహీంపట్నం, విద్యాధరపురం డిపోల్లోని 60 ఆర్‌టిసి బస్సులు ఇంకా నీటి ముంపులోనే ఉన్నాయి. దీంతోపాటు సిబ్బంది కూడా ముంపులో చిక్కుకోవడంతో విజయవాడలో 20 బస్సు సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఆర్‌టిసి అధికారులు ప్రకటించారు.

వరద తగ్గుముఖం

మరోవైపు ప్రకాశం బ్యారేజీ వరద తగ్గుముఖం పట్టింది. వరద ప్రవాహం గంటగంటకూ తగ్గుతోంది. సోమవారం మధ్యాహ్నం 11.43 లక్షల క్యూసెక్కులుగా ఉన్న వరద 5.4 లక్షల క్యూసెక్కులకు తగ్గింది. బ్యారేజీ నుంచి కాలువలకు 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మరోవైపు గేట్లకు అడ్డుగా ఉన్న బోట్లలో రెండు కిందకు కొట్టుపోయాయి. మిగిలివాటిని తొలగింపునకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదల వల్ల పూర్తిగా నష్టపోయిన వ్యవసాయ కార్మిక కుటుంబాలకు పదివేల రూపాయల చొప్పున పరిహారం, ఆహార దినుసులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం కోరింది. ఈ మేరకు మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు ప్రకటన విడుదల చేశారు. అవసరమైన అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. చాలా జిల్లాల్లో పంట నీటమునిగిపోయిందని, దీంతో వ్యవసాయ కార్మికులకు వారం రోజులుగా పనులు లేవని పేర్కొన్నారు.

సిఆర్‌డిఎ అధికారులు రూ.కోటి సాయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల ఏర్పడిన వరద సాయం కింద ఒకరోజు వేతనం సుమారు కోటి రూపాయలు ఇస్తున్నట్లు ఎపి సివిల్ సర్వీస్ అసోసియేషన్ ప్రకటించింది. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఈ మొత్తాన్ని ఇవ్వనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు పి ధర్మచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వేశ్వరనాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీ టి బాపిరెడ్డి, ట్రెజరర్ మురళి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వరద బాధితులకు వైసిపి రూ.కోటి విరాళం

- సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం : జగన్



ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వరదల నేపథ్యంలో బాధితులకు చేయూతను అందించేందుకు వైసిపి రూ.కోటి విరాళం ప్రకటించింది. విజయవాడలో తలెత్తిన పరిస్థితిని స్వయంగా పరిశీలించిన మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వైసిపి ముఖ్య నాయకులు, ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన నేతలతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నాయకులతో మాట్లాడిన అనంతరం జగన్ రూ.కోటి విరాళం ప్రకటించారు. వరద ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రభుత్వం ఎలాంటి సహాయ కార్యక్రమాలు చేపట్టడం లేదని బాధితులు తన దృష్టికి తెచ్చారని వివరించారు. కనీసం ఆహారం, మంచినీరు కూడా దొరక్క లక్షలాది మంది ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ప్రభుత్వానిది కేవలం ప్రచార ఆర్భాటం తప్ప, వాస్తవంగా ఎలాంటి చర్యలూ అక్కడ లేవన్నారు. వరద ప్రాంతాల్లో షో చేస్తూ, ఫొటోలకు ఫోజులు ఇస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటిస్తున్నారని, అధికార యంత్రాంగమంతా ఆయనతో ఉంటూ, ప్రజల సమస్యలను గాలికొదిలేసిందని ఈ సందర్భంగా జగన్‌తో నాయకులు అన్నారు. వరద బాధితులు అనారోగ్యం పాలవుతున్నా వారికి మందులు కూడా లభించడం లేని పరిస్థితి వుందని జగన్ పేర్కొన్నారు. తన పర్యటనలో వరద బాధితులు పడుతున్న కష్టాలను స్వయంగా చూశానని, బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైందని జగన్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఘోర తప్పిదం వల్లే వరదలు ముంచెత్తాయని, అయినా ప్రభుత్వం వైసిపి మీద నింద మోపే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వరద బాధితుల కోసం పార్టీ తరపున రూ.కోటి సాయం ప్రకటిస్తున్నామని, ఆ మొత్తాన్ని ఏ రూపంలో, ఎలా ఇవ్వాలనేది చర్చించి నిర్ణయం తీసుకుంటామని జగన్ తెలిపారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు మెరుగు నాగార్జున, వెలంపల్లి శ్రీనివాస్, కారుమూరి నాగేశ్వరరావు, కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, కైలే అనిల్‌కుమార్, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ రూ.కోటి విరాళం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరద బాదితుల సహాయార్థం ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి ఆ మొత్తాన్ని అందచేయనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలలకే ఈ ప్రకృతి విపత్తు చోటు చేసుకోవడం బాదించిందని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసినట్లు బుడమేరుకు సంబంధించిన పనులను కూడా నిర్లక్ష్యం చేయడం వల్లే ఇంతటి విపత్తు ఇపుడు చోటుచేసుకుందని తెలిపారు. ఈ విపత్తుతో ప్రాణ నష్టంతోపాటు పెద్దఎత్తున ప్రభుత్వ, ప్రవేట్ ఆస్తులకు నష్టం వాటిల్లిందన్నారు.

వేమిరెడ్డి కోటి రూపాయల సాయం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

విజయవాడ వరద బాధితులకు నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు మంగళవారం రూ.కోటి విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును తన సతీమణి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి విజయవాడలో సిఎం చంద్రబాబుకు అందజేశారు. వరదల్లో సర్వం కోల్పోయి సాయం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు తమ వంతు సాయం అందించామని తెలిపారు. బాధిత ప్రజలు త్వరగా కోలుకోవాలని కోరారు. కష్టకాలంలో ప్రజలకు చేయూత ఇచ్చిన వేమిరెడ్డి దంపతులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయాశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, నెల్లూరు డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

వరద బాధితులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలి

- సిఐటియు రాష్ట్ర కమిటీ
- సంఘీభావనిధి వసూలు చేయాలని విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వరదల్లో చిక్కుకుపోయి సర్వం కోల్పోయిన ప్రజలు, కార్మికులను యుద్ధ ప్రాతిపదికన ఆదుకోవాలని సిఐటియు రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వరదల్లో మరణించిన వారికి సిఐటియు రాష్ట్ర కమిటీ తరపున సంతాపం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు చేస్తున్న ప్రయత్నాలు చాలడం లేదని, మరిన్ని సహాయక బృందాలను రంగంలోకి దించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం నుండి అవసరమైన సహాయక బృందాలు, సామగ్రిని తెచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వరద ముంపు ప్రాంతాల్లో బాధితులను ఆదుకునేందుకు సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు సహాయక చర్యల్లో పాల్గొనాలని, కార్మికవర్గం, మధ్యతరగతి వర్గాల నుండి సంఘీభావ నిధి సేకరించాలని అన్ని జిల్లాల, మండల కేంద్రాల నాయకత్వానికి వారు విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకు పరామర్శ

తాడేపల్లి పరిధిలోని మహానాడు, సుందరయ్య నగర్‌లోని వరద బాధితులను సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు కె ఉమామహేశ్వరరావు, కె ధనలక్ష్మి, తాడేపల్లి పట్టణ కార్యదర్శి వి దుర్గారావు, నాయకులు రామచంద్రరావు, ముఠా కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరావు, ఏడుకొండలు, ఎస్‌కె బాషా, శ్రామిక మహిళా నాయకులు లక్ష్మి, రేణుక తదితరులు పరామర్శించారు. సర్వస్వం కోల్పోయిన పేదలందరినీ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు జరిగిన నష్టాన్ని, ఇతర వివరాలను సేకరించే సందర్భంలో ప్రతి ఇంటినీ పరిశీలించి నివేదిక తయారుచేసి ప్రతి కుటుంబానికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొత్త రాడార్ వ్యవస్థలు ఎక్కడ ?

- సాంకేతిక సమస్యలతో ఎపి వాతావరణ శాఖ అవస్థలు
- విశాఖ, విజయవాడలో సింగిల్ పోలరైజేషన్ వ్యవస్థలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ వాతావరణ శాఖ వద్ద ఇంకా 'పాత చింతకాయ పచ్చడి' మాదిరిగానే వాతావరణ విపత్తులను కనుగొనే వ్యవస్థలున్నాయని తెలుస్తోంది. గాలి, సముద్రం, నేలపై జరిగే మార్పులకు సంబంధించిన పరిశోధన, తుపాన్లను కొద్ది గంటల్లోనే కనుక్కునే అవకాశాలు కొత్త డ్యూయల్ రాడార్ వ్యవస్థల ద్వారానే సాధ్యమని, ఇప్పుడు విశాఖపట్నం, విజయవాడల్లో వినియోగించే సాంకేతికతలు సరిపోవు. తుపాన్లు, ఇతర వాతావరణ సంబంధిత విపత్తులేవైనా కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పుడే పసిగట్టే వ్యవస్థలు ఇంకా అందుబాటులో లేవన్నది తాజా ఘటనలు పట్టిచూపుతున్నాయి. విజయవాడను అతలాకుతలం చేసిన వరద ప్రాణ, ఆస్తి నష్టం వంటివి భవిష్యత్తులో జరగకుండా ఉండాలంటే డ్యూయల్ పోలరైజేషన్ సిస్టం (ద్వంద్వ వాతావరణ రాడార్లు)తోనే సాధ్యమని వాతావరణ నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా 200 కిలోమీటర్ల మేరకే వాతావరణంలో మార్పులను చూడగలిగే సాంకేతికత మాత్రమే ఉందన్న విమర్శలు ఉన్నాయి. కనీసం 500 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లు చూడగలిగే డ్యుయల్ పోలరైజేషన్ టెక్నాలజీ అవసరమన్న భావన సర్వత్రా వినిపిస్తోంది.

కొత్త రాడార్ వ్యవస్థలతోనే పరిష్కారం

ఎపిలోనూ, ఢిల్లీ, కోల్‌కతా, పారదీప్, కరైకల్ వాతావరణ కేంద్రాల్లోనూ సింగిల్ పోలరైజేషన్ వ్యవస్థలే ఉన్నాయి. చెన్నయ్, రక్షణ శాఖ పరిధిలోకి వచ్చే శ్రీహరికోటల్లో మాత్రమే డ్యుయల్ పోలరైజేషన్ రాడార్ వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. తుపాన్లను చూసే రేంజ్ వీటికి మాత్రం 500 కిలోమీటర్లపైనే ఉంది. హైదరాబాద్‌లో కూడా ఈ వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో దేశంలో పలుచోట్లకు డ్యూయల్ రాడార్ పోలరైజేషన్ వ్యవస్థలు రాబోతున్నాయి. ఏళ్ల తరబడి ఈ ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్రం అధికారి శ్రీనివాసరావు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ ప్రస్తుతం సింగిల్ పోలరైజేషన్ రాడార్ వ్యవస్థనే విశాఖలో ఉందని తెలిపారు. డ్యూయల్ పోలరైజేషన్ రాడార్ ఉంటే కొంత జూమ్ చేసి చూసి సైక్లోన్ బులెటిన్‌లు త్వరితగతిన ఇచ్చే అవకాశముందని వెల్లడించారు.

వరద నీటిలోనే లంక గ్రామాలు


ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రకాశం బ్యారేజీ దిగువన కృష్ణానదీ ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో జాపట్ల జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు ప్రమాద పరిస్థితుల నుంచి గట్టెక్కారు. వరద ఉధృతి కొంతమేర తగ్గినప్పటికీ బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని గాజుర్లంక, పోతర్లంక, చిలుమూరు లంక, ఈపూరు లంక, సుగుణ లంక, పెద్దలంక, చింతల లంక, పెసరలంక, ఆవులువారిపాలెం, కృష్ణా నగర్, తోకలవారిపాలెం, తురకపాలెం, తిప్పలకట్ట, కిష్కింధపాలెం, తడికలపూడి, జువ్వలపాలెం, భట్టిప్రోలు మండలంలోని చింతమోటు, పెదలంక, పెసర్లంక, ఓలేరు, పల్లెపాలెం గ్రామాలు వరదనీటిలోనే ఉండిపోయాయి. లోతట్టులో నివాసాలు మునిగిపోయాయి. మిద్దెల మీద టార్పాలిన్ పట్టాలతో తాత్కాలిక వసతి ఏర్పాటు చేసుకున్నారు. సోమవారం అంతా ఆహారం, తాగునీటికి బాధితులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం ముంపు గ్రామాలలోని బాధితులకు ఆహారం, మంచినీటిని అధికారులు పంపిణీ చేశారు. లంక గ్రామాల్లోని కంద, పసుపు, అరటి తోటలకు భారీనష్టం వాటిల్లింది. ముంపు లంక గ్రామాల సమస్యలపై మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, అనగాని సత్యప్రసాద్‌లు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పెరిగిన ధరలకు అనుగుణంగా పరిహారమివ్వాలి : రమాదేవి

లంక గ్రామాల్లో నష్టపోయిన వాణిజ్య పంటలకు, కోల్పోయిన గృహాలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి డిమాండ్ చేశారు. కష్ణా నదికి సంభవించిన వరద పరిస్థితిపై మంగళవారం ఆమె కొల్లూరు, వెల్లటూరు, ఓలేరు గ్రామాల వద్ద వరద పరిస్థితిని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ముందస్తు చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందన్నారు. లంక గ్రామాల్లో చిక్కుకుపోయిన బాధితులకు సకాలంలో తాగునీరు, ఆహారం సరఫరా చేసి.. విద్యుత్తును సత్వరంగా పునరుద్ధరించాలని కోరారు.


బాధితులతో మాట్లాడుతున్న సిపిఎం నేతలు రమాదేవి, గంగయ్య


గోదావరి వరద ఉధృతికి మునిగిన ఎద్దు వాగు కాజ్‌వే

గోదావరికి మళ్లీ వరద

- 'కుక్కునూరు'లో 15 గ్రామాలకు రాకపోకలు బంద్
- వేలేరుపాడులో పొంగిపొర్లుతున్న ఎద్దువాగు

ప్రజాశక్తి - ఏలూరు జిల్లా యంత్రాంగం

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతోంది. భద్రాచలంలో మంగళవారం ఉదయం 27 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం సాయంత్రానికి 39 అడుగులకు చేరింది. బుధవారం ఉదయానికి 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం ఉంది. గోదావరికి వరద వస్తుండడంతో ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు అప్రోచ్‌పైకి వరద నీరు చేరింది. రెండు నెలల క్రితం వచ్చిన గోదావరి వరదలకు కుక్కునూరు మండలంలోని గొమ్ముగూడెం, కుక్కునూరు-ఎ బ్లాక్, వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామస్తులు పునరావాస కాలనీల్లో రెండు నెలలుగా ఉంటున్నారు. ఆగస్టు నెల గడవడంతో వరదలు రావని భావించి ఇటీవలే తమ గ్రామాలకు చేరుకున్నారు. ఇప్పుడు వరద పెరుగుతుండడంతో ప్రజలు మళ్లీ పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వేలేరుపాడు మండలంలోని రుద్రంకోట, బొల్లపల్లి వద్ద ఉన్న ఎద్దువాగు వంతెన పైనుంచి వరద నీరు ప్రవహించడంతో కోయిదా, కట్కూరు, యడవల్లి, కాకిసునూరు, పేరంటాలపల్లి వంటి 15 గ్రామాలకు మండల కేంద్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.


జెవివి మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గేయానంద్

అనంతలో జెవివి రాష్ట్ర మహాసభ

- పోస్టర్ ఆవిష్కరించిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురంలో ఈ నెల 14,15 తేదీల్లో జరిగే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వార్షిక మహాసభను జయప్రదం చేయాలని జెవివి రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ కోరారు. మహాసభ పోస్టర్లను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ.. అనంతపురంలోని జిఆర్ పంక్షన్ హాల్‌లో నిర్వహించే ఈ మహాసభను ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్ వర్క్ (ఎఐపిఎస్ఎన్) మాజీ అధ్యక్షులు, శాస్త్రవేత్త సవ్యసాచి చటర్జీ ప్రారంభించి 'శాస్త్రీయ దక్పథం - ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. ప్రారంభ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రమణ్యం, జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షులు ప్రొఫెసర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సభలో విద్య, వైద్యం, పర్యావరణ శాస్త్రం తదితర అంశాలతోపాటు జెవివి కార్యాచరణ గురించి చర్చ జరుగుతుందన్నారు. సాయంత్రం జరిగే సభలో 'భారత రాజ్యాంగం- పౌర సమాజం పాత్ర' అనే అంశంపై జెవివి నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ వి బ్రహ్మారెడ్డి ఉపన్యసిస్తారని వివరించారు. రెండో రోజు 'రాష్ట్ర అభివృద్ధి-ప్రతిపాదనలు' అనే అంశంపై ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఉపన్యసిస్తారని తెలిపారు. అనంతరం 'శాస్త్ర ప్రచారంలో యువతరం, మహిళల పాత్ర' అనే అంశంపై ప్రత్యేక సభ జరుగుతుందని చెప్పారు. మహాసభకు 26 జిల్లాల నుండి ప్రతినిధులు వస్తారని తెలిపారు.

జాతీయ విపత్తుగా ప్రకటించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి (గుంటూరు జిల్లా)

గత దశాబ్దంలో ఏనాడు లేనంతగా విపరీతంగా వర్షాల వల్ల గుంటూరు, కృష్ణా జిల్లాలు అతలాకుతలం అయ్యాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 20 మంది మృతి చెందారని, పంటలు నీటమునిగి అపారనష్టం వాటిల్లిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ వరద బీభత్సాన్ని జాతీయ విపత్తుగా ప్రకటించి ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి రత్నాల చెరువులో నీట మునిగిన గృహాలు, చేనేత మగ్గాలు, ప్రకాశం బ్యారేజీ వరద ఉధృతిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో లక్షలాది మంది బతుకులు అతలాకుతలమయ్యాయని, విద్యుత్ లేక, తాగేందుకు నీళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధాని మోడీ యుద్ధ ప్రాతిపదిక స్పందించి సాయం చేయాలని, వెంటనే పర్యటనకు రావాలని డిమాండ్ చేశారు. అధికారులు అప్రమత్తంగా లేకపోవడం వలనే బోట్లు కొట్టుకు వచ్చి బ్యారేజీని ఢీకొట్టాయని, ఇందులో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని విమర్శించారు. దీనిపై విచారణ జరిపించాలని సిఎం చంద్రబాబును కోరారు. ఆయన వెంట సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సిపిఐ నాయకులు చిన్ని తిరుపతయ్య , జాన్ బాబు తదితరులు ఉన్నారు.


ప్రకాశం బ్యారేజీపై వరద ఉధృతిని పరిశీలిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ


భోజనాలు వడ్డిస్తున్న ఎంబివికె నాయకులు

ఎంబివికె ఆపన్నహస్తం

- మహానాడు, సుందరయ్యనగర్ బాధితులకు భోజనాలు ఏర్పాటు

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

వరద బాధితులకు విజయవాడ మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆపన్నహస్తం అందించింది. వరద ముంపునకు గురైన గుంటూరు జిల్లా తాడేపల్లిలోని సుందరయ్యనగర్, మహానాడు ప్రాంతాల్లో 2200 మందికి భోజనాలు ఏర్పాటు చేసింది. గత రెండు రోజుల నుంచి ఇళ్లల్లోనే గడిపిన తమకు భోజనంతో పాటు మంచినీరు కూడా అందించిన ఎంబివికె నిర్వాహకులకు వరద బాధితులు అభినందనలు తెలిపారు. అమరావతి ఐకాన్ నుంచి ఉపాధ్యాయులు, ఫొటోగ్రాఫర్లు, అభ్యుదయవాదులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. కార్యక్రమంలో ఎంబివికె బాధ్యులు పి.మురళీకృష్ణ, కె.స్వరూపరాణి, యువి రామరాజు, పిఇటి ఉపాధ్యాయులు బి.రమేష్, కె.ప్రకాష్, రియాజ్ బాష తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలకే పరిమితమైన కడప ఉక్కు

- నిర్మాణంపై తక్షణం చర్యలు తీసుకోవాలి : షర్మిల

ప్రజాశక్తి - కడప

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణంపై తక్షణం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్.షర్మిల కోరారు. ఎన్ని పార్టీలు అధికారంలోకి వచ్చినా శంకుస్థాపనలకే ఉక్కు పరిశ్రమ పరిమితమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు కడప జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలోని మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమ వైఎస్ఆర్ ఆశయం, సంకల్పమన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఆంధ్రుల హక్కు అని పేర్కొన్నారు. వెంటనే ఉక్కు పరిశ్రమ నిర్మాణం చేపట్టకపోతే ఉద్యమాలు, పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. 2014లో ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు యుపిఎ ప్రభుత్వం నిబంధనలు రూపొందించిందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఈ డిమాండ్‌ను విస్మరించిందని విమర్శించారు. దశాబ్ద కాలంగా ఉక్కు కర్మాగారం పురోగతిని బిజెపి, టిడిపి, వైసిపిలు స్తంభింపజేశాయని తెలిపారు. వెంటనే ప్లాంట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు అఫ్జల్‌ఖాన్, జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు, మధురెడ్డి తదితరులు ఉన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న షర్మిల

మళ్లీ మొదటికి..!

- అడుగు ముందుకు పడని ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులు
- భూ సేకరణ ప్రైమరీ నోటిఫికేషన్ రద్దుతో రూ.8 కోట్లు నష్టం
- ఉద్యోగులపైనే కార్యాలయ నిర్వహణ భారం


సుజల స్రవంతి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో సిఎం చంద్రబాబు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, 48 మండలాల్లోని 1037 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు, విశాఖ నగర పరిశ్రమలకు నీటిని సరఫరా చేసేందుకు ఉద్దేశించిన బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (బిజెఆర్‌యుఎస్ఎస్) ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేసి పదిహేనేళ్లవుతున్నా ఒక్కడుగూ ముందుకుపడలేదు. 2009 ఫిబ్రవరి 21న రూ.7,214 కోట్ల విలువైన పనులకు నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి సబ్బవరంలో శంకుస్థాపన చేశారు. తరువాత ఏ ప్రభుత్వమూ ఈ ప్రాజెక్టుకు బడ్జెట్ కేటాయించకపోవడంతో ఈ నాటికీ ఎకరా భూమి సేకరించలేదు. వైసిపి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనుల కోసం అవసరమైన భూ సేకరణకు అనకాపల్లిలో ప్రత్యేక భూసేకరణ అధికారి కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయంపై కనీస సదుపాయాల్లేని రెండు గదులను కేటాయించి ఊరుకుంది.

వాస్తవానికి అనకాపల్లిలో బిజెఆర్‌యుఎస్ఎస్ ప్రాజెక్టు కోసం 1205 ఎకరాలకు ప్రైమరీ భూ సేకరణ నోటిఫికేషన్‌ను గత వైసిపి ప్రభుత్వం జారీ చేసింది. ఆ తరువాత ఏడాదిలోపు తుది నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. ఏడాదిలో ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో మరో ఏడాది గడువు పెంచాలని ప్రభుత్వాన్ని నాటి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. ప్రభుత్వం ఏడాదిపాటు గడువు పెంచింది తప్పితే, నిధులు విడుదల చేయలేదు. దీంతో ప్రైమరీ భూ సేకరణ నోటిఫికేషన్ రద్దవడంతో ప్రభుత్వానికి రూ.8 కోట్లు నష్టం వాటిల్లింది. ప్రైమరీ నోటిఫికేషన్ రద్దు కావడంతో మళ్లీ రెండోసారి నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. అనకాపల్లి పరిధిలోని బిజెఆర్‌యుఎస్ఎస్ ప్రాజెక్టుకు సబ్బవరం, అనకాపల్లి, కశింకోట మండలాల్లో 1800 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. అందులో ప్రభుత్వ, అటవీశాఖ భూమి సుమారు 600 ఎకరాలు.

సుజల స్రవంతి పనుల విలువ రూ.17,050.20 కోట్లకు పెరిగినా, 2023-24లో బడ్జెట్‌లో రూ.141.79 కోట్లను మాత్రమే ప్రభుత్వం కేటాయించి నిధులు ఇవ్వడం మానేసింది. ఈ ప్రాజెక్టు ప్రధాన కాలువలకు 16,043 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. దీనికి రూ.2,149.67 కోట్లు అవసరం. 2018 నవంబరు 15న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.2022 కోట్లతో తొలి దశ పనులకు శంకుస్థాపన చేసినా నిధులు విడుదల చేయలేదు. ఫేజ్-1, ఫేజ్-2లో నాలుగు ప్యాకేజీల కింద సుజల స్రవంతి పనులు పూర్తి చేస్తామని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినా నిధులు ఇవ్వలేదు. 2024 మే నాటికి భూ సేకరణ పూర్తి చేయాలని గడువు విధించి, భూ సేకరణ ప్రక్రియ పూర్తికి నిధులు విడుదల చేయలేదు. చివరకు ప్రత్యేక భూ సేకరణ విభాగ కార్యాలయ నిర్వహణ ఖర్చులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఉద్యోగులు తమ చేతి డబ్బులు పెట్టి కార్యాలయ పనులకు ఆటంకంలేకుండా అవసరమైనవి సమకూర్చుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

భారీగా పెరిగిన వ్యక్తిగత రుణాలు

- జులై ముగింపు నాటికి 14% వృద్ధి
- గృహ రుణాల డిమాండ్‌లో తగ్గుదల
- క్రెడిట్ కార్డు అప్పులు రూ.2.8 లక్షల కోట్లు



ముంబయి : కుటుంబ భారాలను అధిగమించడానికి వ్యక్తిగత రుణాలపై ఆధారపడటం భారీగా పెరిగింది. ఏడాదికేడాదితో పోల్చితే 2024 జులై ముగింపు నాటికి వ్యక్తిగత రుణాల్లో ఏకంగా 14 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. మొత్తంగా బ్యాంకింగ్ రుణాల్లో ఈ విభాగం వాటా ఏకంగా ఒక్క శాతానికి చేరిందని ఆర్‌బిఐ గణంకాలు వెల్లడించాయి. వ్యక్తిగత రుణాలతో పోల్చితే బంగారం రుణాలు ఏకంగా 39 శాతం పెరిగడం గమనార్హం. ఆహారేతర రుణాల్లో వ్యక్తిగత రుణాల వాటా అత్యధికంగా 32.9శాతంగా ఉంది. ఆ తర్వాత సర్వీసెస్ వాటా 27.4శాతం, ఇండస్ట్రీస్ 22.2శాతం, వ్యవసాయం, సంబంధిత కార్యకలాపాల వాటా 12.8శాతంగా నమోదయ్యింది. ఇక క్రెడిట్ కార్డుల బకాయిలు జులై చివరి నాటికి భారీగా ఎగిశాయి. కాగా.. బ్యాంకుల మొత్తం రుణాల్లో వీటి వాటా కేవలం ఒకశాతం మాత్రమే. వార్షిక ప్రాతిపదికన క్రెడిట్ కార్డు రుణాలు 22శాతం వద్ధితో రూ.2.8లక్షల కోట్లకు ఎగిశాయి.

వాస్తవానికి బంగారంపై రుణం వెంటనే అందుబాటులో ఉంటుంది. మరోవైపు వ్యవసాయ రంగ రుణాల్లో 18.1 శాతం పెరుగుదల ఉంది. అన్ని రంగాలకు కలిపి మొత్తం రుణాలు రూ.21.6 లక్షల కోట్లకు చేరాయి. పరిశ్రమలకు ఇచ్చే రుణాలు 13.7శాతం పెరిగాయి. గృహ రుణాలకు డిమాండ్ అతి తక్కువగా ఉంది. ఈ రంగం రుణాల్లో 12.8శాతం మాత్రమే పెరుగుదల చోటు చేసుకుంది. కాగా.. గృహ రుణాల మొత్తం పరిమాణం ఇప్పుడు రూ.28 లక్షల కోట్లు దాటిందని ఆర్‌బిఐ వెల్లడించింది. ప్రజలు ఎక్కువగా గంటల వ్యవధిలో లభించే రుణాల వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపింది.

97.96 శాతం చేరిన రూ.2వేల నోట్లు

చలామణిలోని రూ.2వేల నోట్లు ఇప్పటి వరకు 97.96 శాతం బ్యాంక్‌లకు చేరాయని ఆర్‌బిఐ వెల్లడించింది. ఇంకా రూ.7,261 కోట్ల విలువైన రూ.2వేల నోట్లు ప్రజల వద్దే ఉన్నాయని పేర్కొంది. 2023 మే 19న రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్లు ఆర్‌బిఐ స్పష్టం చేసింది.

హెచ్‌ఎస్‌బిసి ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

ముంబయి : హెచ్‌ఎస్‌బిసి మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఎక్స్‌పోర్ట్ ఆపర్చునిటీస్ ఫండ్‌ను ప్రారంభించనున్నట్లు పేర్కొంది. ఇది సెప్టెంబర్ 5న తెరువబడి.. 2024 సెప్టెంబర్ 19న ముగుస్తుందని తెలిపింది. ఇందులోని ఫండ్స్‌ను ఎగుమతిలో నిమగ్నమైన లేదా ప్రయోజనం పొందాలని భావిస్తున్న కంపెనీల ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెట్టనుంది. ఈ పథకం నిఫ్టీ 500 టోటల్ రిటర్న్ ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తుందని తెలిపింది.

భారత వృద్ధి 7 శాతంగా ఉండొచ్చు : ప్రపంచ బ్యాంక్

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో భారత వృద్ధి 7 శాతంగా ఉండొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఇంతక్రితం 6.6 శాతంగా ఉండొచ్చని పేర్కొనగా.. తాజాగా ఆ అంచనాలను పెంచింది. వ్యవసాయ రంగం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో రికవరీ ఆశించిన స్థాయిలో ఉండటంతో జిడిపి పెరగొచ్చని పేర్కొంది. ప్రపంచ భౌగోళిక రాజకీయ సవాళ్లు ఉన్నా భారత్ ఆర్థికవ్యవస్థ రాణిస్తుందని విశ్లేషించింది. 2024 జూన్ త్రైమాసికంలో జిడిపి 6.7 శాతానికి మందగించినప్పటికీ ప్రపంచ బ్యాంక్ జిడిపి అంచనాలను పెంచడం గమనార్హం.

దక్షిణాదిలో ఫ్లెక్సీ బస్ విస్తరణ

హైదరాబాద్ : దక్షిణాదిలో ఆరు కొత్త మార్గాలకు తమ కార్యకలాపాలను విస్తరించినట్లు గ్లోబల్ ట్రావెల్ టెక్ లీడర్ అయిన ఫ్లిక్స్‌బస్ ఇండియా తెలిపింది. దక్షిణాదిలో కొత్తగా 6 మార్గాలను పరిచయం చేయడంతో ఇక్కడి మార్కెట్‌లోకి ప్రవేశించినట్లు తెలిపింది. సెప్టెంబర్ 10 నుంచి కొత్త సేవలు ప్రారంభమవుతాయని గ్లోబల్ ఫ్లిక్స్ సిఇఒ మాక్స్ జ్యూమర్ తెలిపారు. తొలుత బెంగళూరు, చెన్నయ్, హైదరాబాద్, కోయంబత్తూరు, మధురై, తిరుపతి, విజయవాడ, బెల్గాం మధ్య సర్వీసులను అందుబాటులోకి తేనున్నట్లు తెలిపింది. చెన్నయ్, హైదరాబాద్, బెంగళూరుకు రోజువారి బస్సు సర్వీసులను ప్రారంభించినట్లు వెల్లడించింది.

రెండేళ్ల క్రితం అభ్యర్థులకు ఇన్ఫోసిస్ నియామకాలు

బెంగళూరు : రెండేళ్ల క్రితం క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికయిన వారిని ఇన్ఫోసిస్ ఇప్పుడు ఉద్యోగాల్లోకి తీసుకుంటుంది. 2022లో ఎంపిక చేసిన ఇంజినీరింగ్ పట్టభద్రులకు నియామకాలు ఇవ్వడాన్ని ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇప్పటికే పలువురికి జాయినింగ్ తేదీలు, ఆఫర్‌కు సంబంధించిన సమాచారం అందినట్లు వెల్లడించాయి. క్యాంపస్ నియామకాల్లో ఎంపికైన 1000 మందికి ఇప్పటికే ఆఫర్ లెటర్‌లను కంపెనీ జారీ చేసిందని ఐటీ సంఘం నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయిస్ సెనేట్ (నైట్స్) వెల్లడించింది.

వరుస లాభాలకు తెర

ముంబయి : వరుసగా పది సెషన్లలో లాభాల బాటలో నడిచిన దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాలు చవి చూశాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలకు తోడు ఇప్పటికే ఆల్‌టైం గరిష్టాలకు పెరిగిన సూచీల నేపథ్యంలో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. దీంతో చివరికి 4.40 పాయింట్ల నష్టంతో 82,555.44 వద్ద నమోదయ్యింది. నిఫ్టీ 1.15 పాయింట్ లాభంతో 25,279.85 వద్ద ముగిసింది.

వరద బాధిత కస్టమర్లకు ఉచిత సేవలు

- నిస్సాన్ మోటార్స్ వెల్లడి

హైదరాబాద్ : దేశంలోని వివిధ ప్రాంతాల్లో వరదల వల్ల నష్టపోయిన వినియోగదారుల కోసం ప్రత్యేక సహాయక చర్యలు అందిస్తున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా తెలిపింది. వరదలతో సతమవుతున్న కంపెనీ వినియోగదారులకు ఉచితంగా తమ వాహనాల కోసం రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. ప్రత్యేకంగా నిస్సాన్ హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. వరదల్లో చిక్కుకున్న వాహనాలను సమీపంలోని కంపెనీ సర్వీస్ వర్క్‌షాప్‌కు తీసుకెళ్లడానికి వీలుగా ఉచిత రోడ్‌సైడ్ అసిస్టెన్స్ సేవలను ప్రారంభించినట్లు తెలిపింది. దాంతోపాటు బీమా వాహనాలకు క్లెయిమ్ ప్రాసెస్ ఫీజు రూ.1000 మినహాయించినట్లు పేర్కొంది.

వరద ప్రాంతాల్లో రీచార్జ్ గడువు పెంపు : ఎయిర్‌టెల్

హైదరాబాద్ : వరద ప్రభావిత ప్రాంతాల్లో తమ ఖాతాదారులకు మద్దతుగా నిలువాలని టెలికం కంపెనీ భారతీ ఎయిర్‌టెల్ నిర్ణయించింది. తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ క్లిష్ట సమయంలో తమ ప్రీపెయిడ్ ఖాతాదారులకు వ్యాలిడిటీ ముగిసిన, రీఛార్జ్ చేయలేని కస్టమర్‌లు అదనంగా నాలుగు రోజులు అపరిమిత కాలింగ్‌తో పాటు రోజుకు 1.5 జిబి ఉచిత మొబైల్ డేటాను అందిస్తున్నట్లు పేర్కొంది. పోస్ట్ పెయిడ్ ఖాతాదారులు బిల్లు చెల్లింపు గడువు తేదీలను 7 రోజులు పొడిగిస్తున్నట్లు తెలిపింది.

ప్రత్యమ్నాయ ఇంధన వాహనాలపై దృష్టి పెట్టాలి


- మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ : పెట్రోల్, డీజిల్ కార్ల వినియోగాన్ని తగ్గించాలని రవాణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలను ఉపయోగించాలని సూచించారు. ఫ్లెక్స్ ఫ్యూయెల్ వాహనాలపై జిఎస్‌టిని 12 శాతానికి తగ్గించాలన్నారు.

శిలాజ ఇంధనాల దిగుమతిని తగ్గించి, జీవ ఇంధన వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు. దీని కోసం వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రుల మద్దతు అవసరమని తెలిపారు. ఫ్లెక్స్ ఫ్యూయెల్ వాహనాలు ఒకటి కంటే ఎక్కువ రకాల ఇంధనంతో లేదా మిశ్రమంతో నడుస్తుంది. అంటే పెట్రోల్ మరియు ఇథనాల్ లేదా మిథనాల్ మిశ్రమం. ఇది పెట్రోల్ దిగుమతులను తగ్గిస్తుంది. తద్వారా దేశ ఆర్థిగా పరిస్థితి మరింత మెరుగుపడుతుందన్నారు. హీరో, బజాజ్ వంటి ద్విచక్ర వాహన తయారీ సంస్థలు భారత్‌లో తయారు చేసే బైక్‌లలో 50 శాతం ఎగుమతి చేస్తున్నాయని గడ్కరీ చెప్పారు. జీవ ఇంధనం కోసం మనం మంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉంటే.. ఎగుమతులు 10 నుండి 20 శాతం వరకు పెరుగుతాయని అంచనా వేశారు.

మత ఉద్రిక్తతలకు బిజెపి యత్నం

- వి. కోటలో 144 సెక్షన్
- శాంతి భద్రతలను పర్యవేక్షించిన కలెక్టర్


వి.కోట పట్టణంలో పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి- వి కోట (చిత్తూరు జిల్లా)

చిత్తూరు జిల్లా వి కోట మండలం వి కోట పట్టణంలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో 144 సెక్షన్ విధించారు. సోమవారం కొందరు ముస్లిం యువకులు మసీదు వీధిలో క్రికెట్ ఆడుతుండగా పొరపాటున బంతి వెళ్లి మహిళకు తగిలింది. దీంతో మాటామాట పెరిగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసే వరకూ వెళ్లింది. బిజెపి నాయకులు దీన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది యువకులను పోగేసుకుని పోలీస్ స్టేషన్ నుంచి మసీదు వీధికి వెళ్తుండగా దారి మధ్యలో మసీదు వద్ద రెచ్చగొట్టే నినాదాలు చేయడంతో మళ్లీ ఘర్షణ చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఇరు గ్రూపులను చెదరగొట్టే క్రమంలో పలమనేరు డిఎస్‌పి ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. జనసేన నాయకులు పొట్టు భాస్కర్ ఇంటిపై దాడికి పాల్పడ్డారు. అదనపు బలగాల రాకతో ఘర్షణ సర్దుమణిగింది. మత ఉద్రిక్తతల నేపథ్యంలో 48 గంటల పాటు 144 సెక్షన్ విధించారు. దుకాణాలను మూసివేయించారు. విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఇరు గ్రూపుల పెద్దలతో మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా ఎస్‌పి మణికంఠ చందోలు... శాంతి కమిటీ ఏర్పాటు చేసి వారితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని సూచించారు. శాంతిభద్రతలను స్వయంగా జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. దాడిలో గాయపడిన డిఎస్‌పిని పలమనేరు ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి గాలి భాను ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. ప్రజలందరూ సంయమనం పాటించాలని విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి విజ్ఞప్తి చేశారు.

శాంతిభద్రతలు కాపాడాలి: సిపిఎం

వి కోట మండల కేంద్రంలో మతఘర్షణలను రెచ్చగొట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. చిన్నపాటి గొడవను మతఘర్షణలుగా బిజెపి నాయకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. ప్రశాంతమైన వికోటలో మత ఘర్షణలు లేకుండా చూడాలని అధికారులను కోరారు.

సంపాదకీయం

బుల్డోజర్ (అ)న్యాయం!

దేశంలో ఎక్కడా, ఎవరిపైనా 'బుల్డోజర్ జస్టిస్' అమలు చేయకూడదని, ఇలాంటి ఇళ్ల కూల్చివేతలపై దేశవ్యాప్తంగా అనుసరించాల్సిన మార్గదర్శక సూత్రాలను రూపొందిస్తామన్న అత్యున్నత న్యాయస్థానం నిర్ణయం స్వాగతించదగినది. ప్రజాస్వామ్యానికి, పౌర స్వేచ్ఛకు పాతరేస్తూ, నిరంకుశత్వంతో చెలరేగిపోతున్న బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వాల అకృత్యాలకు చెంపపెట్టు. అడపాదడపా ఇతర బూర్జువా పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలు కూడా ఇటువంటి దుర్మార్గాలకు ఒడిగడుతున్నా... ఇందులో అగ్రస్థానం కమలం పార్టీ సర్కార్లదే.

మైనారిటీలపై విద్వేషమే అజెండాగా, సమాజాన్ని చీల్చే ఎత్తుగడలతో ప్రజాస్వామ్యాన్ని వేరుపురుగులా తొలిచేస్తున్న బిజెపి ప్రభుత్వాల దుశ్చర్యలకు ప్రతిబింబమే ఈ 'బుల్డోజర్ (అ)న్యాయం'. పాలస్తీనాలో ఇజ్రాయిల్ దాష్టీకాల్లో ఒకటిగా ఉన్న ఈ బుల్డోజర్ అన్యాయాన్ని ఓ మోడల్‌లా అమలు చేసింది ఉత్తర ప్రదేశ్ సిఎం యోగి ఆదిత్యనాథ్ సర్కారు. న్యాయస్థానాల ప్రమేయం లేకుండా మైనారిటీల జీవితాలను రోడ్డున పడేసిన యోగిని 'బుల్డోజర్ బాబా' అని, మధ్యప్రదేశ్ మాజీ సిఎం శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను 'బుల్డోజర్ మామ' అని సంఘ్ పరివార్ కీర్తించడం, ఈ ఒరవడిలో రాజస్థాన్, అసోం లాంటి కమలం పార్టీ ఏలుబడిలోని ప్రభుత్వాలు రెచ్చిపోతుండటం పరిపాటిగా మారిపోయింది. 'గ్యాంగ్‌స్టర్స్, యాంటీ సోషల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్ట్, ది ప్రివెన్షన్ ఆఫ్ డామేజ్ టు పబ్లిక్ అండ్ ప్రైవేట్ ప్రాపర్టీ, రికవరీ ఆఫ్ డామేజ్ యాక్ట్ 2021' పేరుతో ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ ప్రభుత్వాలు ఈ అన్యాయాలను చట్టబద్ధం చేసేందుకు బరితెగించాయి. పౌరసత్వ సవరణ చట్టాన్ని (సిఎఎను) వ్యతిరేకించిన చాలామంది నిరసనకారుల ఇళ్లను కూల్చివేయడమే గాకుండా, నేరస్తుల మాదిరిగా వారి చిత్రాలతో వీధుల్లో పోస్టర్లు ఏర్పాటు చేయడం సామూహిక శిక్షే. సుప్రీంకోర్టు ఆదేశాలతోనే అప్పట్లో ఈ దాష్టీకానికి తెరపడింది. దేశ రాజధాని ఢిల్లీ జహంగీర్‌పురిలో ఇళ్ల అక్రమ కూల్చివేతను నిలిపివేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను లెక్కచేయకుండా నేలమట్టం చేస్తున్న బుల్డోజర్లకు ఎదురునిలిచి... సుప్రీం ఆదేశాల ప్రతులను చూపిన బృందాకరత్ ధైర్యసాహసాలు ఎప్పటికీ గుర్తుండిపోయేవే. ఢిల్లీ నుంచి గల్లీ వరకూ సాగిన కమలం పార్టీ విధ్వంసంతో 2022, 2023 సంవత్సరాల్లోనే 1.5 లక్షలకు పైగా ఇళ్లు నేలమట్టమయ్యాయని, దేశవ్యాప్తంగా 7.4 లక్షల మందికిపైగా ప్రజలు నష్టపోయారని హౌసింగ్ అండ్ లేండ్ రైట్స్ నెట్‌వర్క్ నివేదించింది. బతుకు జీవుడా అని...జీవనయానం సాగించాల్సిన దుస్థితిలో మైనారిటీలు ఉన్నారు. ఆక్రమణల తొలగింపుపై పిల్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసిన క్షణాల్లోనే ప్లేవుడ్ దుకాణం కూల్చివేశారని, కనీసం మెటీరియల్ తరలించేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని ఓ యజమాని ఆక్రందన. ఉత్తరాఖండ్ టన్నెల్‌లో నెలల తరబడి చిక్కుకుపోయిన వారిని కాపాడిన టీమ్‌కు మార్గదర్శిగా ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకున్న హస్సర్ సహా...చట్ట ప్రకారం ఉండాల్సిన పత్రాలన్నీ ఉన్న ఎందరి ఇళ్లు, దుకాణాలో నేలమట్టమయ్యాయి. వీటి యజమానులే కాదు...వాటిలో పనిచేస్తున్న ఎందరో జీవనోపాధి కోల్పోతున్నారు. ఇలా కూల్చివేయడం క్రూరమైనది, భయంకరమైనది, చట్ట విరుద్ధమైనది, వివక్షాపూరితమైనది అని, ముస్లిం సమాజంపై పెరుగుతున్న వివక్షతో భారత ప్రభుత్వానికి విడదీయరాని సంబంధం ఉందని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ పేర్కొంది. ముస్లిముల జీవన విధానాన్ని, దుస్తుల్ని, ఆహారం, జీవనోపాధిని కించపరిచే ప్రయత్నాలు, వారి ప్రార్థనా స్థలాల వద్దే రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం వంటి దుశ్చర్యలన్నీ మతోన్మాద చర్యలే! ఇవేకాదు అధికారంలోకి రాగానే సాక్షాత్తు ప్రభుత్వ భవనాలు, విగ్రహాలు కూల్చివేయడం, చట్టాలతో ప్రమేయం లేకుండా ప్రత్యర్థుల నివాసాలను కూల్చేయడం, వేధించడం...తదితర దుశ్చర్యలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఇవన్నీ...ప్రభుత్వాల గూండాగిరీనే! ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల రుధిరం, చెమట, కన్నీళ్లతో నిర్మించుకున్న భిన్నత్వంలో ఏకత్వంతో కూడిన, బహుళత్వ భావనలతో కూడిన భారత దేశాన్ని బుల్డోజ్ చేసే చర్యలను ప్రతిఘటించాలి. చట్టాలను స్వయంగా అతిక్రమిస్తున్న నిరంకుశ సర్కార్లు సుప్రీం మార్గదర్శకాలు అమలు చేసేలా ఒత్తిడి తేవాలి.

మహనీయుల మాట



భారతదేశం వైవిధ్యభరితమైనది. ఇలాంటి దేశంలో జాతీయాభివృద్ధి సాధించే క్రమంలో వివిధ జాతుల మధ్య సమైక్యత, సామరస్యం ఎంతగానో అవసరం. అందువల్ల మన సంస్కృతి యొక్క మిశ్రమ స్వభావం గురించి ప్రబోధించడం సమాజానికి రాజకీయంగా అవసరం.


- అస్ఘర్ అలీ ఇంజనీర్,
ప్రసిద్ధ రచయిత, సామాజిక కార్యకర్త.

బెయిల్ పొందడం అసాధ్యం కాకూడదు

విశ్లేషణ









మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అరెస్టు చేసే అధికారం ఏకపక్షం కాదని, అరెస్టు చేసే ముందు పోలీసులు దాని అవసరాన్ని పరిశీలించాలని కోర్టు పేర్కొంది. 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ కేసులో, అరెస్టుకు ముందు న్యాయ సలహా తీసుకునే హక్కు నిందితులకు ఉందని, 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచే హక్కు ఉందని కూడా కోర్టు స్పష్టం చేసింది.

పౌరులు ఎటువంటి విచారణ లేకుండా, బెయిల్ తిరస్కరణకు గురికాకుండా జైళ్లలో ఏళ్ల తరబడి గడపాల్సిన పరిస్థితి రాకుండా చూడడం...రాజ్యాంగం హామీ ఇచ్చిన ప్రాథమిక హక్కుల సంరక్షకులుగా, న్యాయస్థానాల ప్రధాన కర్తవ్యం. తరచుగా కోర్టులు ఈ విషయాన్ని తగినంత సీరియస్‌గా తీసుకోలేదు. అంతేగాక, చాలా కేసులలో భిన్నమైన తీర్పులు వచ్చాయి. అదే కోర్టులోని కొన్ని బెంచ్‌లు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధంగా తీర్పులు ఇచ్చాయి. కొన్ని హైకోర్టులు కూడా ఇదే విధానాన్ని సమర్థించాయి. అయితే ఇటీవల సుప్రీంకోర్టు నుండి వచ్చిన కొన్ని క్లిష్టమైన తీర్పులు, పరిశీలనలు స్వాగతించదగినవి. అంతేగాక ఇవి న్యాయ వ్యవస్థపై ప్రజాస్వామ్య విశ్వాసుల ఆశను బలపరుస్తున్నాయి. 'బెయిల్ అనేది వ్యవస్థ, అనివార్యమైన కేసుల్లో మాత్రమే జైలు' అనే సూత్రానికి కోర్టులు కట్టుబడి ఉండాలని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. విచారణకు ముందు నిర్బంధించడం శిక్షగా మారకూడదు. పైగా వ్యక్తిగత స్వేచ్ఛ ఏ చట్టానికైనా అతీతమని, బెయిల్ మంజూరు చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద హామీ ఇవ్వబడిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడ మేనని కోర్టు చేసిన ప్రధాన పరిశీలనలు.



టి. చంద్రమోహన్

బెయిల్ పిటిషన్లను విచారించే హైకోర్టులు, ఇతర దిగువ కోర్టులు సుప్రీంకోర్టు బలమైన అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. మితిమీరిన అధికారాన్ని ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులను తప్పుడు కేసుల్లో ఇరికించి, కిరాతక చట్టాలను, కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించి ఏళ్ల తరబడి జైల్లో పెట్టే రాజ్య భీభత్సానికి వ్యతిరేకంగా ఇది హెచ్చరిక కూడా. దేశంలోని వివిధ కోర్టుల్లో అండర్ ట్రయల్లుగా వున్న సుమారు 500,000 మంది బెయిల్ కోసం ఎదురుచూస్తున్నారు. సుశీల్ కుమార్ సేన్ (1975), కశ్మీరా సింగ్ (1977), రాణి కుసుమ్ (2005), పి. చిదంబరం (2020), సతేందర్ కుమార్ అంతిల్ (2022) కేసుల్లో సత్వర విచారణ జరిపే హక్కు నిందితుడికి ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

అతను నేరానికి పాల్పడినట్లు నిర్ధారించబడటానికి ముందు విచారణ లేకుండా చట్టవిరుద్ధంగా ఎక్కువ కాలం జైలులో ఉంచకూడదు. విచారణ లేకుండానే నిందితుడిని నిరవధికంగా జైలులో నిర్బంధించడం రాజ్యాంగ ప్రజాస్వామ్యం కాదు. ఒకరిని ఒక కేసులో దోషిగా నిర్ధారించి శిక్షించే వ్యవస్థీకృత న్యాయ వ్యవస్థలు ఉన్నాయి. 2014 నుండి కేంద్ర ఏజెన్సీలు నకిలీ సాక్ష్యాలను సృష్టించి, రాజకీయ పార్టీల నాయకులను, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలను ప్రజా జీవితం, రాజకీయ కార్యకలాపాల నుండి జైలులో పెట్టడమనేది విస్తృతంగా వ్యాపించింది. దేశద్రోహం, యు.ఎ.పి.ఎ (ఉపా), మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పి.ఎం.ఎల్.ఎ) వంటి చట్టాలు విస్తృతంగా దుర్వినియోగం చేయబడ్డాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్, బి.ఆర్.ఎస్ నాయకురాలు కె.కవిత నుండి బెయిల్ లేకుండా మరణించిన స్టాన్‌స్వామి వరకు ఇందులో కొందరు మాత్రమే.

ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఉత్తర్వు ట్రయల్ కోర్టుకు, ఢిల్లీ హైకోర్టుకు ఈ ప్రాథమిక సూత్రాన్ని గుర్తు చేసేందుకు ప్రయత్నించింది. ఢిల్లీ ప్రభుత్వ ఎక్సైజ్ పాలసీ రూపకల్పన వల్ల ఆర్థికంగా లబ్ధి పొందారనే ఆరోపణలతో మనీ లాండరింగ్ కేసులో సిసోడియాకు జైలు శిక్ష పడింది. పదిహేడు నెలల్లో ట్రయల్ కోర్టు నుంచి హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు బెయిల్ పిటిషన్లు వేస్తూనే వున్నారు. కేంద్ర సంస్థలు లేవనెత్తిన వాదనలను సమర్థిస్తూ న్యాయమూర్తులు బెయిల్ నిరాకరించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం సిసోడియాకు సత్వర విచారణ హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛ ప్రాథమిక హక్కును నిరాకరించారని పేర్కొంటూ నెలన్నర క్రితం సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ క్రమంలో కొన్ని పరిశీలనలు వ్యక్తి స్వేచ్ఛ ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి.

సుప్రీం కోర్టు చేసిన ఇటువంటి పరిశీలనలు... బిజెపి పాలనలో కేంద్ర దర్యాప్తు సంస్థల పక్షపాతం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను బహిర్గతం చేస్తున్నాయి. దాదాపు అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలూ వ్యక్తులను కేసుల్లో ఇరికించి, విచారణ కూడా లేకుండా నెలల తరబడి జైలులో పెట్టే పద్ధతిని అనుసరిస్తున్నాయి. ఇ.డి తో పాటు జాతీయ దర్యాప్తు సంస్థ, సి.బి.ఐ, ఆదాయపు పన్ను శాఖ, యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ప్రత్యర్థుల వేటలో ఒకే విధంగా ఉన్నాయి.

సహ నిందితుడి వాంగ్మూలం ఆధారంగా పి.ఎం.ఎల్.ఎ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి) ఒక వ్యక్తిపై నేరారోపణ చేయకూడదని జస్టిస్ భూషణ్ ఆర్ గవాయ్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పి.ఎం.ఎల్.ఎ లోని సెక్షన్ 45 'రెండు షరతుల'కు లోబడి బెయిల్ మంజూరు చేయాలని చెప్తుంది. కానీ బెయిల్ చట్టం అనే సూత్రం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కి వివరణ. ఇది పౌరులకు జీవించే హక్కును, వ్యక్తిగత స్వేచ్ఛను వాగ్దానం చేస్తుంది.

పి.ఎం.ఎల్.ఎ లోని సెక్షన్ 45 కారణంగా ఆ హక్కును తిరస్కరించలేమని జస్టిస్ కె.వి. విశ్వనాథన్ తీర్పులో పేర్కొనడం గమనార్హం. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బి.ఆర్.ఎస్ నేత కె.కవితకు బెయిల్ మంజూరు చేస్తూ... సి.బి.ఐ, ఇ.డి భావించినట్లుగా వ్యక్తులను నిందితులుగా మార్చలేమని సుప్రీంకోర్టు తీర్పులో స్పష్టం చేసింది.

'విచారణ ఎప్పుడూ న్యాయంగా ఉండాలి. స్వయంగా ఒప్పుకున్న నిందితుడిని ఈ కేసులో సాక్షిగా చేర్చారు. ఇదే జరిగితే, రేపు మీరు అనుకున్న వారినే నిందిస్తారు. అనుకునేవారు విడుదలవుతారు. అలాంటప్పుడు వ్యక్తులను ఎంపిక చేసి వారిని ప్రతివాదులుగా చేయడం ఏంట'ని కోర్టు ప్రశ్నించింది. గత పదేళ్లలో పి.ఎం.ఎల్.ఎ కింద నమోదైన 5,000 కేసుల్లో కేవలం 40 మందికి మాత్రమే శిక్షలు పడ్డాయని ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. యు.ఎ.పి.ఎ వంటి తీవ్ర నేరాల కింద అరెస్టయిన వారికి కోర్టులు బెయిల్ మంజూరు చేయాలని న్యాయమూర్తులు అభయ్ ఎస్ ఓకా, అగస్టిన్ జార్జ్ మసీతో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పునిచ్చింది. 2015లో జైలుకెళ్లిన షేక్ జావేద్ ఇక్బాల్ పిటిషన్‌ను ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎ.టి.ఎస్ పరిష్కరించినప్పుడు ఈ సిఫార్సు వెలువడింది.

మద్యం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అరెస్టు చేసే అధికారం ఏకపక్షం కాదని, అరెస్టు చేసే ముందు పోలీసులు దాని అవసరాన్ని పరిశీలించాలని కోర్టు పేర్కొంది. 'న్యూస్ క్లిక్' వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ కేసులో, అరెస్టుకు ముందు న్యాయ సలహా తీసుకునే హక్కు నిందితులకు ఉందని, 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరు పరిచే హక్కు ఉందని కూడా కోర్టు స్పష్టం చేసింది.

సుప్రీం కోర్టు చేసిన ఇటువంటి పరిశీలనలు...బిజెపి పాలనలో కేంద్ర దర్యాప్తు సంస్థల పక్షపాతం, చట్టవిరుద్ధ కార్యకలాపాలను బహిర్గతం చేస్తున్నాయి. దాదాపు అన్ని కేంద్ర దర్యాప్తు సంస్థలూ వ్యక్తులను కేసుల్లో ఇరికించి, విచారణ కూడా లేకుండా నెలల తరబడి జైలులో పెట్టే పద్ధతిని అనుసరిస్తున్నాయి. ఇ.డి తో పాటు జాతీయ దర్యాప్తు సంస్థ, సి.బి.ఐ, ఆదాయపు పన్ను శాఖ, యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ప్రత్యర్థుల వేటలో ఒకే విధంగా ఉన్నాయి. కింది కోర్టులు తరచూ దర్యాప్తు సంస్థలతో కుమ్మక్కయ్యాయన్న ఆరోపణ సుప్రీంకోర్టు వ్యాఖ్యలను బట్టి కూడా చదవవచ్చు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో న్యాయమైన, సత్వర విచారణ హక్కు అంతర్లీనంగా ఉందని గుర్తు చేశారు. రాజ్యాంగంలోని 141వ అధికరణం అన్ని న్యాయస్థానాలకు వర్తిస్తుందని న్యాయానికి, న్యాయపరమైన వివరణకు ఆఖరి మాట అయిన సుప్రీంకోర్టు చెప్పింది. దీన్ని అర్థం చేసుకుని ట్రయల్ కోర్టులు, హైకోర్టులు బెయిల్ పిటిషన్లపై నిర్ణయం తీసుకుంటాయని ఆశించవచ్చు. మన రాజ్యాంగ లక్షణంగా పేర్కొనే వ్యక్తిగత స్వేచ్ఛను... ప్రాసిక్యూటర్ దయాదాక్షిణ్యాలకో లేక న్యాయ భావానికో తాకట్టు పెట్టకూడదు.

/ 'దేశాభిమాని' సౌజన్యంతో/

ఫ్రెంచి ప్రజా తీర్పు : మాక్రాన్ కుతంత్రాలు

అంతర్జాతీయం



మెజార్టీ వచ్చిన వామపక్ష ఫ్రంట్ నుండి దేశానికి ప్రధానమంత్రిని చేయాల్సిన బాధ్యత మాక్రాన్‌పై ఉంది. కొత్త అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పుడు స్పీకర్ (అధ్యక్షులు)ను ఎన్నుకోవాలి. ఇక్కడే మాక్రాన్ తన నాటకాలకు తెర లేపాడు. మెజార్టీ ఫ్రంట్ నుండి బరిలోకి దిగిన స్పీకర్ అభ్యర్థికి మాక్రాన్ పార్టీ మద్దతునివ్వలేదు. అంతకు ముందటి అసెంబ్లీలో తన పార్టీకి చెందిన స్పీకర్‌ను మరలా తన అభ్యర్థిగా నిలబెట్టి, తన ఫ్రంట్‌లో లేని మధ్యేవాద మితవాద పార్టీగా ఉన్న రిపబ్లికన్స్ మద్దతుతో ఆ పదవిని చేజిక్కించుకున్నాడు. ఓటర్ల తీర్పును మాక్రాన్ తొత్తడం చేశాడని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచాడని వామపక్ష ఫ్రంట్ విమర్శించింది.

ఇటీవల జరిగిన ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో ఓటర్లు పాలక పార్టీని రెండో స్థానానికి, పచ్చి మితవాదులను మూడో స్థానానికి నెట్టివేశారు. ఎన్నికలకు కేవలం రెండు నెలల ముందుగా వామపక్ష పార్టీలన్నీ కలసి ఏర్పాటు చేసిన న్యూ పాపులర్ ఫ్రంట్‌ను మొదటి స్థానంలో కూర్చోబెట్టారు. ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీ (దిగువ సభ)కి ఉన్న మొత్తం 577 స్థానాల్లో రెండో దశ ముగిసిన తర్వాత వామపక్ష ఫ్రంట్‌కు 188, పాలక పార్టీ 'రినైజెన్స్' నాయకత్వంలోని ఫ్రంట్‌కు 161, పచ్చి మితవాద నేషనల్ ర్యాలీ కూటమికి 142, మధ్యేవాద మితవాద పార్టీ రిపబ్లికన్స్‌కు 48, ఇతరులకు 38 సీట్లు వచ్చాయి.

వామపక్ష ఫ్రంట్‌లో ఉన్న 'తల వంచని ఫ్రాన్స్' (ఫ్రాన్స్ అన్‌బౌడ్) పార్టీ (అతివాద వామపక్షం)కి 78, సోషలిస్టు పార్టీకి 65, గ్రీన్స్ పార్టీకి 33, కమ్యూనిస్టు పార్టీకి 12 సీట్లు వచ్చాయి. వామపక్ష కూటమిలో మొదటి స్థానంలో ఉన్న రాడికల్ వామపక్ష పార్టీ చాలా బాధ్యతాయుతంగా వ్యవహరించింది. పచ్చి మితవాద పార్టీ నేషనల్ ర్యాలీ కూటమి మొదటి రౌండ్‌లో మొదటి స్థానాన్ని ఆక్రమించింది. రెండో రౌండ్‌లో మెరీన్ లీపెన్‌ను అడ్డుకోవడానికి వామపక్ష ఫ్రంట్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ పార్టీ 'రినైజెన్స్' నాయకత్వంలో ఉన్న కూటములు కలసి ఒక అవగాహనకు వచ్చాయి. తాము బలంగా లేని చోట అభ్యర్థులను ఉపసంహరించుకుని మితవాద కూటమి అభ్యర్థికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థి బరిలో వుండేలా చూడాలన్నదే ఆ అవగాహన. మొదటి రౌండ్‌లో మూడో స్థానంలో నిలిచిన అభ్యర్థులు రెండో రౌండ్‌లో పోటీ నుండి ఉపసంహరించుకున్నారు.



పి. అజయ కుమార్

ఈ రెండు కూటముల నిర్ణయానికి మాక్రాన్ పార్టీ నాయకత్వంలోని 'ఎన్‌సెంబుల్' (కలయిక) కూటమి కొంత మేరకే కట్టుబడింది. మూడో స్థానంలో ఉన్న తన అభ్యర్థులను అనేక మందిని అది ఉపసంహరించుకోలేదు. వామపక్ష కూటమి మాత్రం దీనిని పూర్తిగా అమలు చేసింది. ఫలితంగా పచ్చి మితవాద లీపెన్ నాయకత్వంలోని నేషనల్ ర్యాలీ కూటమి మూడో స్థానంలోకి పోయింది.

మెజార్టీ వచ్చిన వామపక్ష ఫ్రంట్ నుండి దేశానికి ప్రధానమంత్రిని చేయాల్సిన బాధ్యత మాక్రాన్‌పై ఉంది. కొత్త అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పుడు స్పీకర్ (అధ్యక్షులు)ను ఎన్నుకోవాలి. ఇక్కడే మాక్రాన్ తన నాటకాలకు తెర లేపాడు. మెజార్టీ ఫ్రంట్ నుండి బరిలోకి దిగిన స్పీకర్ అభ్యర్థికి మాక్రాన్ పార్టీ మద్దతునివ్వలేదు. అంతకు ముందటి అసెంబ్లీలో తన పార్టీకి చెందిన స్పీకర్‌ను మరలా తన అభ్యర్థిగా నిలబెట్టి, తన ఫ్రంట్‌లో లేని మధ్యేవాద మితవాద పార్టీగా ఉన్న రిపబ్లికన్స్ మద్దతుతో ఆ పదవిని చేజిక్కించుకున్నాడు. ఓటర్ల తీర్పును మాక్రాన్ తొత్తడం చేశాడని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచాడని వామపక్ష ఫ్రంట్ విమర్శించింది. వామపక్ష ఫ్రంట్ అభ్యర్థి ఆండ్రీ చాసైన్‌కు 207 ఓట్లు రాగా, మెక్రాన్ అభ్యర్థి బ్రాన్ ప్రైవెట్‌కు 227 ఓట్లు వచ్చాయి.

ఒలింపిక్స్ గేమ్స్ ముగిసిన తర్వాత ప్రధాన మంత్రి అభ్యర్థి ఎంపిక కోసం అధ్యక్షుడు మాక్రాన్ వివిధ గ్రూపులతో మొదటి రౌండ్ చర్చలు జరిపారు. వామపక్ష ఫ్రంట్‌తో ప్రారంభించి పచ్చి మితవాద నేషనల్ ర్యాలీ కూటమితో ముగించాడు. వామపక్ష ఫ్రంట్ తన ప్రధాన మంత్రి అభ్యర్థిగా వామపక్ష కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఆర్థికవేత్తగా, పౌర అధికారిగా ఉన్న 37 సంవత్సరాల లూసీ కేజెట్స్‌ను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను అధ్యక్షుడు ఆమోదించలేదు. వామపక్ష ప్రభుత్వం వ్యవస్థ స్థిరత్వానికి హాని చేస్తుందని, పార్లమెంట్ ఓటింగ్‌లో తిరస్కరించబడుతుందని చెప్పాడు.

రెండో రౌండ్ చర్చల్లో పాల్గొనడానికి వామపక్ష ఫ్రంట్ తిరస్కరించి, సెప్టెంబర్ 7న నిరసన ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. వామపక్ష ఫ్రంట్‌లో చీలికలు తేవాలని అధ్యక్షుడు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. వామపక్ష ఫ్రంట్, నేషనల్ ర్యాలీ కూటములను పక్కనపెట్టి తన ఎన్‌సెంబుల్ గ్రూపును మిగతా పార్టీలు బలపర్చాలని పరోక్షంగా అధ్యక్షుడు పిలుపునిచ్చారు. బడ్జెట్ తప్పని సరిగా ప్రవేశపెట్టాల్సిన అక్టోబర్ 1కి ముందుగా ప్రధానమంత్రి అభ్యర్థిని ఎంపిక చేయాల్సిన బాధ్యత అధ్యక్షునిపై ఉంది. తన బాధ్యతలను నయా ఉదారవాద విధానాలకు అనుకూలంగా మలచే ప్రయత్నాన్ని అధ్యక్షుడు కొనసాగిస్తున్నాడు.

ఏది ఎలా ఉన్నప్పటికీ ఫ్రాన్స్ ముందుకే పోతుంది. ఫ్రాన్స్ సమాజమే అంతకు ముందు రెండు శతాబ్దాల పాటు మథనాలకు గురైంది. ముందుకు పోతూ, వెనక్కి వస్తూ చివరికి రిపబ్లిక్ (గణతంత్ర దేశం)గా స్థిరపడింది. ఇప్పుడు కూడా వెనకా, ముందైనా సరే ఫ్రాన్స్ ప్రజానుకూలంగా ముందుకే పోతుంది. దానికి గ్యారంటీగా కార్మిక, ప్రజా ఉద్యమాలు ఉన్నాయి.

కొన్ని సంవత్సరాల పాటు ఫ్రాన్స్‌లో పసుపు పచ్చ జాకెట్ల (యెల్లో వెస్ట్స్) ఉద్యమం నడిచింది. 2018 నవంబర్ 17న ప్రారంభమైన ఈ ఉద్యమం కరోనా ప్రబలే వరకూ ఉంది. ఆ తరువాత కూడా కొంత కాలం కొనసాగింది. ఫ్రాన్స్‌లో ఉన్న భౌతిక పరిస్థితులు ఈ ఉద్యమానికి దారి తీశాయి. ఆకాశానికి ఎగిసిన ముడి చమురు, ఇంధన ధరలు, అత్యధికంగా పెరిగిన జీవన వ్యయం, ఆర్థిక అసమానతలు, అత్యల్ప ఆదాయాలు వచ్చే వారు కూడా ఇంధనానికి ఎక్కువ ఖర్చు చేయాల్సి రావటం తదితర కారణాలతో ప్రజలు విసిగిపోయి వీధి పోరాటాలు చేశారు. యెల్లో వెస్ట్స్ ఉద్యమం ఇతర దేశాలకు కూడా పాకింది. ఈ ఉద్యమం ఫ్రాన్స్‌లో కొన్ని వందల కోట్ల యూరోల పన్ను రాయితీలు సాధించింది.

మరి కొంత కాలానికి మాక్రాన్ తీసుకొచ్చిన పెన్షన్ సంస్కరణల బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం నడిచింది. పదవీ విరమణ వయసును 62 నుండి 64 సంవత్సరాలకు పెంచింది. పూర్తి పెన్షన్ పొందటానికి కార్మికుల కంట్రిబ్యూషన్‌ను పెంచేసింది. రవాణా, గ్యాస్, విద్యుత్తు రంగాల్లో ముందుగా పదవీ విరమణ పొందే అవకాశం ఇచ్చిన ప్రత్యేక పథకాలను ఈ బిల్లు రద్దు చేసింది. మాక్రాన్ పెన్షన్ సంస్కరణలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్ అంతటా పెద్ద ఉద్యమం నడిచింది. జాతీయ, అసెంబ్లీ పై దాడి చేసేదాకా ఈ ఉద్యమం కొనసాగింది.

కార్మికోద్యమాన్ని లెక్క చేయకుండా మాక్రాన్ నిరంకుశంగా బిల్లును ఆమోదింపచేసుకున్నాడు. అనేకసార్లు పార్లమెంటు తిరస్కరించిన ఈ బిల్లును అధ్యక్షుడు తనకున్న ప్రత్యేక అధికారాలు ఉపయోగించుకుని డిక్రీ ద్వారా అమలుకు పూనుకున్నాడు.

ఈ కాలంలో నయా ఉదారవాద విధానాలపై ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. ఈ అసంతృప్తిని పచ్చి మితవాద నేషనల్ ర్యాలీ పార్టీ పక్కదారి పట్టించే ప్రయత్నం చేసింది. ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు వలసలు వచ్చిన వారే కారణమని మితవాద పార్టీ ప్రచారం చేసింది. ప్రజల మనసులో జాతి, మత విద్వేష భావాలను రెచ్చగొట్టింది. బడా కార్పొరేట్ సంస్థలు కూడా నేషనల్ ర్యాలీ నాయకురాలు లీపెన్‌కు మద్దతునిచ్చారు. యూరోపియన్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీని వెనక్కి నెట్టి నేషనల్ ర్యాలీ మొదటి స్థానంలోకి రావటంతో మాక్రాన్ పార్లమెంటును రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లాడు.

నయా ఉదారవాద విధానాలకు బదులుగా వామపక్షాలు ప్రజల ముందు పెట్టిన ప్రత్యామ్నాయాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. కనీస వేతనం నెలకు 1700 యూరోలకు (1,42,000 రూపాయలు)కు పెంపు, వివాదాస్పద పెన్షన్ సంస్కరణల రద్దు, పబ్లిక్ సర్వీసుల్లో పెట్టుబడులు, అత్యంత సంపన్నులపై పన్ను, పర్యావరణాన్ని కాపాడే ప్రణాళికల గురించి వామపక్ష కూటమి విస్తృతంగా ప్రచారంలోకి తీసుకెళ్లింది.

వామపక్ష ఫ్రంట్ వాగ్దానాలు అమలు చేయాలంటే సంవత్సరానికి 12,600 కోట్ల డాలర్లు (రూ. 10,54,000 కోట్లు) అవుతాయని, ఇది సాధ్యం కాదని వామపక్ష వ్యతిరేకులు ప్రచారం చేస్తున్నారు. అత్యంత సంపన్నులపై పన్ను వేసి, ఆదాయంలో కింది స్థాయిలో ఉన్న వారిపై తక్కువ, ఎగువ స్థాయిలో ఉన్న వారిపై ఎక్కువ పన్నులు విధిస్తే ఇది సాధ్యమవుతుందని వామపక్షాలు చెబుతున్నాయి. అంతిమంగా నయా ఉదారవాద విధానాలకు, మాక్రాన్ ఫైనాన్స్ పెట్టుబడి అనుకూల విధానాలకు ఓటమి తప్పదు. జర్మనీలో వివిధ రాష్ట్రాలకు తాజాగా జరిగిన ఎన్నికల్లో పాలక పార్టీ ఓడిపోయి పచ్చి మితవాదులు ఆధిక్యత సాధించారు. ఫాసిస్టు శక్తులకు ఊతమిచ్చేలా మాక్రాన్ వ్యవహరిస్తున్నారు. ఈ ధోరణి చాలా ప్రమాదకరం.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు /

కవిత్వం

విలయతాండవ దృశ్యం

మేఘం బద్దలై వెదజల్లిన
వర్షానికి
ప్రకృతి శపించిన ఋతుపవనానికి
వాయుగుండపు జలదిగ్బంధంలో
జనజీవన దృశ్యం!
పచ్చని చేలల్లో పారుతున్న
నదీ ప్రవాహానికి
ఇంతకు ముందే తడిసి
మొలకెత్తిన పంట
ఇప్పుడు జలసమాధి
అయిపోయిన దృశ్యం!
నీటి ప్రవాహంలో
కొట్టుకుపోతున్న ఊర్లు
నేల వాలుతున్న చెట్లు,
మునిగిన వాహనాలు
జంతువులూ మనుషులూ
కొట్టుకుపోతున్న దృశ్యం!
వరదనీటితో బతుకు పోరాటం
పరుగు ఆగిపోయి
ఆహారం కోసం ఆకాశం వైపు
చూస్తున్న ప్రజలు
వరదలో కన్నీరు మున్నీరు
అయిన దృశ్యం!
కృష్ణమ్మ ఆగ్రహించి నగరాన్ని
ద్వేషించిందో
మనిషిపై మహోగ్రుడైన వరుణుడి
కుండపోతో
అర్థం కాని చిత్రం ఈ
విలయతాండవ దృశ్యం!
(విజయవాడలో వరదలు
ప్రత్యక్షంగా చూశాక)

- చిత్రాడ కిషోర్ కుమార్
సెల్ : 9866912906

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com



మోడీకి స్వాగతం పలుకుతున్న బ్రూనై యువరాజు హాజీ అల్-ముహతాదీ బిల్లా

బ్రూనైకు చేరుకున్న ప్రధాని మోడీ

దారుసలాం : రెండు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం బ్రూనై రాజధాని దారుసలాం చేరుకున్నారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి గల మార్గాలపై బ్రూనై నాయకత్వంతో చర్చించనున్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 40ఏళ్లు పూర్తయిన సందర్భంగా బ్రూనై రాజకుటుంబ సభ్యులతో, నాయకత్వంతో చర్చలు జరపనున్నట్లు, సంబంధాలను పటిష్టపరుచుకోనున్నట్లు మోడీ విదేశీ పర్యటనకు బయలుదేరడానికి ముందుగా ఢిల్లీలో చెప్పారు. ఇక్కడకు మోడీ చేరుకోగానే బ్రూనై యువరాజు హజి అల్ ముహ్‌తదీ బిల్లా స్వయంగా విమానాశ్రయంలో సాదర స్వాగతం పలికారు. రక్షణ సహకారం, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, రోదసీ సాంకేతికత, ఆరోగ్యం, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవాలని ఇరు దేశాలు భావిస్తున్నాయి. బ్రూనైలోని భారతీయులందరితో మోడీ భేటీ అవుతారని భావిస్తున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా మోడీ రాక కోసం తాము చాలా ఆతృతగా ఎదురుచూస్తున్నామని ఇప్పటికి ఆ కల నెరవేరిందని భారతీయుడు ఒకరు వ్యాఖ్యానించారు.

విజయవాడకు ముంపు రాకుండా చర్యలు

- సిఎం చంద్రబాబునాయుడు
- పూర్తిస్థాయిలో ఎన్యుమరేషన్
- వైసిపి పాలకులు రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టారు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విజయవాడకు బుడమేరు ముంపు రాకుండా తీసుకోవాల్సిన అన్ని చర్యలూ తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. మంగళవారం రాత్రి ఎన్‌టిఆర్ కలెక్టరేట్లో మీడియా ప్రతినిధులతో చంద్రబాబునాయుడు మాట్లాడారు. వరద సహాయక చర్యల కోసం అవసరమైన సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. అవసరమైతే సిబ్బందిని రోజువారీ కూలీ ప్రకారం తీసుకుని బాధితులకు అహారం అందించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అక్కడక్కడా బిస్కెట్లు, భోజనం విసిరేస్తున్నారని, అవి నీటితో పడుతున్నాయని, అదిగౌరవం కాదని చేతికి అందించాలని కోరారు. ఆహారం ఏదైనా చేతికి ఇవ్వాలని కోరారు. ట్రాక్టర్ల వల్ల రవాణాకు సౌలభ్యం వచ్చిందని తెలిపారు. ప్రతి వాహనం సచివాలయానికి పోలీసు ఎస్కార్టుతో పంపిస్తామని తెలిపారు. నిన్నా, మొన్నా వాహనాలను హైజాక్ చేసే పరిస్థితి వచ్చిందని, ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేదని తెలిపారు. అందరూ ఇళ్లవద్దే ఉండాలని, ఇంటికొచ్చి ఆహారాన్ని అందిస్తామని చెప్పారు. సచివాలయానికి ప్రత్యేక అధికారిని నియమిస్తామని, సెల్‌పోన్ సమాచారం అధారంగా ప్రజలకు సేవలు అందిస్తామని తెలిపారు. వరదల వల్ల వైరల్ ఫీవర్లు వచ్చే ప్రమాదం, అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందని తెలిపారు. ఏమి చేస్తే మంచిది, ఏమి చేయ కూడదనే విధంగా ప్రచారం చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకుంటామని అన్నారు. వరిపంట దెబ్బతిన్న ప్రాంతం మొత్తాన్ని డ్రోన్‌ద్వారా వివరాలు తీసుకుని ఎన్యుమరేషన్ చేయాలని తెలిపారు. వాహనాలు మునిగిపోతే వాటిని శుభ్రం చేసే బాధ్యతను ఫైర్ సర్వీసుకు అప్పగిస్తున్నామని తెలిపారు. మెటార్ వాహనాలు దెబ్బతిన్న వాటికి సంబంధించి ఇన్సూరెన్స్ కంపెనీలతో సమావేశం ఏర్పాటు చేసి క్లెయిములు సెటిల్ చేస్తామని తెలిపారు. వ్యాపారాలు దెబ్బతిన్నాయని అన్నారు. వారిని ఆదుకుంటామని తెలిపారు. వారికి ఏ విధంగా సహాయం చేయగలమో ఆలోచించి చేస్తామని వివరించారు. వీటికోసం గైడ్‌లైన్స్‌ను సిద్ధం చేస్తామని తెలిపారు. మొత్తం కార్యక్రమం పూర్తయ్యే వరకూ అధికారులు ఇక్కడే ఉంటారని తెలిపారు. ఎప్పటికప్పుడు అందరి ఆలోచనలు తీసుకుని సమర్థవంతంగా పనిచేసేందుకు వీలుగా చర్యలు తీసుకుంటామని అన్నారు. బుడమేరు నీరు విటిపిఎస్ మీదుగా కృష్ణానదికి వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. విజయవాడకు భవిష్యత్‌లో ఇలా జరగకుండా తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకుంటామని అన్నారు. అలాగే కొత్తగా అల్పపీడనం ఏర్పడిందని, దాన్నివల్ల ముప్పులేదని చెబుతున్నారని, ఒకవేళ ఉంటే తీసుకోవాల్సిన చర్యలన్నీ తీసుకుంటామని అన్నారు. వరదలో మృతిచెందిన పశువులను నిబంధనల ప్రకారం పూడ్చివేసే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. విద్యుత్ సేవల కోసం వచ్చిన లైన్‌మెన్ చనిపోయారని, అతనికి డిపార్టుమెంటు రూ.20 లక్షలు, ప్రభుత్వం రూ.10 లక్షలు మొత్తం రూ.30 లక్షలు ఆయన కుటుంబానికి ఇస్తామని తెలిపారు. సాయం అందించేందుకు చాలామంది ముందుకు వస్తున్నారని వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో ఉండేవారు కూడా ముందుకు రావాలని కోరారు. మానవతా ధృక్పథంతో తోచిన విధంగా ఆదుకునేందుకు ముందుకు రావాలని అన్నారు. దీనికోసం బ్యాంకు ఎకౌంటు, క్యూఆర్ కోడ్, సోషల్‌మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నామని అన్నారు. వాటిద్వారా దాతలు డబ్బులు ఇవ్వొచ్చని అన్నారు. బాధితులు కూడా తొందరపడొద్దని, అందరికీ న్యాయం చేస్తామని అన్నారు. చరిత్రలో లేని విపత్తును ఆదుకునేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకునేందుకు పొక్లెయినర్లపై వెళ్లాలని, దీనివల్ల అనేక విషయాలు తెలిసాయని పేర్కొన్నారు. ఒకటీ రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని అన్నారు. బుడమేరుకు సంబంధించి కట్టను బాగుచేయాల్సి ఉందని తెలిపారు. ఊహించని వర్షాలతో వచ్చిన విపత్తని తెలిపారు. వైసిపి చేసిన నిర్వాకం వల్ల రాష్ట్రానికి తీవ్ర ఇబ్బందులు వచ్చాయని తెలిపారు. పరిపాలన అధ్వానంగా తయారైందని, రాష్ట్రాన్ని వెంటిలేటర్‌పై పెట్టారని అన్నారు. రాజకీయ పార్టీకి ఉండాల్సిన ఒక్క లక్షణం కూడా వైసిపికి లేదని తెలిపారు. రౌడీలు, గూండాలను పెట్టుకుని పార్టీలు నడపాలంటే కుదరదని అన్నారు. బుకాయించడం మాని వాస్తవాలు చెప్పాలని వైసిపి నాయకులకు సూచించారు.

4.45 లక్షల ఎకరాల్లో పంట నష్టం

- ముంపులో 6.64 లక్షల మంది
- 2,851 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విజయవాడలో వరద దుస్థితి

రాష్ట్రంలో వరదలకు 4,45,390 ఎకరాల్లో వరి పంట దెబ్బతిందని, 2,851 కిలోమీటర్ల మేర ఆర్అండ్‌బి రోడ్లు దెబ్బతిన్నాయి. మొత్తం 6.64 లక్షల మంది ముంపునకు గురయ్యారు. దీనికి సంబంధించిన వివరాలను ఎపి ప్రకృతి విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టరు రోణంకి కూర్మనాథ్ వెల్లడించారు. ఇప్పటి వరకూ ఆరు హెలికాప్టర్ల ద్వారా 21 మందిని రక్షించినట్లు తెలిపారు. 12 విద్యుత్ సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయని, 149 పశువులు చనిపోయాయని పేర్కొన్నారు. 59,848 కోళ్లు చనిపోయినట్లు వెల్లడించారు. 11,968 పశువులకు వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. 221 కిలోమీటర్ల మేర పంచాయతీ రోడ్లు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీకి వస్తున్న వరద 6.47 లక్షల క్యూసెక్కులకు తగ్గినట్లు తెలిపారు.

సోషల్ మీడియాలోని వదంతులను నమ్మొద్దు : డిజిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుడివాడలోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగు కాలేజీకి సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను ఎవరూ నమ్మొద్దని డిజిపి ద్వారకా తిరుమలరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుడ్లవల్లేరు ఇంజినీరింగు కాలేజీలో స్పై కెమెరాలతో విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు వెలుగులోకి రాగానే రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించి విచారణకు ఆదేశించిందని తెలిపారు. ఐజి స్థాయి అధికారులు జివిజి అశోక్‌కుమార్, ఎం రవి ప్రకాశ్, పిహెచ్‌డి రామకృష్ణతో విచారణ కమిటీని వేసినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీ న్యూఢిల్లీకి చెందిన సిఇఆర్‌టి ఇన్ సంస్థ సహకారంతో పూర్తి స్థాయిలో విచారణ జరుపుతోందన్నారు. ఈ కేసుపై ఏ సమాచారం వున్నా విచారణ కమిటీకి అందించాలని ప్రజలకు, విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఆందోళన చెందొద్దన్నారు.



రైల్వే ఉద్యోగులపైనే ఫిర్యాదులు అధికం

- తరువాత స్థానంలో ఢిల్లీ స్థానిక సంస్థలు, పిఎస్‌యు బ్యాంక్ సిబ్బంది
- సివిసి 2023 నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ : గత ఏడాది సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి)కి అందిన ఫిర్యాదుల్లో ఎక్కువ ఫిర్యాదులు రైల్వే ఉద్యోగులపైనా ఉన్నాయి. తరువాత ఢిల్లీలోని స్థానిక సంస్థలు, ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. ఈ విషయాన్ని యాంటీ గ్రాఫ్ట్ వాచ్‌డాగ్ నివేదిక వెల్లడించింది. సివిసికి 2023లో మొత్తంగా అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులపై 74,203 ఫిర్యాదులు అందాయి. ఇందులో 66,373 ఫిర్యాదులను పరిష్కరించారు. మరో 7,830 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. విభాగాల వారీగా రైల్వే ఉద్యోగులపై అత్యధికంగా 10,447 ఫిర్యాదులు వచ్చాయి. తరువాత దేశ రాజధానిలోని స్థానిక సంస్థల ఉద్యోగులుపై (గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (జిఎన్‌సిటిడి) మినహాయించి) 7,665 ఫిర్యాదులు అందాయి. తరువాత అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు చెందిన ఉద్యోగులపై 7,004 ఫిర్యాదులు వచ్చాయి. తరువాత ఢిల్లీలోని ప్రభుత్వ ఉద్యోగులపై 6,638 ఫిర్యాదులు వచ్చాయి.ఢిల్లీ స్థానిక సంస్థల్లో ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఢిల్లీ జల్ బోర్డ్, ఢిల్లీ టూరిజం అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఢిల్లీ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్, ఢిల్లీ ట్రాన్స్‌కో లిమిటెడ్, ఢిల్లీ అర్బన్ షెల్టర్ ఇంప్రూవ్‌మెంట్ బోర్డ్, ఇంద్రప్రస్థ పవర్ జనరేషన్ కో లిమిటెడ్, మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ, న్యూ ఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ సంస్థలకు చెందిన ఉద్యోగులపై ఫిర్యాదులు వచ్చాయి. రైల్వే ఉద్యోగులపై వచ్చిన మొత్తం ఫిర్యాదుల్లో 9,881 పరిష్కరించగా, 566 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఢిల్లీలోని స్థానిక సంస్థల ఉద్యోగులపై వచ్చిన ఫిర్యాదుల్లో 7,278 ఫిర్యాదులు పరిష్కరించారు. 387 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. 2023లో ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులపై 7,004 అవినీతి ఫిర్యాదులు అందగా వీటిలో 6,667 పరిష్కరించారు. 337 పెండింగ్‌లో ఉన్నాయి. ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగులపై 6,638 ఫిర్యాదులు అందగా, 6,246 పరిష్కరించారు. వీటిల్లో ఢిల్లీ పోలీసు సిబ్బందిపై 5,313 ఫిర్యాదులు అందగా, వీటిలో 3,325 పరిష్కరించారు. గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల ఉద్యోగులపై 4,476 ఫిర్యాదులు అందగా, 3,723 పరిష్కరించారు. బొగ్గు మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులపై మొత్తం 4,420 ఫిర్యాదులు, కార్మిక మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులపై 3,217, పెట్రోలియం మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులపై 2,749 ఫిర్యాదులు వచ్చాయి. హోం మంత్రిత్వ శాఖ సిబ్బందిపై 2,309 ఫిర్యాదులు అందాయి. రక్షణ మంత్రిత్వ శాఖ ఉద్యోగులపై 1,861, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్సెస్ ఉద్యోగులపై 1,828, టెలికమ్యూనికేషన్ ఉద్యోగులపై 1,457 గ్రాఫ్ట్ ఫిర్యాదులు వచ్చాయి. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్ ఉద్యోగులపై 1,205 ఫిర్యాదులు అందాయి. ప్రభుత్వ రంగ బీమా కంపెనీల ఉద్యోగులపై 960 ఫిర్యాదులు, విద్యుత్ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఉద్యోగులపై 930, వినియోగదారుల వ్యవహారాల ఉద్యోగులపై 929 ఫిర్యాదులు, ఆహారం-ప్రజాపంపిణీ సిబ్బందిపై 889 ఫిర్యాదులు వచ్చాయి.

వైసిపి నేతల ముందస్తు బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

టిడిపి ప్రధాన కార్యాలయంపై దాడి కేసులో తమకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ పలువురు వైసిపి నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు బుధవారం తీర్పు చెప్పనుంది. మంగళవారం తీర్పు వస్తుందని అందరూ భావించినప్పటికీ కేసుల జాబితాలో ఈ పిటిషన్లు లేవు. వివిధ కారణాల వల్ల జాబితాలో పిటిషన్లు లేవని, బుధవారం తీర్పు చెబుతామని న్యాయమూర్తి జస్టిస్ కృపాసాగర్ పేర్కొన్నారు. కఠిన చర్యలు తీసుకోవద్దంటూ గతంలోని మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు.

అక్టోబర్ 18 నుంచి ప్రొ కబడ్డీ

హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్(పికెఎల్) సీజన్-11 షెడ్యూల్ వచ్చేసింది. ఇటీవల ప్రొ కబడ్డీ వేలం ముగియడంతో నిర్వాహకులు 2024 సీజన్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. పికెఎల్ 11వ సీజన్ అక్టోబర్ 18 నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరిగే ప్రొ కబడ్డీ ఈ సీజన్ ప్రారంభం కానుంది. ఈ టోర్నీని ఈసారి మూడు నగరాల్లో నిర్వహించనున్నట్లు లీగ్ కమిషనర్ అనుపమ్ గోస్వామి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించాడు.

విధులు బహిష్కరించిన జిఎంఎస్ కార్మికులు



- సమస్యలను పరిష్కరించాలంటూ ప్లాంట్ ముందు ధర్నా
- న్యాయం చేయకపోతే సహాయ నిరాకరణ

ప్రజాశక్తి - పత్తికొండ (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి పరిసర ప్రాంతాల్లో జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ (జిఎంఎస్) సంస్థ గోల్డ్ మైనింగ్ తవ్వకాల పనులు చేస్తున్న కార్మికులు మంగళవారం విధులు బహిష్కరించి ధర్నా చేశారు. తమకు ఉద్యోగ భరోసా కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. లేకపోతే ప్లాంట్‌కు తిండి, నీరు వంటి వసతులను పూర్తిగా నిలిపివేస్తామని సంస్థ యాజమాన్యాన్ని కార్మికులు హెచ్చరించారు. జిఎంఎస్ సంస్థ రెండు ప్లాంట్ల వర్కర్లు విధులను బహిష్కరించి గేటు ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు, ఇన్సూరెన్స్ వంటి సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఇప్పుడు మరికొన్ని రోజులు సమయం కావాలని కాలయాపన చేస్తోందని తెలిపారు. భూములిచ్చిన రైతులకు జిఎంఎస్ ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కంపెనీలో విధులు నిర్వహిస్తున్న స్థానిక వర్కర్లకు దినసరి కూలి రూ.400 చొప్పున ఇస్తూ, బయట వారికి రూ.800 నుండి రూ.1000 చెల్లిస్తూ పక్షపాతం చూపుతోందని తెలిపారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కంపెనీ ప్రతినిధులను అడిగితే ఇష్టముంటే పనిలో ఉండండని, లేకపోతే వెళ్లిపోండని తెగేసి చెబుతున్నారని వాపోయారు. ప్లాంట్‌లో ఎటువంటి ప్రమాదం జరిగినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని తెలిపారు. రైతుల నుండి పొలాలను తీసుకునేప్పుడు ఎన్నో హామీలను ఇచ్చిందని, ఇప్పుడు వాటిని నెరవేర్చడం లేదని వివరించారు. మంచిగా పంటలు పండే పొలాలను సంస్థకు ఇచ్చి చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని తెలిపారు. సమస్యలను పరిష్కరించే వరకు ప్లాంట్లలో విధులకు హాజరు కాబోమని తేల్చి చెప్పారు.



రైతులతో మాట్లాడుతున్న రైతు, కౌలు రైతు సంఘం నేతలు

చల్లపల్లిలో రైతు సంఘం నాయకుల పర్యటన

- దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన
- పంట రుణాలు మంజూరు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-చల్లపల్లి (కృష్ణా జిల్లా)

ఆకస్మికంగా సంభవించిన వరదలకు నష్టపోయిన రైతులకు పంట రుణాలు మంజూరు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా చల్లపల్లి మండల పరిధిలోని వెలివోలు, నిమ్మగడ్డ, నడకుదురు గ్రామాల్లో ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు మంగళవారం పర్యటించారు. నీట మునిగిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట రుణాలను మాఫీ చేయాలని, ఈ క్రాప్ చేసిన సకల రైతులకు ఇన్సూరెన్స్ ప్రభుత్వాన్ని కోరారు. కృష్ణానది పై ఆధారపడిన పంట నష్టపోయిన రైతులకు ఎరువులు, విత్తనాలు రాయితీపై సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చల్లపల్లిలోని పునరావాస కేంద్రంలో ఉన్న అమ్ముదారులంక గ్రామస్తులను పరామర్శించారు. సర్వసం కోల్పోయి పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వ్యవసాయ కార్మికులకు రూ.10 వేలు తక్షణ సాయంగా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు, ముర్రాపు సూర్యనారాయణ, ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బిజెపితో విభేదాలున్నాయి

- అంగీకరించిన ఆర్‌ఎస్‌ఎస్

న్యూఢిల్లీ : బిజెపితో విబేధాలున్న మాట నిజమేనని ఆర్‌ఎస్‌ఎస్ అంగీకరించింది. అయితే ఇది తమ కుటుంబ సమస్య అని, చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపింది. "ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ళు పూర్తి చేసుకుంటోంది. ఇదొక సుదీర్ఘ ప్రయాణం. ఇలాంటి ప్రయాణంలో ఏవో విభేదాలు వస్తూ వుంటాయి. అటువంటి వాటిని అధిగమించడానికి మా వద్ద యంత్రాంగం వుంది. సమావేశాలు, ఇష్టాగోష్టి చర్చలు, భేటీలు ఇలా జరుగుతున్నాయి. వందేళ్ల చరిత్ర చూస్తే ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం దొరుకుతుంది."అని ఆర్‌ఎస్‌ఎస్ ప్రచార విభాగం ఇన్‌చార్జి సునీల్ అంబేకర్ వ్యాఖ్యానించారు. బిజెపి, సంఘ్ మధ్య సమన్వయం కొరవడుతోందా అన్న ప్రశ్నకు ఆయన పైవిధంగా స్పందించారు.. కేరళలోని పాలక్కడ్‌లో ఆర్‌ఎస్‌ఎస్ నిర్వహించిన మూడు రోజుల అఖిల భారతీయ సమన్వయ్ బైఠక్ సమావేశాల ముగింపు రోజున ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికలు, సమన్వయ లోపానికి సంబంధించిన అంశాలు, పార్టీ స్వయం స్వావలంబన సాధిస్తోందంటూ బిజెపి అధ్యక్షుడు నడ్డా చేసిన ప్రకటనపై ఈ సమావేశాల్లో చర్చించినట్లు అంబేకర్ తెలిపారు. రెండు సంస్థల మధ్య విభేదాలు తలెత్తాయని బహిరంగంగా సంఘ్ అంగీకరించడం గమనార్హం. ఎన్నికలకు ముందు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ఆడుతున్న నాటకంలో భాగమే.. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఒక ఆంగ్ల పత్రికకు బిజెపి చీఫ్ నడ్డా ఇంటర్వ్యూ ఇస్తూ, పార్టీకి ఇక ఆర్‌ఎస్‌ఎస్ అవసరం ఎంత మాత్రమూ లేదని ఇప్పుడు బిజెపి స్వయం స్వావలంబన సాధించిందని వ్యాఖ్యానించారు. దీనివల్ల క్షేత్ర స్థాయిలో పనిచేసే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల నైతిక స్థైర్యం దెబ్బతిందని, వారు ఆశించిన ఉత్సాహంతో ఓటర్లను సమీకరించలేకపోయారని అందువల్లే బిజెపికి పేలవమైన ఫలితాలు వచ్చాయని భావిస్తున్నారు.

అమెరికా సామ్రాజ్యవాద దాడి !

- వెనిజులా అధ్యక్షుడి విమానం స్వాధీనం

కారకస్ : వెనిజులాపై మరోసారి సామ్రాజ్యవాద దాడి జరిగింది. అధ్యక్షుడు మదురో ఉపయోగిస్తున్న విమానాన్ని అమెరికా అక్రమంగా స్వాధీనం చేసుకుంది. ఇటువంటి నేరాలకు పాల్పడడం అలవాటుగా వున్న అమెరికా అధికారులు అక్రమంగా ఈ చర్య చేపట్టడమే కాకుండా తమ చర్యలను నిస్సిగ్గుగా సమర్ధించుకుంటున్నారు. వెనిజులా ప్రభుత్వం ఈ చర్యను తీవ్రంగా నిరసించింది. ఖండించింది. ఇక్కడి విమానాన్ని ఫ్లోరిడాకు తీసుకుని వెళ్లిపోయారు. పౌర విమానయాన చట్టాలను అత్యంత దారుణంగా ఉల్లంఘించిన ఈ చర్యలో అనేక ఫెడరల్ సంస్థల ప్రమేయం వుంది. అమెరికా హోం, వాణిజ్య, పారిశ్రామిక, భద్రతా, న్యాయ శాఖల పాత్ర వుంది. దేశాలను బెదిరించడానికి, వాటిపై ఒత్తిడి తీసుకురావడానికి తన ఆర్థిక, సైనిక శక్తిని ఉపయోగించి తన నేరాల్లో వాటిని కూడా భాగస్వాములుగా చేసింది. ఈ మేరకు వెనిజులా విదేశాంగ మంత్రి యువాన్ గిల్ ఒక డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. తమ దేశానికి జరిగిన ఈ నష్టానికి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనిజులా తన హక్కులను అట్టిపెట్టుకుందని చెప్పారు. మరోసారి వెనిజులా దురాక్రమణలకు, బ్లాక్‌మెయిల్‌కు కేంద్రమైందని వెనిజులా అధ్యక్షుడు, పార్టీ కేంద్ర కమిటీ ఫస్ట్ కార్యదర్శి మిగ్వెల్ డయాజ్ కానెల్ ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

అమెరికాలో 'ట్రిపుల్ ఇ' వైరస్ కలకలం

అమెరికా: కరోనాను మరిచిపోతున్న తరుణంలో అమెరికాలో వెలుగుచూసిన మరో ప్రాణాంతక వైరస్ ఆందోళన కల్గిస్తోంది. దోమకాటు కారణంగా అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రంలో ట్రిపుల్ ఈ వైరస్ బారిన ప్రజలు పడుతున్నారు. తాజాగా ఈ వైరస్ సోకిన న్యూహాంప్ షైర్ కు చెందిన వ్యక్తి ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. మరో 80 ఏళ్ల వృద్ధుడు ఆసుపత్రిలో కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుండటం చర్చనీయాంశంగా మారింది. దీంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. ముందస్తు జాగ్రత్తగా అక్కడి ఐదు పట్టణాల్లో పాక్షిక లాక్ డౌన్ విధించారు. ఈ వైరస్ సోకిన వారిలో జ్వరం, తలనొప్పి, వికారం, వాంతులు, డయేరియా, ఫిట్స్ వంటి లక్షణాలు కనబడతాయి. దోమకాటు మూలంగా ఈ వైరస్ విస్తరిస్తుంది. ట్రిపుల్ ఈ వైరస్ కు ఎలాంటి మందు లేదని, కావున ఎవరికివారు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక యంత్రాంగం సూచిస్తోంది.

లార్డ్స్‌లో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్: ఐసిసి

లండన్: 2024-25 ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్ లార్డ్స్‌లో జరగనుంది. లండన్‌లోని లార్డ్స్ స్టేడియం డబ్ల్యూటిసి ఫైనల్‌కు తొలిసారి ఆతిథ్యమివ్వనుంది. ఈ విషయాన్ని అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసిసి) మంగళవారం వెల్లడించింది. 2025 జూన్ 11-15 మధ్య డబ్ల్యూటిసి ఫైనల్ జరగనున్నట్లు ఐసిసి తెలిపింది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు లార్డ్స్ స్టేడియం వేదికవ్వడం ఇది మొదటిసారి. తొలి సీజన్‌లో టీమిండియాను ఓడించిన న్యూజిలాండ్ టెస్టు గదను ముద్దాడింది. 2022-23లో కూడా భారత్ ఫైనల్ చేరినా ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ 2024-25 సీజన్‌లో టాప్-2లో ఉన్న రెండు జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. ప్రస్తుతం టెస్టు చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో రోహిత్ శర్మ నేతృత్వంలోని భారత జట్టు 68.52 పర్సంటేజ్‌తో అగ్రస్థానంలో ఉండగా.. ఆస్ట్రేలియా 62.50 పర్సంటేజ్‌తో రెండో స్థానంలో ఉంది.

ఉగాండా మహిళా రన్నర్‌పై దాష్టీకం

పెట్రోలు పోసి నిప్పంటించిన ప్రియుడు



కంపాల(ఉగాండా): ఉగాండా మహిళా మారథాన్ రన్నర్ రెబెక్కా చెప్టెగీను(33)ను ఆమె ప్రియుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. 75 శాతం కాలిన గాయాలతో ఉన్న ఆమెను స్థానికులు ఆసుపత్రికి తరలించగా.. చావుబతుకుల మధ్య ఆమె కొట్టుమిట్టాడుతోంది. కెన్యాకు చెందిన డిక్సన్ డియెమ మరగచ్‌తో రెబెక్కా కొద్ది రోజులుగా సహజీవనం చేస్తోంది. ఆదివారం రెబెక్కా చర్చి నుంచి తిరిగి ఇంటికి వచ్చాక డిక్సన్ ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వీరు తరచూ గొడవపడేవాళ్లని, ఈ సంఘటనకు 'గృహ హింస' కారణమని కెన్యా పోలీసులు తెలిపారు. రెబెక్కాపై దాడి విషయం తెలిసి ఉగాండా ప్రజలతో పాటు ఒలింపిక్ సంఘం కూడా ఆగ్రహం వ్యక్తం చేసింది. 2024 పారిస్ విశ్వ క్రీడల్లో రెబెక్కా మారథన్‌లో 44వ స్థానంలో నిలిచింది.

ఆర్‌ఎస్‌ఎస్‌లోకి ఉద్యోగులను అనుమతించొద్దు

- కేంద్ర ప్రభుత్వానికి మాజీ సివిల్ సర్వెంట్ల గ్రూప్ విజ్ఞప్తి



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరేందుకు ప్రభుత్వ ఉద్యోగులను అనుమతించే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని మాజీ సివిల్ సర్వెంట్ల గ్రూప్, కాన్‌స్టిట్యూషనల్ కాండక్ట్ గ్రూప్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. మాజీ విదేశాంగ శాఖ కార్యదర్శులు సుజాతాసింగ్, శివశంకర్ మీనన్‌సహా 115 మంది రిటైర్డ్ సీనియర్ బ్యూరోక్రాట్లు సభ్యులుగా ఉన్న ఈ గ్రూపు మంగళవారం నాడిక్కడ ఒక ప్రకటన విడుదల చేసింది.. ఉత్తర్వును అమలు చేయడం వల్ల రాజ్యాంగం ఆత్మకు 'అపారమైన హాని' జరుగుతుందని పేర్కొన్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్)లో సభ్యులుగా ఉండకూడదని 58 ఏళ్లుగా విధించిన నిషేధాన్ని ఎత్తివేస్తూ జూలై 9న ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కోరాయి. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) హిందుత్వ గ్రూప్ అని, భారతీయ జనతా పార్టీ (బిజెపి) మాతృసంస్థ అని పేర్కొన్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆర్‌ఎస్‌ఎస్ మూడు సార్లు నిషేధానికి గురైందని, ఇది హిందూ ఆధిపత్యాన్ని, మైనారిటీల పట్ల అసహనాన్ని ప్రోత్సహిస్తుందని విమర్శించాయి. 1966 నవంబర్‌లో ప్రభుత్వ అధికారులతో సంబంధం లేని సంస్థల జాబితాలో సంఘ్ పేర్కొనబడిందని గుర్తు చేశాయి. భారత సమాజంలో కులం, మతం, లింగం అంశాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నాయి. "లౌకిక ప్రజాస్వామ్యం, మైనారిటీ హక్కులను పరిరక్షించే పనిలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, వాటిని సైద్ధాంతికంగా వ్యతిరేకించే సంస్థకు తమ విధేయతను బహిరంగంగా ప్రకటించడానికి అనుమతించే ఈ ప్రభుత్వ ఉత్తర్వు పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నాము" అని పేర్కొన్నాయి.

రాజ్యాంగాన్ని రక్షించడం అధికారులు, పోలీసుల విధి

రాజ్యాంగాన్ని రక్షించడం, సమర్థించడం సివిల్ అడ్మినిస్ట్రేటర్లు, పోలీసుల ప్రధాన విధి అని పేర్కొన్నాయి. "ఇందులో మతపరమైన, కుల మైనారిటీల జీవితం, స్వేచ్ఛ, ఆరాధనతో సహా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ ఉంటుంది" అని స్పష్టం చేశాయి. సివిల్ సర్వెంట్లు తమ మానవతావాదాన్ని, నిష్పాక్షికతను, రాజ్యాంగం నిర్దేశించిన విలువలకు కట్టుబడి ఉండాలని అన్నివేళలా ప్రదర్శించాలని లేఖలో పేర్కొన్నాయి. నిషేధాన్ని ఎత్తివేయడం అంటే "జిల్లా మేజిస్ట్రేట్, ఒక పోలీసు అధికారి, ప్రభుత్వ కార్యదర్శి, ప్రొఫెసర్, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ వైద్యుడు" బహిరంగంగా" భిన్నవాదాన్ని తిరస్కరించే సంస్థలో సభ్యుడు కావచ్చు. ఇది రాజ్యాంగంలోని లౌకిక మూలానికి విరుద్ధమైనదని పేర్కొన్నాయి.

ఆర్‌ఎస్‌ఎస్ సాంస్కృతిక సంస్థ కాదు...రాజకీయ సంస్థ

"ఆర్‌ఎస్‌ఎస్ ఒక సాంస్కృతిక సంస్థ అని, రాజకీయ సంస్థ కాదనే సాకుతో నిషేధాన్ని ఎత్తివేశారు. ఇది పూర్తిగా నిజం కాదు. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ సంస్థే" అని లేఖలో తెలిపాయి. "99 ఏళ్ల క్రితం ఏర్పడినప్పటి నుండి దాని వ్యవస్థాపకులు, నాయకులచే వ్యక్తీకరించబడిన హిందూ రాష్ట్ర (హిందూ దేశం) లక్ష్యం ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం ప్రధాన భాగంలో ఉంది" అని పేర్కొన్నాయి. ప్రతి విశ్వాసం, గుర్తింపు కలిగిన వ్యక్తులకు సమాన పౌరసత్వ హక్కులు, స్వేచ్ఛలకు హామీ ఇచ్చే రాజ్యాంగం మూల సూత్రాలు, ప్రతిజ్ఞలకు విరుద్ధంగా ఉందని వివరించాయి. 'ప్రభుత్వ అధికారులను ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులుగా లేదా దానితో అనుబంధం కలిగి ఉండటానికి అనుమతించే ప్రభుత్వ ఉత్తర్వు రాజ్యాంగాన్ని ఉల్లంఘించినట్లే" అని తెలిపాయి.

లక్షల మంది ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు ఎన్నికల్లో బిజెపికి పని చేస్తున్నారు

"అక్షరాలా మిలియన్ల మంది ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు ప్రతి రాష్ట్ర, జాతీయ ఎన్నికలలో బిజెపికి బహిరంగంగా ప్రచారం చేస్తారు" అని స్పష్టం చేశాయి. "ప్రధాన ఎన్నికల కమిషనర్లు, రిటర్నింగ్ అధికారులు, నిష్పక్షపాతంగా ఎన్నికలను నిర్వహించే పనిలో ఉన్న ఇతరులందరూ ఒక నిర్దిష్ట రాజకీయ పార్టీతో బలంగా జతకట్టిన సంస్థలో సభ్యులుగా ఉన్నప్పుడు ఎన్నికల ప్రక్రియ సమగ్రతకు ఎలా హామీ ఇవ్వబడుతుంది?" అని ప్రశ్నించాయి. ఆర్‌ఎస్‌ఎస్‌తో సైద్ధాంతిక అనుబంధాలు ఉన్న సంస్థల సభ్యులు కూడా ఇటీవలి కాలంలో "ద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారు. కొన్నిసార్లు మారణహోమం, జాతి ప్రక్షాళనకు పిలుపునిచ్చారు" అని తెలిపాయి. మత హింస ఎపిసోడ్‌లపై కనీసం ఆరు న్యాయ విచారణ కమిషన్‌లు ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో అనుబంధం కలిగి ఉన్న సంస్థలను మత హింస మంటల్లో పాత్ర ఉన్నట్లు అభియోగాలు మోపాయి. దీని ఫలితంగా ముస్లింలు, ఇతర పౌరుల విస్తృతమైన ప్రాణ, ఆస్తి నష్టం జరిగిందని గుర్తు చేశాయి. "సివిల్ సర్వెంట్లు రాజ్యాంగంలో మొదట సేవకులు. దీని తరువాత మాత్రమే వారు పనిచేసే ఎన్నుకోబడిన ప్రభుత్వానికి కట్టుబడి ఉండేవారు" అని లేఖలో పేర్కొన్నారు. "రాజ్యాంగ ప్రతిజ్ఞలు, అత్యంత వెనుకబడిన పౌరుల హక్కులు ప్రభుత్వ ఆదేశాలతో దెబ్బతింటుంటే, అటువంటి రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను నిరోధించడం వారి విధి అని స్పష్టం చేశాయి.

నిషేధం ఎత్తివేస్తూ రాష్ట్రాల్లోనూ ఉత్తర్వులు

కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిన నెల తరువాత రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలలో పాల్గొనే ప్రభుత్వ ఉద్యోగులపై నిషేధాన్ని ఎత్తివేసింది. ప్రభుత్వోద్యోగులకు సంబంధంలేని 17 సంస్థల జాబితా నుంచి ఆర్‌ఎస్‌ఎస్‌ను తొలగించాలని రాజస్థాన్ ప్రభుత్వం నిర్ణయించింది. 1972 నుంచి రాష్ట్రంలో నిషేధం అమలులో ఉంది. హర్యానా, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌తో సహా అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆర్‌ఎస్‌ఎస్‌లో సభ్యులుగా ఉండకూడదన్న నిషేధాన్ని ఎత్తివేసాయి. మహాత్మా గాంధీ హత్యానంతరం ఆర్‌ఎస్‌ఎస్‌పై మొదట నిషేధం విధించారు. ఆ తరువాత 1975 నుంచి 1977 వరకు ఎమర్జెన్సీ సమయంలోనూ, 1992లో అయోధ్యలోని బాబ్రీ మసీదు కూల్చివేత తరువాత నిషేధించారు.



న్యాయం చేయండి

ఆర్‌జి కర్ ఆసుపత్రి ఘటనపై వామపక్షాల భారీ ఆందోళన

కొల్‌కతా : ఆర్‌జి కర్ ఆసుపత్రిలో మెడికోపై అత్యాచారం, దారుణ హత్యను నిరసిస్తూ, వామపక్షాలు మంగళవారం నిర్వహించిన మార్చ్ జన సంద్రమైంది. 'న్యాయం చేయాలి... మహిళలపై ఘాతుకాలకు అడ్డుకట్ట వేయాలి' అంటూ ముక్తకంఠంతో వేలాదిమంది నినదించారు. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు ఎక్కడికక్కడ రాష్ట్రప్రభుత్వం ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. బారికేడ్లను తోసివేసి సైతం జనం భాగస్వాములయ్యారు. యువత, మహిళలు అధిక సంఖ్యలో హాజరై, ఇలాంటి దురాగతాలను సహించేది లేదని హెచ్చరించారు.

ఎట్టకేలకు సందీప్ ఘోష్ సస్పెన్షన్

కొల్‌కతా : ఎన్నో ఆరోపణలు వచ్చిన తరువాత ఎట్టకేలకు ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్‌ను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మంగళవారం సస్పెండ్ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆరోగ్య శాఖను కూడా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ సర్వీస్ రూల్స్ సెక్షన్ 7(1సి) ప్రకారం సందీప్ ఘోష్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. కొల్‌కతా ఘటన తరువాత కూడా సందీప్ ఘోష్‌పై మమతా ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఆర్‌జికర్ ఆసుపత్రి నుంచి బదిలీ చేసి నేషనల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా 'ప్రైజ్ పోస్టింగ్' ఇచ్చారు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చిన మమతా ప్రభుత్వం స్పందించలేదు. మెడికల్ కాలేజీలో ఆర్థిక అవకతవకలకు పాల్పడిన కేసులో సందీప్ ఘోష్‌ను సిబిఐ సోమవారం అరెస్టు చేసింది. దీంతో, ఒక రోజు తరువాత మమతా ప్రభుత్వం సందీప్ ఘోష్‌ను సస్పెండ్ చేసింది.

ఎనిమిది రోజుల సిబిఐ కస్టడీ

సోమవారం అరెస్టు చేసిన సందీప్ ఘోష్‌ను మంగళవారం సిబిఐ కోర్టులో ప్రవేశపెట్టింది. కోర్టు ఎనిమిది రోజుల సిబిఐ కస్టడీకి అప్పగించింది. ఆర్‌జి కర్ మెడికల్ కళాశాలలో ఆర్థిక అవకతవకల ఆరోపణలపై నేరపూరిత కుట్ర, మోసం, అవినీతి నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద సందీప్‌ఘోష్‌పై కేసులు నమోదయ్యాయి. తొలుత కొల్‌కతా పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేసినప్పటికీ హైకోర్టు ఆదేశాలతో ఈ కేసును ప్రస్తుతం సిబిఐ విచారణ చేస్తోంది. ఈ క్రమంలోనే ఆయన నివాసంలో సోదాలు నిర్వహించి, విచారించింది. 15 రోజుల విచారణ తరువాత సోమవారం అరెస్టు చేసింది.

తప్పుల తడకలుగా కొత్త ఎంబిబిఎస్ సిలబస్

- ట్రాన్స్‌జెండర్ల, వికలాంగ హక్కుల గ్రూపుల విమర్శ

న్యూఢిల్లీ : కొత్త ఎంబిబిఎస్ సిలబస్ పూర్తిగా తప్పుల తడకలతో నిండివుందని ట్రాన్స్‌జెండర్, వికలాంగ హక్కుల గ్రూపులు విమర్శిస్తున్నాయి. ఈ తప్పులను వెంటనే సరిదిద్దాలని, రాబోయే వారం రోజుల్లో చర్యలు తీసుకోవాలని వారు జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసి)ను కోరాయి. దిద్దుబాటు చర్యలు తీసుకోని పక్షంలో ఎన్‌ఎంసిని తాత్కాలికంగా సస్పెండ్ చేయాలని కోరుతూ ప్రపంచ సమాఖ్యకు లేఖ రాస్తామని పేర్కొన్నాయి. ఇటీవల ఎంబిబిఎస్ విద్యార్థుల కోసం జాతీయ మెడికల్ కమిషన్ జారీ చేసిన సిలబస్ మార్గదర్శకాల ప్రకారం సోడొమిని, లెస్బియన్‌గా వుండడాన్ని లైంగిక నేరంగా పరిగణిస్తారు. క్రాస్ డ్రెస్సింగ్ అనేది లైంగిక వికృత చేష్టల కిందకు వస్తుంది. ఇలాంటివన్నీ ఆ మార్గదర్శకాల్లో వున్నాయి. వికలాంగులైన డాక్టర్ల సంక్షేమం కోసం పనిచేసే ఏజెంట్స్ ఆఫ్ ఛేంజ్ గ్రూప్‌కు నాయకత్వం వహిస్తున్న సత్యేంద్ర సింగ్ మీడియాతో మాట్లాడుతూ, ట్రాన్స్‌జెండర్ల రక్షణ చట్టం, 2019ని ఎన్‌ఎంసి ఉల్లంఘిస్తోందని అన్నారు. కేరళ, మద్రాసు హైకోర్టులు సూచించిన తర్వాత కమిషన్ 2021 అక్టోబరు 13న అన్ని మెడికల్ వర్సిటీలకు ఒక లేఖ రాసింది. అశాస్త్రీయమైన, అప్రతిష్టకరమైన, ఎల్‌జిబిటిక్యు కమ్యూనిటీ పట్ల వివక్ష గల సమాచారాన్ని ఆమోదించరాదని ఆ వర్సిటీలను కోరింది. ఇప్పుడు ఆ చట్టమే ఉల్లంఘించబడుతోందని వికలాంగుల హక్కుల గ్రూపులు పేర్కొన్నాయి.

23వ లా కమిషన్ ఏర్పాటు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

న్యాయ సంస్కరణల కోసం 23వ లా కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది నిరుపయోగంగా మారిన, రద్దు చేయగల చట్టాలను గుర్తించడం, పేదలను ప్రభావితం చేసే చట్టాలను తనిఖీ చేయడం, కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ ఏదైనా చట్టంపై తన అభిప్రాయాలను తెలియజేయడం కోసం మూడేళ్లపాటు ఉంటుంది. 2024 సెప్టెంబరు ఒకటి నుండి 2027 ఆగస్టు 31 వరకు లా కమిషన్ కాలపరిమితి నిర్ణయించారు. ఈ కమిషన్‌లో ఛైర్మన్, నలుగురు సభ్యులు, కార్యదర్శులు లీగల్ అఫైర్స్, లెజిస్లేటివ్ డిపార్ట్‌మెంట్లు ఎక్స్-అఫీషియో సభ్యులు, ఐదుగురు పార్ట్‌టైమ్ సభ్యులు ఉంటారు. అయితే ఈ కమిషన్ ఛైర్మన్‌తో సహా సభ్యులను ప్రభుత్వం ఇంకా నియమించలేదు.

2020లో రూపొందించిన 22వ లా కమిషన్ నిబంధనల మాదిరిగానే, కొత్త ప్యానెల్ 'రాష్ట్ర పాలసీకు సంబంధించిన ఆదేశిక సూత్రాల వెలుగులో ప్రస్తుత చట్టాలను పరిశీలించడం, మెరుగుదల, సంస్కరణల మార్గాలను సూచించడం వంటి బాధ్యతలను కలిగి ఉంది. ఆదేశిక సూత్రాలను అమలు చేయడానికి, రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న లక్ష్యాలను సాధించడానికి అవసరమైన చట్టాలు చేయడం' వంటివి ప్రతిపాదిస్తుంది. ఆహార భద్రత, నిరుద్యోగంపై ప్రపంచీకరణ ప్రభావాన్ని పరిశీలించాలని, అట్టడుగువర్గాల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలను సిఫార్సు చేయాలని కూడా కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం కోరింది. ఇది గత 22వ కమిషన్ నిబంధనలలోనూ ఉంది. ప్రస్తుత కాలపు డిమాండ్లకు మరింత ప్రతిస్పందించేలా చేయడానికి న్యాయ పరిపాలన వ్యవస్థను సమీక్షించడం, ప్యానెల్ లక్ష్యాలలో జాప్యాలను తొలగించడం, ఏకరూపత, అవగాహన సౌలభ్యం కోసం హైకోర్టుల నియమాలను సరళీకృతం చేయడం, కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కోసం ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడం వంటివి కమిషన్ ముందు ఉన్నాయి.

ఇజ్రాయిల్ దాడుల్లో 33 మంది పాలస్తీనీయుల మృతి

- మూడో రోజు కొనసాగిన పల్స్‌పోలియో

గాజాసిటీ: అమెరికా మద్దతుతో గాజాపై గత 24 గంటల్లో ఇజ్రాయిల్ సాగించిన దాడుల్లో 33 మంది చనిపోయారు. పోలియో చుక్కల కార్యక్రమం మూడవ రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా ఇరు పక్షాలు స్వల్ప విరామం ప్రకటించాయి. మరో వైపు గాజాలోని మిగతా ప్రాంతాల్లో ఇజ్రాయిల్ యథేచ్ఛగా హత్యాకాండ సాగిస్తోంది. రఫాపై జరిగిన దాడుల్లో చనిపోయినవారిలో నలుగురు మహిళలు ఉన్నారు. ఉత్తర గాజా సిటీలోని ఆస్పత్రి సమీపంలో జరిగిన దాడిలో 8 మంది చనిపోయినట్లు పాలస్తీనియన్ సివిల్ ఎమర్జెన్సీ సర్వీస్ తెలిపింది. మిగతావారు గాజా ప్రాంతమంతటా ఇజ్రాయిల్ సాగించిన వైమానిక దాడుల్లో చనిపోయారు. మంగళవారం నాడు అల్ అక్సా అరబ్ ఆస్పత్రి వద్ద జరిగిన దాడిలో అక్టోబరు7నాటి ఘటనతో ప్రమేయమున్న హమాస్ కమాండర్‌తో సహా 8 మంది సాయుధులను హతమార్చామని ఇజ్రాయిలీ మిలిటరీ ఒక ప్రకటనలో తెలిపింది. గాజాలోని జాబాలియా శరణార్థ శిబిరంలో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ స్కూలుపై జరిగిన దాడిలో 8మంది మరణించారు. వీరందరూ ఆహారం కోసం బ్రెడ్‌లు విక్రయించే దుకాణం వద్ద నిల్చొని వుండగా ఈ దాడి జరిగింది. జెయిటోన్ ప్రాంతంలో జరిగిన దాడిలో ఒకరు మరణించగా, పలువురు గాయపడ్డారు. పోలియో వ్యాక్సిన్ కార్యక్రమం ముగిసిన వెంటనే సెంట్రల్ గాజాలోని డేర్ ఎల్ బాలాహ్ నగరంలో ఆస్పత్రి సమీపంలో సైన్యం దాడికి పాల్పడింది.



పాలస్తీనియన్ల మృతదేహాలు

కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకునే కన్నా మరింత మంది బందీలను శవపేటికల్లో పెట్టి వారి కుటుంబాలకు అప్పగించడం పైనే నెతన్యాహు ఎక్కువగా దృష్టి కేంద్రీకరిస్తున్నారని హమాస్ విమర్శించింది. గత 11మాసాలుగా కొనసాగుతున్న దాడుల్లో 40,819మంది మరణించగా, 94,291మంది గాయపడ్డారు.

నెతన్యాహుపై బైడెన్ సుతిమెత్తని విమర్శ

గాజా కాల్పుల విరమణ ఒప్పందానికి అడుగడుగునా అడ్డుతగులుతున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు వైఖరిని అమెరికా అధ్యక్షుడు బైడెన్ సుతిమెత్తగా విమర్శించారు. కాల్పుల విరమణ ఒప్పందం కోసం చేయాల్సినంత కృషి, తీసుకోవాల్సిన చర్యలు నెతన్యాహు తీసుకోవడం లేదని ఆయన అన్నారు. ఒక వైపు ఇజ్రాయిల్‌కు ఆయుధాలు, డబ్బు అందజేస్తూ దీనిని ప్రాంతీయ యుద్ధంగా మార్చాలని అమెరికా పావులు కదుపుతున్న సంగతి అందరికీ తెలిసిందే. అయినా, మభ్యపుచ్చే ఎత్తుగడలో భాగంగా నెతన్యాహుకు నొప్పి కలగని రీతిలో బైడెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. సోమవారం వైట్‌హౌస్ వెలుపల ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గాజాలో ఇజ్రాయిల్ బందీలను విడిపించేందుకు దారి తీయగల తుది ప్రతిపాదనను అమెరికా త్వరలో సమర్పించనున్నట్లు తెలిపారు.

గుజరాత్ తీరంలో కూలిన ధ్రువ్ హెలికాప్టర్

- ముగ్గురు కోస్ట్ గార్డులు గల్లంతు

న్యూఢిల్లీ : గుజరాత్ సముద్ర తీరంలో ధ్రువ్ అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ కూలిపోయిన ప్రమాదంలో ముగ్గురు కోస్ట్ గార్డులు గల్లంతయ్యారు. వీరి కోసం నాలుగు నౌకలు, రెండు యుద్ధ విమానాలతో ముమ్మరంగా గాలింపు చర్యలను అధికారులు కొనసాగిస్తున్నారు.

సోమవారం జరిగిన ఈ ప్రమాద సమయంలో నలుగురు సిబ్బంది ఉండగా, ఒకరు సురక్షితంగా బయటపడ్డారు. హెలికాప్టర్ శకలాలను గుర్తించినట్లు ఇండియన్ కోస్ట్ గార్డు (ఐసిజి) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల గుజరాత్‌లో భారీ వర్షాలు సమయంలో ఈ హెలికాప్టర్‌ను సహాయక చర్యల్లో వినియోగించారు. సుమారు 70 మంది ప్రాణాలను రక్షించింది. సోమవారం పోర్‌బందర్‌కు సముద్రంలో 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న మోటార్ ట్యాంకర్ హరిలీలాలో గాయపడిన సిబ్బందిని వైద్య సదీవయం కోసం తరలించడానికి వెళుతున్న సమయంలో హెలికాప్టర్ ఈ ప్రమాదానికి గురైంది.

2.5లక్షల మంది ఉద్యోగుల జీతాలు నిలిపివేత

- ఆస్తుల వివరాలు ఇవ్వలేదని ఆపామంటున్న యుపి సర్కార్

లక్నో : ఆస్తులకు సంబంధించిన వివరాలు ఇవ్వలేదని పేర్కొంటూ దాదాపు రెండున్నర లక్షలమంది ఉద్యోగుల జీతాలను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిలిపివేసింది. ఇటీవల ఆస్తుల వివరాలను వెల్లడించేందుకు మానవ్ సంపద పోర్టల్‌ను యుపి సర్కార్ ప్రారంభించింది. ఆ పోర్టల్‌లో ఆగస్టు 31వ తేదీ వరకు ఉద్యోగులు తమ ఆస్తుల వివరాలను తెలపాలని నిబంధన పెట్టింది. ఇప్పటివరకు 71 శాతం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమ ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని పోర్టల్‌లో పొందుపరిచారు. ఇంకా... 2,44,565 మంది ఉద్యోగులు తమ ఆస్తుల వివరాలను వెల్లడించాల్సి వుంది. ఆస్తుల వివరాలు వెల్లడించని వారందరికీ యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ఆగస్టు నెల జీతాలను నిలిపివేసింది. అన్ని శాఖలు ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా, ప్రాపర్టీ డిటైల్స్ వెల్లడించని వారి జీతాన్ని హోల్డ్‌లో పెట్టినట్లు ప్రభుత్వం చెప్పింది. ఐఎఎస్, ఐపిఎస్, పిపిఎస్, పిసిఎస్ ఆఫీసర్ల తరహాలో.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా తమ ప్రాపర్టీ వివరాలను వెల్లడించాలి. టీచర్లు, కార్పొరేషన్ ఉద్యోగులు, అటానమస్ సంస్థల ఉద్యోగులను ఈ నిబంధన నుంచి ప్రభుత్వం మినహాయించింది.

భోరు మంటున్న ఖరీఫ్ రైతు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదనలేవీ కేంద్రానికి ఇంకా చేరలేదు. కేంద్ర బృందాల పర్యటన, రాష్ట్ర ప్రభుత్వ వినతిపత్రాల అనంతరం కేంద్రం నుంచి సాధారణంగా వచ్చే విపత్తు నిధులే వస్తాయి. అందుకు సమయం పడుతుంది. ఆ లోపు రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. కాగా జులైలో కురిసిన వర్షాలకు సుమారు 1.80 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేస్తామని అసెంబ్లీలో సర్కారు వెల్లడించింది. ఆ ఫైలు ఇంకా పెండింగ్‌లోనే ఉంది. అంతలోనే మళ్లీ వర్షాలు, వరదలొచ్చి పంటలను ముంచెత్తాయి. నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు నీట మునిగాయని స్వయంగా సిఎం చంద్రబాబు చెప్పారు. నష్టాల ఎన్యుమరేషన్ ఆదేశాలు కిందికి వెళ్లాయి. పొలాల్లోనుంచి వరద నీరు పోతేకాని వాస్తవ నష్టం బయటపడదు. అందుకు సమయం పడుతుంది. తనిఖీలు, వడపోతలు, తుది జాబితాలు సిద్ధమై, నిధులు విడుదలయ్యేసరికి నెలలు గడిచేలా ఉంది. జులైలో పంటలు నష్టపోయిన రైతులు, ఇప్పుడు కూడా నష్టపోతే అటువంటి వారికి ఒక పరిహారమే అందుతుంది. మామూలుగా అయితే బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ రెండూ రైతులకు వచ్చేది. ఇప్పుడు బీమా దాదాపు లేదు. ఉన్న ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఒక నష్టానికే వస్తుంది. దానికి అర్హత సాధించడానికి పలు నిబంధనలు ఉండనే ఉన్నాయి.

రైల్లోంచి వృద్ధుడి తోసివేత కేసులో గోగూండాల బెయిల్ రద్దు

- మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశం

థానే : వృద్ధుడైన ముస్లింపై నిర్దాక్షిణ్యంగా దాడి చేసి, రైల్లోంచి తోసివేసిన గో గూండాలను అరెస్టు చేసి 24గంటలు కూడా గడవక మునుపే బెయిల్‌పై విడుదలయ్యారు. వారి బెయిల్‌ను రద్దు చేయాల్సిందిగా మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. థానే రైల్వే పోలీసులపై వచ్చిన ఒత్తిడి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. 72 ఏళ్ల వృద్ధుడిని అత్యంత పాశవికంగా కొట్టి రైల్లో నుండి తోసేసిన వారిపై బెయిల్ మంజూరుకు అవకాశం వున్న సెక్షన్ల కింద పోలీసులు కేసు పెట్టారు. దీనిపై తీవ్ర దుమారం రేగింది.

ఆగస్టు 30వ తేదీన అష్రఫ్ అలీ సయ్యద్ హుస్సేన్ జలగావ్ నుండి కల్యాణ్‌కు రైల్లో ప్రయాణిస్తున్నారు. 20ఏళ్ల వయసున్న గోగూండాలు హుస్సేన్‌పై దాడి చేశారు. రెండు పాస్టిక్ డబ్బాల్లో గొడ్డు మాంసాన్ని తీసుకెళుతున్నారంటూ.. దాడి చేసి కదులుతున్న రైల్లో నుండి తోసివేశారు. మహారాష్ట్రలో ఆవు, ఎద్దు మాంసం నిషేధం, గేదె, దున్న మాంసం చట్టబద్ధం. గోగూండాల దెబ్బలకు ప్రాణాపాయ స్థితికి ఆ వృద్ధుడు వెళ్లినా, చాలా స్వల్పమైన అభియోగాలతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులే మొదట ఇందుకు సంబంధించిన వీడియోలు విడుదల చేశారు. అవి వైరల్ అయ్యాయి. దాంతో ప్రతిపక్షాల నేతలు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా డిమాండ్ చేశారు. మత సామరస్యతకు సంబంధించిన తీవ్రమైన ఆరోపణలు నమోదు చేయాలని పోలీసులపై ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలోనే నిందితుల బెయిల్‌ను రద్దు చేస్తూ మేజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలిచ్చింది.

బ్రెజిల్‌లో ఎక్స్‌పై నిషేధం

రియో డీ జెనీరో : ఎలాన్ మస్క్ సోషల్ మీడియా వేదికైన ఎక్స్‌ను దేశవ్యాప్తంగా నిషేధించాలని బ్రెజిల్ సుప్రీం కోర్టు కమిటీ సోమవారం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఒక న్యాయమూర్తి తీసుకున్న నిర్ణయాన్ని కమిటీ మొత్తంగా సమర్ధించింది. బ్రెజిల్‌లో రాజకీయ ప్రసంగాలను సెన్సార్ చేయాలనే ఉద్దేశ్యంతో జస్టిస్ అలెగ్జాండ్రి డే మోరెస్‌ను నిరంకుశమైన తిరుగుబాటుదారునిగా చూపించేందుకు మస్క్ ఆయన మద్దతుదారులు చేసిన ప్రయత్నాలకు ఈ నిర్ణయంతో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. చట్టం ప్రకారం స్థానిక చట్ట ప్రతినిధి పేరు వెల్లడించడానికి తిరస్కరించినందుకు మొత్తంగా ఎక్స్ వేదికను నిషేధించాలని గత శుక్రవారం డీ మోరెస్ ఆదేశించారు. తన ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించే వరకు, బకాయిలను చెల్లించేవరకు ఈ సస్పెన్షన్‌ను కొనసాగించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దీంతో ఎక్స్ ఆయనతో విభేదించింది. ఈ నేపథ్యంలో సుప్రీం కమిటీ నిర్ణయం వెలువడింది.

బెంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదు

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేంద్రం

న్యూఢిల్లీ : కొల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, దారుణ హత్య అనంతరం ఆసుపత్రి, కాలేజీ ప్రాంగణంలో సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్) సిబ్బంది ద్వారా వైద్యులు, సిబ్బందికి భద్రత కల్పించే విషయంలో బెంగాల్ ప్రభుత్వం సహకరించడం లేదని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. ఈ మేరకు కేంద్ర హోం వ్యవహారాల శాఖ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. వైద్య సిబ్బందికి సిఐఎస్‌ఎఫ్ ద్వారా భద్రత కల్పించడానికి, సహాయక చర్యలకు సహకరించాలని బెంగాల్ ప్రభుత్వాన్ని ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరింది. సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది వసతి సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపింది. సుప్రీంకోర్టు ఆగస్టు 20, 22 తేదీల్లో ఇచ్చిన ఆదేశాల మేరకు అక్కడ సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని, బెంగాల్ ప్రభుత్వం తమకు సహకరికంచకపోవడం కోర్టు ధిక్కార చర్య కిందకు వస్తుందని కేంద్రం తెలిపింది.

అత్యాచార వ్యతిరేక బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఆమోదం

కొల్‌కతా : ది అపరాజిత వుమెన్ అండ్ చైల్డ్ (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ ఎమెండ్‌మెంట్) బిల్లు 2024ను పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ బిల్లును రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి మోలోయ్ ఘటక్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు చారిత్రాత్మకమైనదని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభివర్ణించారు. 'బిల్లుపై సంతకం చేయాలని గవర్నర్‌ను కోరాలని' బిజెపి ఎమ్మెల్యేలకు విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు ఆమోదం పొందిన తరువాత గడువులోగా విచారణ పూర్తి చేసేందుకు స్పెషల్ అపరాజిత టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఈ బిల్లు ప్రకారం అత్యాచారం తరువాత లేదా అత్యాచారానికి పాల్పడిన వారి చర్యల ద్వారా బాధిత మహిళ మరణించినా, మళ్లీ కోలుకోలేని స్థితిలో మహిళ ఉన్నా దోషులకు మరణశిక్ష విధిస్తారు. కొల్‌కతాలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం ఘటన నేపథ్యంలో ఈ బిల్లును బెంగాల్ ప్రభుత్వం తీసుకొచ్చింది.

ఓబుళాపురం మైనింగ్ విచారణ వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఓబుళాపురం మైనింగ్ వ్యవహారంపై కేసు విచారణ నాలుగు వారాలు వాయిదా పడింది. ఈ కేసును మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీ తవ్వకాల్లో రాష్ట్ర సరిహద్దులు చెరిగిపోవడంతో గతంలో తవ్వకాలను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసింది. రెండు రాష్ట్రాల మధ్య సరిహద్దులు గుర్తిస్తూ... 2018లో నివేదికను సర్వే ఆఫ్ ఇండియా దాఖలు చేసింది. ఈ నివేదికపై అధ్యయనం చేసి మరో నివేదికను సుప్రీంకోర్టు నియమించిన అమికస్ క్యూరీ దాఖలు చేశారు. అమికస్ క్యూరీ నివేదికపై అధ్యయనం చేయాల్సి ఉందని ధర్మాసనానికి రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది సిద్దార్థ లూథ్రా తెలిపారు. అదే సందర్భంలో తమకు కూడా కొంత సమయం కావాలని కేంద్ర ప్రభుత్వం తరపున న్యాయవాదులు కోరారు. 2009 నుంచి తమకు కేటాయించిన ప్రాంతంలో మైనింగ్ జరపడం లేదని, సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా నడుచుకుంటున్నట్లు మైనింగ్ కంపెనీల తరపున న్యాయవాదులు తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా నివేదికకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్‌కు తమకు అభ్యంతరం లేదని గతంలో అఫిడవిట్ దాఖలు చేసిందని మైనింగ్ కంపెనీల న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. అందరి వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసు విచారణ నాలుగు వారాలపాటు వాయిదా వేసింది. అమికస్ క్యూరీ నివేదికపై కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

డెంగీ అంటువ్యాధి

- ప్రకటించిన కర్ణాటక

బెంగళూరు : గతంలో ఎన్నడూ లేదని విధంగా కర్ణాటకలో ఈ ఏడాదిలో 25,408 డెంగ్యూ కేసులు నమోదు కావడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యాధిని అంటువ్యాధిగా ప్రకటించింది. ఈ మేరకు ఎపిడెమిక్ డిసీజెస్ యాక్ట్ 2020ను సవరించి కర్ణాటక ఎపిడెమిక్ డిసెజస్ (సవరణ నిబంధనలు) 2024ను గతవారం అధికారిక గెజిట్‌లో ప్రభుత్వం ప్రచురించింది. ఈ సవరించిన నిబంధనల ప్రకారం భూమి, భవనం, వాటర్ ట్యాంక్‌లు, పార్కులు, ఆట స్థలాలతో సహా ప్రతీ స్థలం యజమాని కూడా దోమల వృద్ధిని నిరోధించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడం తప్పనిసరి. నీటి నిల్వ కంటైనర్లు, సంప్‌లు, ఓవర్ హెడ్ ట్యాంకులు సురక్షితంగా కప్పబడి ఉండేలా చూసుకోవడం కూడా తప్పనిసరి. ఈ నిబంధనలను అమలు, తనిఖీ చేయడానికి బృహత్ బెంగళూరు మహానగర పాలిక (బిబిఎంపి) పరిధిలోకి వచ్చే ప్రాంతాల కోసం ఒక ప్రత్యేక అధికారి, అలాగే మిగిలిన జిల్లాలకు ఒక డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలో ఒక అథారిటీని ఏర్పాటు చేస్తారు. ఈ అథారిటీకి ఈ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించడానికి కూడా అధికారం ఉంటుంది. సహేతుకమైన నోటీసు ఇచ్చిన తరువాత సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకూ ఏ భూమినైనా, భవనాన్ని అయినా తనిఖీ చేసే అధికారం ఉంటుంది. కొత్త నిబంధనల ప్రకారం, కాంపిటెంట్ అథారిటీకి పట్టణ ప్రాంతాల్లోని గృహాలకు రూ.400, గ్రామీణ ప్రాంతాల్లో గృహాలకు రూ.200 వరకు జరిమానా విధించే అధికారం ఉంది. వాణిజ్య సంస్థలు, కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలకు పట్టణ ప్రాంతాల్లో రూ.1,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.500 జరిమానా విధిస్తారు. యాక్టివ్‌గా లేని స్థలాలు, ఖాళీ స్థలాలకు పట్టణ ప్రాంతాల్లో రూ.2,000, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,000 జరిమానా విధిస్తారు.



గురుదేవులు



పలకా బలపం పట్టి
ఓనమాలు దిద్దించి
అక్షర జ్ఞానం ఇచ్చే
ఆద్యులైన గురుదేవుల
పాదాలకు వందనాలు!
అభినందన చందనాలు!

అజ్ఞానపు చీకట్లను
అవలీలగ తరిమివేసి
విజ్ఞానపు దివ్వెలతో
వెలుగులిచ్చు గురుదేవుల
పాదాలకు వందనాలు!
అభినందన చందనాలు!


బోధనయే తపస్సుగా
సాధన తమ లక్ష్యంగా
విద్యాదానమె దీక్షగ
విద్యార్థుల తీర్చిదిద్దు
మహనీయులు గురుదేవుల
పాదాలకు వందనాలు!
అభినందన చందనాలు!

వృత్తి ధర్మమే ధ్యాసగ
క్రమశిక్షణ ధ్యేయంగా
విద్యార్థుల భవిత కొరకు
పరితపించు గురుదేవుల
పాదాలకు వందనాలు!
అభినందన చందనాలు!

కఠినమైన అంశాలను
క్లిష్టమైన సమస్యలను
స్పష్టత చేకూర్చి చెప్పు
స్రష్టలైన గురుదేవుల
పాదాలకు వందనాలు!
అభినందన చందనాలు

చదువూ సంస్కారంతో
చక్కనైన బోధనలతో
ప్రగతిపథం వైపు నడుపు
మాన్యులైన గురుదేవుల
పాదాలకు వందనాలు!
అభినందన చందనాలు!


– నాగరాజు కామర్సు, దుబ్బాక,
92480 93580



దారి చూపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న కీటకం పువ్వు దగ్గరకు చేరుకోవాలి. కాస్త దారి చూపరూ!

నేను గీసిన బొమ్మ





షేక్ సానియా సుల్తానా,
8వ తరగతి,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఉర్దూ),
కర్నూలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒప్పంద జీఓలను విస్మరించిన ప్రభుత్వం



కాకినాడలో ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న బేబిరాణి



గుంటూరులో యుపిహెచ్‌సి వద్ద నిరసన తెలియజేస్తున్న ఆశావర్కర్లు

- అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆశాల ఆందోళనలు
- మహిళా రక్షణ చట్టం చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-యంత్రాంగం

కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, డాక్టర్లకు, వైద్యఆరోగ్యశాఖ సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు మంగళవారం ధర్నాలు, నిరసనలు తెలిపారు. ఆశాడే సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పిహెచ్‌సిల వద్ద నిరసనలు తెలిపి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. కాకినాడ జిల్లా ప్రతాప్‌నగర్ పిహెచ్‌సి వద్ద ధర్నాలో సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జి.బేబిరాణి మాట్లాడుతూ కోల్‌కతా ఘటనలో నిందితులను మమతా బెనర్జీ ప్రభుత్వం కాపాడే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళలు పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులు నిరోధక కమిటీలు తక్షణమే ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఒప్పంద జిఓలను అమలు చేయాలని కోరారు. తూర్పుగోదావరి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో పిహెచ్‌సిల ఎదుట ధర్నాలు జరిగాయి.

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆశాలు నిరసనలు తెలిపి వినతి పత్రాలు అందజేశారు. ఒప్పంద జిఓలు విడుదలయ్యే వరకూ ఆశా వర్కర్ల రిటైర్మెంట్లు ఆపాలని, రికార్డులు వెంటనే ఇవ్వాలని, కోల్‌కతా వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, మహిళా రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. కర్నూలు నగరంలోని ముజఫర్‌నగర్, షరీన్‌నగర్, కల్లూరు, ఇందిరాగాంధీ నగర్, ఇల్లూరు నగర్‌లో నిరసన కార్యక్రమాలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఎమ్మిగనూరు, నంద్యాల, పగిడ్యాలలో నిరసన ప్రదర్శలు చేశారు. వైఎస్‌ఆర్ జిల్లా కడప, మదనపల్లె, రామసముద్రంలో చేపట్టిన ఆందోళనల్లో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆశా వర్కర్లకు విడుదల చేయాల్సిన ఒప్పంద జిఓలు తాత్కాలికంగా నిలుపదల చేశారని, వెంటనే వాటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. చిత్తూరు, కృష్ణా, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పిహెచ్‌సిల వద్ద ఆశా వర్కర్లు నల్ల రిబ్బన్లు కట్టుకొని ధర్నాలు చేశారు. అనంతరం వైద్యాధికారులకు, అర్బన్ హెల్త్ సెంటర్లలో హెచ్‌విలకు వినతులు అందజేశారు. నెల్లూరు జిల్లా లింగసముద్రం, టిపి గూడూరు, అనంతసాగరం, నెల్లూరు మండలాల్లో ధర్నాలు చేపట్టారు. కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా నూజివీడు, కుక్కునూరు, అమరవరం పిహెచ్‌సిల వద్ద ధర్నాలు, పశ్చిమగోదావరి జిల్లా పెనుమంట్ర, మొగల్తూరులో ఆందోళనలు చేశారు. అల్లూరి జిల్లాలోని పాడేరు, డుంబ్రిగుడ, అరకులోయ, చింతపల్లి, మారేడుమిల్లి, చింతూరు, జికె.వీధి మండలాల్లో పిహెచ్‌సిల వద్ద ఆశాలు, సిహెచ్‌సిడబ్ల్యులు ఆందోళనలు చేపట్టారు.

ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మే హక్కు మోడీకి లేదు

- 'ఉక్కు' కార్మికుల పోరాటం చిరస్మరణీయం
- ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్



బహిరంగ సభలో అభివాదం చేస్తున్న అమర్‌జిత్ కౌర్ తదితరులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు విక్రయించే హక్కు ప్రధాని మోడీకి లేదని ఎఐటియుసి జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ అన్నారు. మూడు రోజులుగా విశాఖలో జరుగుతున్న ఎఐటియుసి జనరల్ కౌన్సిల్ సమావేశం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ముఖ్య వక్తగా మాట్లాడారు. 1300 రోజులుగా స్టీల్‌ప్లాంట్ కార్మికులు చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాటం చిరస్మరణీయమైందన్నారు. ప్లాంట్ కోసం వచ్చిన బిడ్డర్లను విమానాశ్రయం నుంచి కార్మికులు బయటకు రానివ్వలేదని, అంతలా ఈ పోరాటం సాగుతోందని తెలిపారు. త్యాగాలతో ఏర్పడ్డ స్టీల్‌ప్లాంట్ రాష్ట్రానికే గర్వకారణమన్నారు. పార్లమెంటులో ఎటువంటి చర్చా లేకుండా 2020 సెప్టెంబర్ 22, 23 తేదీల్లో ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న దేశ వ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్ డే పాటించాలని నిర్ణయించాయని తెలిపారు. నవంబర్ 26న అఖిల భారత సమ్మె జరగనుందని, రైతులు, కార్మికులు భారీగా పాల్గొననున్నారని చెప్పారు. సంఘం జాతీయ అధ్యక్షులు రామేంద్ర కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి తన కార్పొరేట్ స్నేహితుల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. పెద్ద ఎత్తున ప్రకృతి వనరులను కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతోందన్నారు. దేశంలో మహిళలపై లైంగిక వేధింపులు అధికమయ్యాయని, పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. కార్మిక వర్గం ప్రస్తుతం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఎపిలో పదేళ్లుగా కనీస వేతన సలహా మండలి లేదని, ఒక పక్క ధరలు పెరుగుతున్నా కార్మికులకు తగిన వేతనాలు రావడం లేదని చెప్పారు. అసంఘటిత రంగ కార్మికులు పోరాటాల ద్వారా పని ప్రదేశాల్లో భద్రత, పనికి తగ్గ వేతనాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. సభలో సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యూసఫ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, జి.ఓబులేసు, నాయకులు డి.ఆదినారాయణ, అచ్యుతరావు పాల్గొన్నారు. తొలుత నగరంలోని సరస్వతీ పార్కు నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు 10న రాస్తారోకోలు

- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఈ నెల 10న రాష్ట్ర వ్యాప్తంగా రాస్తా రోకోలు నిర్వహించనున్నట్లు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్. నర్సింగరావు తెలిపారు. విశాఖలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ఉత్పత్తిని భారీగా తగ్గించేసిందని తెలిపారు. ఐదు వేల మంది ఉద్యోగులు ఈ మధ్య కాలంలో తగ్గారన్నారు. తాజాగా నాలుగు వేల మందికిపైగా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మరో 1,500 మందిని విఆర్‌ఎస్ పేరుతో బయటకు పంపేందుకు రూ.1261 కోట్లను కేటాయించిందన్నారు. ఉద్యోగులకు ఉన్న హక్కులన్నింటినీ తీసివేస్తున్నారన్నారు. జీతాలు సకాలంలో చెల్లించడం లేదని, కావాలనే కేంద్ర బిజెపి ప్రభుత్వం మైండ్ గేమ్ ఆడుతోందని తెలిపారు. ఐక్య పోరాటాల ద్వారానే ప్లాంట్‌ను ఇప్పటి వరకూ ప్రయివేటు పరం కాకుండా అడ్డుకోగలిగామన్నారు. సరిపడ ముడి సరుకు ఇవ్వకుండా ప్రతిరోజూ విశాఖ స్టీల్‌కు రూ.15 కోట్లు నష్టాలు వచ్చేలా కేంద్రం కుట్రలు చేస్తోందని తెలిపారు. 2021 జులై 23న టిడిపి అధ్యక్షులు చంద్రబాబు ప్లాంట్ రక్షణకు పోరాట కమిటీకి అండగా ఉంటామని లేఖ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు చంద్రబాబు ప్రభుత్వమే రాష్ట్రంలో అధికారంలో ఉన్నా కేంద్రంపై ఒత్తిడి చేయకపోవడం సరైంది కాదన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 10న ఉదయం పది గంటల నుండి 11 గంటల వరకు రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేయాలని రాష్ట్ర ప్రజలకు, కార్మిక, రైతు తదితర ప్రజా సంఘాలకు, రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పాల్గొన్నారు.

మూడు జిల్లాలకు వైసిపి జిల్లా అధ్యక్షుల నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ మూడు జిల్లాలకు, రాజమండ్రి నగరానికి నూతన అధ్యక్షులను ప్రకటించింది. ఈ మేరకు వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షులుగా అనంత వెంకట్రామిరెడ్డిని, శ్రీ సత్యసాయి జిల్లాకు మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్‌ను, తూర్పు గోదావరి జిల్లాకు మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ, రాజమండ్రి నగర పార్టీ అధ్యక్షులుగా మాజీ ఎంపి మార్గాని భరత్ రామ్‌ను నియమించారు.



వరద బాధితులకు
భారీ విరాళాలు

బాలకృష్ణ రూ.కోటి విరాళం

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని పలు ప్రదేశాలు వరదలతో విలవిలలాడుతున్నాయి. ప్రజలు ఇబ్బందుల పాలవుతున్న క్రమంలో సినీ ప్రముఖులు రెండు తెలుగు రాష్ట్రాలకు తమకు తోచినంత విరాళం ఇస్తున్నారు. ఇప్పటికే ఆయ్ మూవీ యూనిట్, కల్కి నిర్మాతలు, ఎన్టీఆర్, విశ్వక్ సేన్, దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు ఎస్. రాధాకృష్ణ, ఎస్. నాగవంశీ సహా పలువురు సినీ ప్రముఖులు రెండు రాష్ట్రాలకు సహాయం అందించారు. తాజాగా బాలకృష్ణ కూడా భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు ఆయన ఒక స్పెషల్ నోట్ షేర్ చేశారు.'50 ఏళ్ళ క్రితం మా నాన్నగారు నా నుదుటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది, 50 ఏళ్ల నుంచి నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది– వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగుజాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ రుణం తీరనిది. ఈ జన్మ మీకోసం.. మీ ఆనందం కోసం. నా ఈ



ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం తెలుగు నేలను వరద ముంచెత్తుతోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో బాధాతప్త హృదయంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు., తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు నా బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా




అందిస్తున్నాను అని ప్రకటించారు.

ఎన్టీఆర్ రూ.కోటి విరాళం

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరద బీభత్సం తనను ఎంతగానో కలచి వేసిందని జూ.ఎన్టీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విపత్తు నుంచి తెలుగు ప్రజలు తొందర్లోనే కోలుకోవాలని ఆకాంక్షించారు. సహాయక చర్యలకు తనవంతుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెరొక రూ.50 లక్షల విరాళాన్ని ప్రకటించారు. హీరో సిద్ధూ జొన్నలగడ్డ వరద బాధితులకు తనవంతుగా రూ.30 లక్షలు ప్రకటించారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15 లక్షలు, తెలంగాణాకు రూ.15 లక్షలు ఇస్తున్నట్లుగా పేర్కొన్నారు.

దర్శకుడు త్రివిక్రమ్, నిర్మాతలు రాధాకృష్ణ, నాగవంశీ కూడా సాయాన్ని ప్రకటించారు. తమ సొంత నిర్మాణ సంస్థలైన హారిక అండ్ హాసిని క్రియేషన్స్, సితార ఎంటర్‌టైన్‌మెంట్ పేర్లతో రూ.50 లక్షలు ప్రకటించారు. తెలంగాణాకు రూ.25 లక్షలు, ఎపికి రూ.25 లక్షలు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ విపత్తు వల్ల ఆస్తి, ప్రాణ నష్టాలు తమకు ఎంతగానో కలచి వేశాయని పేర్కొన్నారు. హీరో విశ్వక్ సేన్ కూడా రెండు రాష్ట్రాలకు కలిపి రూ.10 లక్షలు ప్రకటించారు. దర్శకుడు వెంకీ అట్లూరి కూడా రెండు రాష్ట్రాలకు రూ.5 లక్షలు చొప్పున రూ.10 లక్షలు ప్రకటించారు.

చట్టాలను మార్చాల్సిన టైం ఇది : అనన్య పాండే



మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి బాలీవుడ్ నటి అనన్య పాండే తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. గతంతో పోలిస్తే ఇప్పుడు నటీమణులు వారి సమస్యలను ధైర్యంగా చెప్పగలుగుతున్నారని అన్నారు. 'సమాజంలో జరుగుతున్న ప్రతి విషయం గురించి మహిళలకు అవగాహన ఉండాలి. ప్రస్తుతం చాలా దారుణమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. ఇది మహిళలకు చీకటి కాలం. ఈ దాడులను ఆపడం కోసం ఏం చేయాలో ఆలోచించాలి. మన చుట్టూ ఉండే పరిసరాలను గమనించుకుంటూ ప్రతి వ్యక్తిపైనా అవగాహన కలిగిఉండాలి. నేను ఇలాంటి పరిస్థితులపై ఎప్పటికప్పుడు చర్చిస్తూనే ఉంటాను. వాస్తవానికి చట్టాలను మార్చాల్సిన సమయం వచ్చింది. ఇది చాలా అవసరమైన నిర్ణయం. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నా' అని అన్నారు.

6న '35-చిన్న కథకాదు' విడుదల



నివేదా థామస్, ప్రియదర్శి పులికొండ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించిన చిత్రం '35–చిన్నకథ కాదు'. నందకిశోర్ ఈమని దర్శకత్వం వహించిన ఈ మూవీని రానా దగ్గుపాటి సమర్పణలో సురేశ్ ప్రొడక్షన్స్, ఎస్ ఒరిజినల్స్, వాల్టెయిర్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా ఈనెల ఆరోతేదీన విడుదలకు సిద్ధమైంది. ఈ విషయాన్ని టాలీవుడ్ హీరో రానా ట్విట్టర్ ద్వారా షేర్‌చేశారు. ప్రియదర్శి బర్త్‌డే కావటంతో రిలీజ్‌తోపాటు స్పెషల్ పోస్టర్‌ను పంచుకున్నారు. మిడిల్ క్లాస్ ఫ్యామిలీ ఎమోషన్స్ కథాంశంతో ఈ సినిమాను రూపొందించారు. ఈ మూవీలో విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ కీలకపాత్రలు పోషించారు.

400మీ. పరుగులో దీప్తికి కాంస్యం



పారిస్: పారా ఒలింపిక్స్‌లో ఐదోరోజు భారత్‌కు కాంస్య పతకం ఒక్కటే లభించింది. మహిళల 400మీ. టి–20 విభాగంలో దీప్తి జీవన్‌జి 55.82సెకన్లు గమ్యానికి చేరి మూడోస్థానంలో నిలిచింది. ఈ విభాగంలో సులియర్(ఉక్రెయిన్) 55.16సెకన్లు స్వర్ణ పతకం చేజిక్కించుకోగా.. టర్కీ రన్నర్ 55.23సెకన్ల రెండోస్థానంలో నిలిచి రజత పతకం సాధించింది. ఇక షూటింగ్ 50మీ. రైఫిల్ పొజిషన్–3లో అవని లేఖరా ఫైనల్‌కు చేసి పతకంపై ఆశలు కొద్ది గంటల్లోనే ఆవిరయ్యాయి. ఫైనల్లో తొలుత ఆధిక్యత నిలిచిన అవని.. క్రమంలో పాయింట్లను కోల్పోయి 420.6పాయింట్లతో 5వ స్థానానికే పరిమితమైంది. ఇక బుధవారం జరిగే పురుషుల జావెలిన్ త్రో ఎఫ్–46లో యాదవ్ సింగ్‌పైనే ఆశ లు ఉన్నాయి. అతనితోపాటు రింకు, ఎస్.ఎస్. గుజ్జర్ కూడా పతక పోటీ రేసులో నిలిచారు. ఇక మహిళల షాట్‌పుట్‌లో జాధవ్ నిరాశపరిచింది. ఆమె గుండును 7.28మీ. విసిరి 5వ స్థానంలో నిలిచింది.

ఫైనల్లో నిరాశపర్చిన అవని

10మీ. ఎయిర్ పిస్టల్ విభాగంలో పసిడి సాధించిన అవని లేఖరా.. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్‌లో ఫైనల్‌కు చేరి పతకంపై ఆశలు రేపింది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో అవని 7వ స్థానంలో నిలిచి ఫైనల్‌కు క్వాలిఫై అయింది. మరో భారత పారా షూటర్ మోనా అగర్వాల్ నిరాశపరిచింది. ఈ విభాగంలో హిల్‌ట్రాప్(జర్మనీ) 456.5పాయింట్లు స్వర్ణ పతకం చేజిక్కించుకోగా..

50మీ. రైఫిల్–3 పొజిషన్‌లో ఫైనల్లో అవని లేఖరాకు నిరాశ
పారిస్ పారా ఒలింపిక్స్

వాడోవికోవా(క్రొయేషియా) 456.1 పాయింట్లు, సిపి జంగ్(చైనా) 446.0పాయింట్లు రజత, కాంస్య పతకాలను చేజిక్కించుకున్నారు.

పారా ఒలింపిక్స్‌లో ట్రాన్స్‌జండర్



పారిస్‌లో అందుకు భిన్నంగా ఓ ట్రాన్స్‌జెండర్ బరిలో నిలిచింది. 50ఏళ్ల వయసులో. పారా ఒలింపిక్స్ పాల్గొన్న ఇటలీకి చెందిన వాలెంటీనా పెట్రిల్లో ఓ ట్రాన్స్‌జండర్. ఆమెకు కళ్లు కనపడవు. చూపు సరిగ్గా లేకున్నా సరే ఆమె పరుగు పందెంలో రాణించింది. అలా ఈ ఏడాది పారా ఒలింపిక్స్‌కు వాలెంటీనా అర్హత సాధించింది. టి12 400 మీటర్ల క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆమె మెరుపు వేగంతో 53.35 సెకన్లలో గమ్యాన్ని చేరుకొని సెమీస్‌కు చేరింది.

చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్
రెండోటెస్ట్‌లో పాకిస్తాన్‌పై ఆరు వికెట్ల తేడాతో గెలుపు



ట్రోఫీని అందుకుంటున్న బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్

రావల్పిండి: టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. పాకిస్థాన్‌తో రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసి ఈ రికార్డును సాధించింది. టెస్టుల్లో పాక్‌పై బంగ్లాదేశ్ సిరీస్ గెలవడం, క్లీన్ స్వీప్ చేయడం ఇదే మొదటిసారి. రావల్పిండి వేదికగా జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. 185 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్ నైట్ స్కోరు 42 పరుగులతో మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లాదేశ్ 56ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. ఓపెనర్లు జకీర్ హసన్(40), షాద్మాన్ ఇస్లామ్(24), నజ్ముల్ హొస్సేన్ శాంటో(38), మోమినుల్ హక్(34), ముష్ఫికర్ రహీమ్(22నాటౌట్), షకీబ్ అల్ హసన్ (21నాటౌట్) రాణించారు. పాక్ బౌలర్లలో మీర్ హంజా, షాజాద్, అబ్రార్ అహ్మద్, ఆఘా సల్మాన్ తలో వికెట్ పడగొట్టారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ లింటన్ దాస్‌కు, సిరీస్ మెహిదీ హసన్‌కు లభించింది. ఇప్పటి వరకు బంగ్లాదేశ్ విదేశాల్లో రెండు టెస్టు సిరీస్‌లను గెలుచుకున్నది. 2009లో వెస్టిండీస్‌తో, 2021లో జింబాబ్వేతో జరిగిన సిరీస్‌ల్లో విజయం సాధించింది.


స్కోర్లు(సంక్షిప్తంగా)... పాకిస్థాన్ 274, 172 బంగ్లాదేశ్ 262, 185/4

పతకాల పట్టిక

దేశం	స్వ	ర	కా	మొ
1. చైనా	50	37	20	107
2. బ్రిటన్	29	16	12	57
3. అమెరికా	18	21	11	50
4. బ్రెజిల్	13	9	22	44
5. ఫ్రాన్స్	11	12	15	38
6. ఆస్ట్రేలియా	9	9	13	31
7. ఇటలీ	8	8	16	32
8. నెదర్లాండ్స్	8	4	4	16
9. ఉక్రెయిన్	7	14	19	40
10. ఉజ్బెకిస్తాన్	6	4	4	14
18. ఇండియా	3	5	8	16

నోట్: స్వ:స్వర్ణం, ర:రజతం; కా:కాంస్యం; మొ:మొత్తం

క్వార్టర్స్‌కు సిన్నర్, డి-మినర్
యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్





న్యూయార్క్: యుఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, ఇటలీకి చెందిన జెన్నిక్ సిన్నర్ ప్రవేశించాడు. మంగళవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో సిన్నర్ 7–6(7–3), 7–6(7–5), 6–1తో 14వ సీడ్, అమెరికాకు చెందిన టామీ పాల్‌ను చిత్తుచేశాడు. తొలి రెండు సెట్‌లను టై బ్రేక్‌లో చేజిక్కించుకున్న సిన్నర్.. మూడో సెట్‌లో ప్రత్యర్థిపై సునాయాసంగా గెలుపొందాడు. మరో ప్రి క్వార్టర్స్‌లో ఆస్ట్రేలియాకు చెందిన 10వ సీడ్ డి–మినర్ 6–0, 3–6, 6–3, 7–5తో తన దేశానికే చెందిన థాంప్సన్‌ను ఓడించాడు.

స్వియాటెక్, హడ్డాడ్ కూడా..

ఇక మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోకి టాప్‌సీడ్, పోలండ్‌కు చెందిన ఇగా స్వైటెక్, 22వ సీడ్, బ్రెజిల్‌కు చెందిన హడ్డాడ్ మలా కూడా ప్రవేశించారు. మంగళవారం జరిగిన ప్రి క్వార్టర్‌ఫైనల్లో స్వైటెక్ 6–4, 6–1తో 16వ సీడ్, రష్యాకు చెందిన సంసునోవాను చిత్తుచేయగా.. హడ్డాడ్ 6–3, 3–6, 6–3తో అన్‌సీడెడ్, మాజీ ప్రపంచ నంబర్‌వన్ క్రీడాకారిణి, డెన్మార్క్‌కు చెందిన వాజ్నియాకీను ఓడించింది.

క్వార్టర్‌ఫైనల్స్(సింగిల్స్)...

పురుషులు	మహిళలు
ఫ్రిట్జ్(12) × జ్వెరేవ్(4)	బడోసా(26) × నవ్రాత్రో(13)
డిమిట్రోవ్(9) × టఫీ(20)	జెంగ్(7) × సబలెంకా(2)
డ్రాపర్(25) × డి–మినర్(10)	హడ్డాడ్ (22) × ముఛోవా
సిన్నర్ × మెద్వదెవ్(5)	స్వియాటెక్(1) × పెగూలా(6)

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68